హైదరాబాద్
సంపుటి 6
సంచిక: 260
11, ఆదివారం
మార్చి, 2018

ఆదివారం మన తెలంగాణ

www.manatelangana.news
అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

Mana Telangana

పాఠశాల బాలికలకు

హెల్త్‌కిట్?

బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే అవకాశం

ఈ సారి రూ.1.80 లక్షల కోట్లకు చేరనున్న పద్దు?



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు 19% వృద్ధిరేటు ఉన్నందున రానున్న సంవత్సరానికి సమర్పించబోయే రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు ఇదే స్థాయిలో పెరుగుదల ఉండవచ్చని ఆర్థికశాఖ అధికారులు సూచన ప్రాయంగా తెలిపారు. గతేడాది బడ్జెట్ రూ.1.49 లక్షల కోట్లుగా ఉంటే రానున్న బడ్జెట్ దాదాపు రూ. 1.80 లక్షల కోట్ల వరకు ఉండవచ్చని తెలిసింది. ఈ సారి బడ్జెట్‌లో రైతులక్ష్మి కి సుమారు రూ. 12 వేల కోట్లను

తరువాయి 6లో

మన రొయ్యలపై ట్రంప్ కినుక

పన్ను మూడు రెట్లు పెంపు

- 0.84% నుంచి 2.34 శాతానికి చేరిక
- అమెరికాలో సాధారణ కంటే తక్కువకు విక్రయిస్తున్నందున పెంచినట్లు ప్రకటన



11 లో



మహారాష్ట్రలో నిర్విరామంగా రైతు పోరు

10 లో

- 30 వేల మందితో భివాండి చేరిన యాత్ర

కాలిఫోర్నియాలో ముగ్గురు మహిళల కాల్చివేత

11 లో

- సైనిక పునరావాస కేంద్రంలో దుండగం



కారుణ్య ఉత్తర్వులు

సిఎం కెసిఆర్ నిర్ణయం మేరకు సింగరేణి సంస్థ సర్క్యులర్ జారీ

పనికి అనర్హులు అయిన స్త్రీ, పురుష కార్మికుల పిల్లలకు, చట్టబద్ధంగా దత్తత తీసుకున్న వారికి, వారస మహిళలకు, పిల్లలు లేని వారి భార్యలకు, వితంతు కుమార్తెకు, కోడలుకి, అల్లుడికి, అవివాహిత కుమారుడికి వర్తింపు

ఇప్పటి నుంచి అమలుకు వీలుగా చట్ట సవరణ

హైకోర్టు తీర్పు సమగ్ర అధ్యయనం తరువాత సర్క్యులర్ జారీ

మన తెలంగాణ / హైదరాబాద్ : సింగరేణి కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టనున్నట్లు సిఎం కెసిఆర్ ఇటీవల ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చింది. కారుణ్య నియామకాలను చేపట్టడానికి సింగరేణి సంస్థ శనివారం సర్క్యులర్ జారీ చేసింది. అనారోగ్యంతో బాధపడుతూ విధి నిర్వహణలో పాలుపంచుకోలేని కార్మికుల, సర్వీసులో ఉంటూ చనిపోయిన కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాలను చేపట్టనున్నట్లు సర్క్యులర్ జారీ కావడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, చొరవ తీసుకున్న ఎంపి కవితకు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపైన పనిచేయడానికి వైద్యపరంగా శాశ్వతంగా సాధ్యంకాని కార్మికుల పిల్లలతో పాటు సర్వీసులో ఉంటూ చనిపోయిన వారి పిల్లలకు ఈ పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు సంస్థ ఆ సర్క్యులర్‌లో పేర్కొంది. హైదరాబాద్ హైకోర్టు గతేడాది మార్చిలో ఒక పిటిషన్‌ను విచారించిన అనంతరం వెలువరించిన తీర్పును పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన

తరువాయి 6లో



ఫ్రాన్స్‌తో 14 ఒప్పందాలు

- ఉగ్రవాదంపై పోరు రెండు దేశాల నిర్ణయం
- మేకిన్ ఇండియాలో పెట్టుబడులకు ప్రధాని మోడీ పిలుపు

10 లో



మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ విఫలం

- భగ్నం చేసిన పోలీసులు
- కోదండరామ్, తదితరులు అరెస్టు

మన తెలంగాణ/ హైదరాబాద్ : మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభను పోలీసులు భగ్నం చేశారు. ట్యాంక్‌బండ్‌తో పాటు హైదరాబాద్‌లోకి ప్రవేశించే అన్ని రహదారులను పోలీసులు అష్టదిగ్బంధం చేశారు. ముఖ్య నాయకుల నివాసాలు, ప్రజా సంఘాల కార్యాలయాలు, ప్రధాన కూడళ్ళ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి, భారీస్థాయిలో పోలీసు

తరువాయి 6లో

1 నుంచి ఇ-వే బిల్లు

- రాష్ట్రాల మధ్య రవాణాకు దశల వారీగా ప్రారంభమై జూన్ 1వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా అమలు
- జిఎస్‌టి మండలి సమావేశంలో నిర్ణయం



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను(జిఎస్‌టి) ఎగవేతను నిరోధించేందుకు ప్రవేశపెట్టిన ఇ-వే బిల్లు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానుంది. ఆ రోజు నుంచి దశలవారీగా రాష్ట్రాల మధ్య జరిగే సరుకు రవాణాకు ఇ-వే బిల్లు ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. జూన్ 1 నాటికి దేశవ్యాప్తంగా ఇ-వే బిల్లు అమలులోకి వస్తుందని పేర్కొంది. ఈ మేరకు శనివారం జిఎస్‌టి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. వ్యాపార సంస్థలు తమ జిఎస్‌టిఆర్ 3బి రిటర్నులను దాఖలు చేసుకోడానికి జూన్ వరకు జిఎస్‌టి మండలి పొడిగించింది. ప్రస్తుతమున్న ఈ విధానాన్ని మరి మూడు నెలలకు పొడిగించింది. జిఎస్‌టి మండలి సమావేశం తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాల మధ్య రవాణా అయ్యే సరకుల ఎలక్ట్రానిక్ ఇ-వే బిల్లు లేక ఇ-వే బిల్లును ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రాల లోపల రవాణా ఇ-వే బిల్లును ఏప్రిల్ 15 నుంచి జూన్ 1 వరకు అన్ని రాష్ట్రాలకు దశల వారీగా విస్తరిస్తామన్నారు. అయితే జిఎస్‌టి రిటర్న్‌ల సరళీకరణపై జిఎస్‌టి మండలి తన సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. జిఎస్‌టి ఎగవేతను నిరోధించేందుకు ఒక పేజీలో ఉండే విధంగా సులభ పద్ధతిలో ఫారం రూపొందించే బాధ్యతను సుశీల్ మోడీ నేతృత్వంలోని మంత్రిత్వ సంఘానికి అప్పజెప్పారు. ప్రస్తుత జిఎస్‌టి విధానాన్ని 3 నెలల వరకు పొడిగించినట్లు జైట్లీ తెలిపారు. ఎగుమతిదారులకు సైతం పన్ను మినహాయింపులను మరి ఆరు నెలలు అంటే సెప్టెంబర్ వరకు పొడిగించారు.

సమగ్రాభివృద్ధితోనే సామాజిక న్యాయం

- జాతీయ చట్టసభల సభ్యుల సదస్సులో ప్రధాని మోడీ

6 లో

2 లో

గీతంలో బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

- ఐదవ అంతస్తు నుంచి దూకి దుర్మరణం
- సంగారెడ్డి జిల్లా రుద్రారంలో విషాదం

పాత కౌన్సిల్ భవనంలోనే సమావేశాలు

భవనాన్ని అప్పగించిన ఆంధ్రప్రదేశ్



మన తెలంగాణ / హైదరాబాద్ : ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలిగా ఉపయోగించుకున్న భవనాన్నే ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం వినియోగించుకోడానికి వీలు కలిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత భవనాల విభజనలో భాగంగా పాత శాసనమండలి భవనం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడడంతో ఇంతకాలం అది ఆ రాష్ట్ర ఆధీనంలో ఉండిపోయింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం జూబ్లీహాల్‌ను శాసనమండలి అవసరాల కోసం వాడుకుంటూ ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసనసభ సమావేశాలను ఇటీవలి కాలంలో సొంత రాష్ట్రంలోనే నిర్వహించుకుంటూ ఉన్నందు వల్ల పాత శాసనసభ భవనం, పాత శాసనమండలి భవనాలు ఖాళీగానే ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం కొత్త

తరువాయి 6లో

కుంచెపోటు



ఎన్నికల్లో పోటీ చేయటమెందుకు? మీరు గెలిచినా, వాళ్లు గెలిచినా అధికారంలోకి వచ్చేది వాళ్లేగా!

విద్యుత్‌లో మేమే

నెంబర్ 1

- మౌలిక సదుపాయాల కల్పనలో శీఘ్ర ఫలితాలు సాధిస్తున్నాం
- 51వ స్కోచ్ సమ్మిట్‌లో మంత్రి కెటి రామారావు



మన తెలంగాణ/ న్యూఢిల్లీ: దేశంలోనే అత్యున్నత పారిశ్రామిక విధానాన్ని తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తోందని రాష్ట్ర ఐటి, మున్సిపల్ శాఖ మంత్రి కెటి రామారావు చెప్పారు. శనివారం ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన 51వ స్కోచ్ సమ్మిట్‌లో కెటిఆర్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, పారిశ్రామిక రంగం, స్కిల్ డెవెలప్‌మెంట్‌లో దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రం ఉందని మంత్రి తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి ఎంతో శ్రమిస్తున్నామని, ఆ దిశలో ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయని మంత్రి వివరించారు. విద్యుత్ రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందుందని తెలిపారు. 24 గంటలు విద్యుత్

తరువాయి 6లో

రైలుకింద పడి ప్రేమజంట ఆత్మహత్య

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట శివారులో ఘటన

మన తెలంగాణ / రామన్నపేట: కులాలు వేరు కావడంతో తమ ప్రేమను ఇరువురి కుటుంబ సభ్యులూ ఇక ఒప్పుకోరని కలిసి జీవించే కంటే చనిపోవడం మేలని భావించి మనస్తాపంతో ఓ ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం ఉదయం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం పల్లె పహాడ్ గ్రామానికి చెందిన చిర్రబోయిన అయిలయ్య, ధనమ్మల ఏకైక కుమారుడు గణేష్(22) అదే గ్రామానికి చెందిన బొంత శంకరయ్య,



ఫైల్

లక్ష్మిల కుమార్తె పూజితలు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. పూజిత ప్రస్తుతం అమ్మనబోలు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతుంది. గణేష్ ఇంటర్ పూర్తి చేసి తండ్రికి పనిలో సహాయంగా

తరువాయి 6లో

ఈ బడ్జెట్‌లోనే బిసి డిక్లరేషన్‌ను ప్రవేశపెట్టాలి



మన తెలంగాణ/హైదరాబాద్: బిసి డిక్లరేషన్ అంశాలను రానున్న బడ్జెట్‌లో పెట్టాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, శాసన సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బిసిల అభివృద్ధి, విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై ముఖ్యమంత్రి కెసిఆర్ గత డిసెంబర్‌లో పార్టీలకతీతంగా శాసన సభ్యు లు, శాసన మండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులతో చర్చలు జరిపి 200కు పైగా ముసాయిదా తీర్మానాలు తయా రు చేశారని, ఏకగ్రీవంగా తయారు చేసిన ఈ డిమాండ్లకు వచ్చే బడ్జెట్ లో ఆ మేరకు కేటాయింపులు జరుపాలని కోరారు. ఆర్ కృష్ణయ్య శనివారం మీడియాతో మాట్లాడుతూ, బిసిల అభివృద్ధి పథకాలకు రూ.10 వేల కోట్లు, సబ్ ప్లాన్‌కు రూ.20 వేల కోట్లు, ఎంబిసి కార్పొరేషన్‌లకు ఏటా రెండు వేల కోట్లు, బిసి కుల వృత్తుల ఫెడరేషన్లకు కులాల జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్ కేటాయింపులు జరుపాలని కోరారు. కల్లుగీత కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు, మత్స్యకారుల కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు, వడ్డెర ఫెడరేషన్‌కు రూ.250 కోట్లు, రజక ఫెడరేషన్‌కు రూ.250 కోట్లు, నాయి బ్రహ్మణ ఫెడరేషన్‌కు రూ.250 కోట్లు, విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్‌కు రూ.400 కోట్లు, కుమ్మర/ శాలివాహన ఫెడరేషన్‌కు రూ.250 కోట్లు, ఉప్పర ఫెడరేషన్‌కు రూ. 250 కోట్లు, మేదర కార్పొరేషన్‌కు రూ.250 కోట్లు, పూసల/కృష్ణబలిజ ఫెడరేషన్‌కు రూ.250 కోట్లు, భట్రా జు ఫెడరేషన్‌కు రూ.100 కోట్ల చొప్పున నిధులు కేటాయించాలన్నారు.

అంతరిక్షయానంలో ఎంతో అభివృద్ధి



మనతెలంగాణ/హైదరాబాద్ : దేశంలో 40 ఏళ్లలో అంతరిక్షయానంలో ఎంతో అభివృద్ధి సాధించామని మిస్సైల్, స్ట్రాటజిక్ సిస్టమ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం మహీంద్రా ఈకోల్ సెంట్రల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేక్ ఇన్ ఇండియా ఆవశ్యకతను వివరించారు. కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ యాజుల మేధూరి, కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్ పాల్గొని ప్రసంగించారు.

గీతంలో బిటెక్ విద్యార్థి ఆత్మహత్య



మనతెలంగాణ/రామచంద్రాపురం: సంగారెడ్డిజిల్లా, రుద్రారంలోని గీతం యునివర్సిటీలో బిటెక్ చదువుతున్న ఓ విద్యార్థి కళాశాలలోని ఐదవ అంతస్తునుండి దూకి బలవన్మరణం చెందాడు. గుంటూరు జిల్లా కు చెందిన రమేష్ చాలా కాలం క్రితం నగరానికి వలస వచ్చి నిజాంపేట్‌లో స్థిరపడి భార్య పద్మతోపాటు ఇద్దరు కుమారులతో కలిసి జీవిస్తున్నారు. రమేష్ పెద్ద కుమారుడైన సూర్యఫణిభూషన్(20) రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఇసిసి బ్రాంచ్ బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. కాగా రోజుమాదిరిగానే శనివారం ఉదయం 7 గంటలకు కళాశాలకు వచ్చిన ఫణిభూషన్ దాదాపు 8గంటలకు ఐదవ అంతస్తు నుండి కిందకు దూకాడు. దీన్ని గమనించిన యాజమాన్యం చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ మధ్య జరిగిన పరీక్షల్లో ఫణిభూషన్‌కు తక్కువ మార్కులు వచ్చాయన్న కారణంగానే ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పటాన్‌చెరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి


ఖార్గోన్ : మధ్యప్రదేశ్‌లోని ఖార్గోన్ జిల్లాలో ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టడంతో అక్కా తమ్ముడు సహా మరో వ్యక్తి మృతి చెందారు. శుక్రవారం రాత్రి తిక్రిలోని వివాహ వేడుకకు హాజరై ఇంటికి తిరిగి వస్తుండగా ఘటన జరిగిందని పోలీస్ ఇంచార్జ్ దినేశ్ కుష్వా తెలిపారు. మృతులు కుందన్ (20), జ్యోతి(16),ఆమె తమ్ముడు శుబమ్ (15)గా గుర్తించారు. ఘటన జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నారు. బస్సు పుణె నుంచి రాజస్థాన్‌లోని సీకర్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆజం ఖాన్ ఖిల్జీ వంటివాడు

ముంబయి : సమాజ్‌వాది పార్టీ నాయకుడు అజం ఖాన్ అల్లా ఉద్దీన్ ఖిల్జీ లాంటి వాడని ప్రముఖ నటి జయప్రద ఆరోపించారు. తాను యుపి నుంచి ఎన్నికలలో పోటీ చేసిన సమయంలో తరచూ ఆయన తనను వేధించాడని జయప్రద చెప్పారు. పద్మావత్ సినిమా చూసినప్పుడు తనకు ఖిల్జీ పాత్ర రాగానే ఖాన్ గుర్తుకు వచ్చాడని ఆయన ఆగడాలు ఈ విధంగా ఉన్నాయన్నారు. యుపిలో రామ్‌పూర్ నియోజకవర్గం ఎంపిగా గతంలో జయప్రద ఉన్నారు. అప్పట్లో జయప్రద సమాజ్ వాది పార్టీలో ప్రముఖ నేతగానే ఉన్నారు. ఆమెకు, అజంఖాన్‌కు మధ్య పలు వివాదాలు చెలరేగాయి. తనకు వ్యతిరేకంగా అజం తప్పుడు పోస్టర్లు వేశారని అప్పట్లో జయప్రద ఆరోపించారు. ఆమెను అజం కించపరిచే విధంగా మాట్లాడేవారని పత్రికలలో వార్తలు వచ్చాయి. ఆయనకు అదును చూసుకుని తగు విధంగా బుద్ధి చెపుతానని అప్పట్లో జయప్రద ఎదురుదాడికి దిగారు. ఇటీవల విడుదల అయిన పద్మావత్ చిత్రంలో అల్లా ఉద్దీన్ ఖిల్జీ పలు దుష్ట చర్యలకు దిగేవాడని అత్యాచారాలకు ఒడిగట్టాడని తెలిపే పలు సన్నివేశాలు ఉన్నాయి.

భారీగా కంది బకాయిలు

- **మొత్తం రూ.968 కోట్ల కందుల కొనుగోళ్లు**
- **చెల్లింపులు నామమాత్రమే**
- **కేంద్రం కొన్నదానికీ పూర్తి స్థాయిలో రాని సొమ్ము**



మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో కందులు అమ్ముకున్న రైతులకు నగదు చెల్లింపులు సమయానికి అందడం లేదు. పంటను అమ్మిన 48 గంటల్లో రైతు ఖాతాకు సొమ్ము చేరాల్సి ఉన్నా నెల దాటినా చెల్లింపులు జరగలేదు. నిత్యావసరాల కోసం సైతం రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది. దాదాపు 15 లక్షల టన్నులకు పైన కంది రైతులు పంటను అమ్ముకుని రావాల్సిన సొమ్ము కోసం బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.53 లక్షల టన్నుల వరకు కందులను అధికారులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారు. కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్, హాకాల ద్వారా 75, 300 టన్నులు కొనుగోళ్ళు జరిగాయి. క్వింటాల్‌కు రూ.5450 మద్దతు ధర ప్రకారం రూ. 410.39 కోట్లు చెల్లించాల్సి ఉండగా కొంత మొత్తం చెల్లిం పు మాత్రమే జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తుది బిల్లులు పంపడంలో జాప్యం చేసిన కారణంగా నాఫెడ్ నుంచి పూర్తిస్థాయిలో సొమ్ము రాలేదని తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన 1.77 లక్షల టన్నులకు రూ. 968 కోట్లు చెల్లించాల్సి ఉంది. మార్క్‌ఫెడ్, హాకాలకు ప్రభుత్వ గ్యా రంటీ ద్వారా మొత్తంగా రూ. 600 కోట్లు రుణం తీసుకోవాలని సూచించింది. అయితే బ్యాంకులు రుణం మంజూరుకు ఆమోదం తెలిపినప్పటికీ పూర్తిగా నిధులు విడుదల చేయలేదని తెలిసింది. ఒక్క మార్క్‌ఫెడ్ నుంచే రూ. 400 కోట్లు వరకు రైతులకు బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. అలాగే మిగిలిన రూ.268 కోట్లకు ఎప్పుడు గ్యారంటీ సమర్పించి, నిధులు మంజూరు చేయించుకుంటారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

మహిళపై గ్యాంగ్ రేప్

- **వీడియోలో చిత్రీకరణ**
- **నెల రోజుల క్రితం దారుణం**

కోటా : రాజస్థాన్‌లో 40 ఏళ్ల మహిళపై ఆరుగురు యువకులు సామూహిక అత్యాచారం జరిపారు. పైగా అత్యాచార ఘటనను చిత్రీకరించి, వీడియోలో పెట్టారు. బరాన్ జిల్లాలో కోటాలో ఒక దాబాలో పని మనిషిగా ఉంటోన్న మహిళపై ఆరుగురు యువకులు నెలరోజుల క్రితం దారుణానికి పాల్పడ్డారు. అయితే వారిని ఏమీ చేయలేమనే ఆవేదనతో , పోలీసులు నిబంధనల గురించి తెలియని మహిళ తనకు జరిగిన అవమానం గురించి ఎవరికీ చెప్పుకోకుండా నెట్టుకొచ్చింది. అయితే మృగాలలాగా వ్యవహరించిన యువకులు ఆ మహిళ ఏమి చేయలేదని తెలుసుకుని, తమ రాక్షసకాండను ఏకంగా వీడియోలో పెట్టారు. దీనితో రంగంలోకి దిగిన పోలీసులు ఇప్పుడు వారిపై కేసులు పెట్టారు. కానీ ఇంతవరకూ అరెస్టులు జరగలేదు. నెట్‌లో తనపై జరిగిన అత్యాచారం వీడియోగా వస్తోందని తెలుసుకున్న మహిళ స్థానిక మహిళా పోలీసు స్టేషన్‌లో దారుణం గురించి ఫిర్యాదు చేసింది. దాబా లో పనిచేసే తాను అత్తింటి వారికి వెళ్లినప్పుడు చేతన్ మీనా అనే 21 ఏళ్ల యువకుడు కలిసి బైక్‌పై తీసుకుని వెళ్లాడు. ఇం టికి చేరుస్తానని చెప్పి మారుమూల ప్రాంతానికి తీసుకువెళ్లినట్లు తరువాత మరో ఐదుగురు అక్కడికి వచ్చి తనను బలవంతంగా అనుభవించారని మహిళ ఫిర్యాదు చేసింది. చేతన్ తనకు తెలిసిన వ్యక్తే కావడంతో వెంట వెళ్లానని తెలిపింది. వంతులు వారిగా తనపై జరిపిన అత్యాచారాన్ని వారు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించినట్లు తెలిసిందని మహిళ వాపోయింది. అత్యాచారం తరువాత ఆమెను అత్తింటి వారి వద్ద వదిలి వెళ్లారు. పోలీసులకు కానీ ఇతరులకు కానీ విషయం తెలియచేస్తే కుటుంబ సభ్యులను చంపివేస్తామని వారు బెదిరించినట్లు ఆమె తమ ఫిర్యాదులో తెలిపింది. సోమవారం ఆమె మెజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇవ్వనుంది. ప్రస్తుతం ఈ కేసు విచారణను బరాన్ డిఎస్‌పి పరిధికి బదిలీ చేశారు. స్థానిక మహిళా పోలీసు స్టేషన్ అధికారిణుల చొరవతో కేసు దర్యాప్తు వేగవంతం అయింది.

ముగిసిన 'గ్రామాల విలీన' ప్రక్రియ

- **న్యాయశాఖ పరిశీలనలో 'మున్సిపల్ చట్ట సవరణ బిల్లు'**
- **ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఆమోదానికి చర్యలు**

మన తెలంగాణ/హైదరాబాద్ : గ్రామ పంచాయతీల విలీనం, తదితర అంశాలపై ప్రభుత్వం 'మున్సిపల్ చట్ట సవరణ బిల్లు' రూపకల్పన కసరత్తును దాదాపు పూర్తిచేసింది. దీనికి సంబంధించిన అంశాలను న్యాయశాఖ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఈ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. గ్రామ పంచాయతీలను నగర పంచాయతీలుగా, మున్సిపాలిటీలుగా, కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు న్యాయపరమైన చిక్కులు రాకుండా అధికార యంత్రాంగం జాగ్రత్త పడుతోంది. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని రూపొందించిన ఈ బిల్లులో లోపాలు లేకుండా న్యాయశాఖ పరిశీలిస్తోంది. త్వరలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది. ఇప్పటికే గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలలో విలీనం చేయాలని అందిన ప్రతిపాదనల ప్రకారం మున్సిపాలిటీల సంఖ్య 40 దాటనుంది. నగర పంచాయతీలు, మున్సిపాలిటీలలో విలీనం చేసేందుకు అర్హత కలిగిన గ్రామ పంచాయతీలను అధికారులు ఇప్పటికే గుర్తించారు. కొన్ని గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు అక్కడి పాలకమండళ్ళు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. మున్సిపాలిటీలుగా మారితే వివిధ రకాల పన్నులు పెరుగుతాయని ఆందోళన చెందుతున్నారు. దీంతో ఇలాంటి గ్రామ పంచాయతీల విషయంలో తొందర పడకుండా వాటి కాలపరిమితి పూర్తి కాగానే వాటిని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలుగా విలీనం చేయాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. అలాగే మున్సిపాలిటీలలో విలీనమైతే పన్నులు పెరుగవని, మరిన్ని నిధులను వచ్చే అవకాశాలు ఉంటాయనే భావనలను ప్రజలకు కల్పించాలని అధికార యంత్రాంగం భావిస్తున్నది.

జిహెచ్‌ఎంసిలో మరిన్ని గ్రామాల విలీనం : మున్సిపల్ చట్ట సవరణ బిల్లు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఆమోదం పొందితే ఇక గ్రామ పంచాయతీల విలీనానికి మార్గం సుగమం అవుతుందని అధికార యంత్రాంగం భావిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ సమీపంలోని కుత్బుల్లాపూర్, రాజేంద్రనగర్ మండలంలోని గ్రామ పంచాయతీలు, అలాగే మహేశ్వరం మండల పరిధిలోని కొన్ని గ్రామ పంచాయతీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)లో విలీనం కానున్నాయి. దీనికి సంబంధించిన ప్రక్రియను కూడా అధికారులు సిద్ధం చేసినట్లు తెలిసింది.



యోగా ఉత్సవాలకు నాలుగు నగరాల ఎంపిక

న్యూఢిల్లీ: ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాలకు కేంద్రం నాలుగు నగరాలను ఎంపిక చేసింది. జైపూర్, హైదరాబాద్, అహ్మదాబాద్, మైసూరు నగరాలను ఎంపిక చేసి పిఎంఒకు పంపింది. ఈ నాలుగింటిలో ఒక నగరాన్ని పిఎంఒ ఎంపిక చేసి జూన్ 21న ప్రధాన కార్యక్రమం నిర్వహించనుంది. ఢిల్లీ వెలుపల యోగా దినోత్సవాలను నిర్వహించేందుకు ప్రిపేరన్‌ను ఇప్పటికే ప్రారంభించామని ఆయుష్ మంత్రిత్వశాఖ తెలిపింది. పలు రాష్ట్రాలు తమను సంప్రదించినప్పటికీ, వారి ప్రతిస్పందనను ఆధారంగా నాలుగు నగరాలను ఎంపిక చేశామని ప్రభుత్వ అధికారి తెలిపారు. మార్చి చివరలో యోగా ప్రధాన కార్యక్రమం నిర్వహించిన అనంతరం 10 రాష్ట్రాలలో రాష్ట్రస్థాయి ఉత్సవాలు జరుగుతాయన్నారు. కేవలం ఒక్క రోజు ఒక్క కార్యక్రమానికే పరిమితం కాకుండా ఏడాది మొత్తం ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపార. యోగాను సాధన చేసేందుకు త్వరలో దేశంలోని 100 పార్కులను యోగాకు అంకితం చేయనున్నట్లు తెలిపారు.

యుపిలో ముగ్గురు హత్య

బండ: ఉత్తరప్రదేశ్‌లోని చిత్రకూట్ జిల్లాలో ఓ వ్యక్తి ఘాతుకానికి పాల్పడ్డాడు. అజిత్ రాయిదాసు అనే వ్యక్తి అనుమానంతో భార్య, ఇద్దరు కూతుళ్లను కత్తితో పొడిచి చంపాడు. ఈ ఘటనలో అతని భార్య మైనా (32), కూతుళ్లు నందిని (8),పింకి (6)మృతి చెందారు. కార్వీ పోలీస్ స్టేషన్ పరిధిలోని చక్రగురు బాబా గ్రామంలో శుక్రవారం ఘటన చోటు చేసుకుంది. తన భార్యకు వివాహేతర సంబంధాలున్నాయనే అనుమానంతో నిందితుడు ఈ ఘటనకు పాల్పడినట్లు ఎస్‌పి ప్రతాప్ గోపేంద్ర సింగ్ తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు నేరాన్ని అంగీకరించారు.

సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

- **ఆహ్వాన పత్రిక, వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ**
- **ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి, మంత్రులు తుమ్మల, ఇంద్రకరణ్‌రెడ్డి**



మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలంలో ఈ నెల 26న జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవా (శ్రీరామనవమి)నికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేస్తోందని మంత్రులు తుమ్మలనాగేశ్వరరావు, ఇంద్రకరణ్ రెడ్డిలు తెలిపారు. రోడ్లుభవనాల ఇఎన్‌సి కార్యాలయంలో శనివారం సీతారాముల కళ్యాణ ఆహ్వాన పత్రిక, వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఈ వేడుకను తిలకించేందుకు వచ్చే భక్తులకు అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తోందని చెప్పారు. స్వామివారి కల్యాణానికి అందరూ ఆహ్వానితులేనని, ముఖ్యమంత్రి కెసిఆర్ సతీసమేతంగా హాజరై ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఈ కల్యాణ వైభోగాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఒడిషా, కర్నాటకల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారన్నారు. ఇతర రాష్ట్రాల భక్తుల కోసం హిందీలో కూడా వాల్‌పోస్టర్లను ముద్రించినట్లు తెలిపారు.

త్వరలో ఆలయ పునర్నిర్మాణ పనులు : యాదాద్రి తరహాలోనే భద్రాద్రి పుణ్యక్షేత్రం ఆలయ పునర్నిర్మాణ పనులను త్వరలో చేపడతామని వారు తెలిపారు. త్రిదండి చినజీయర్‌స్వామితో సంప్రదించి ముఖ్యమంత్రి కెసిఆర్ ఉగాది పర్వదినాన ఈ పనులను ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 27న ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేసే అవకాశం ఉందని చెప్పారు. ఆలయ అభివృద్ధి పనులకు ఇప్పటికే 100కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని, అవసరమైతే మరిన్ని నిధులను కేటాయిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రభాకర శర్మ, ఖమ్మం డిసిసిబి చైర్మన్ మువ్వ విజయబాబు తదితరులు పాల్గొన్నారు.



సురేశ్‌ప్రభుకు అదనపు బాధ్యతలు

- **పౌర, విమానయానశాఖ కేటాయింపు**

న్యూఢిల్లీ: టిడిపికి చెందిన అశోక్‌గజపతి రాజు మంత్రి పదవీకి రాజీనామా చేయడంతో వాణిజ్య శాఖ మంత్రి సురేశ్ ప్రభుకు పౌర, విమానాయాన శాఖ అదనపు బాధ్యతలు అప్పగించినట్లు రాష్ట్రపతి భవన్ అధికార ప్రతినిధి తెలిపారు. ప్రస్తుత పోర్టుపోలియోకు అదనంగా కొత్త బాధ్యతలు అప్పగించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ సిఫార్సు చేశారు. టిడిపి అధ్యక్షుడు ఎన్ చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రి వర్గం నుంచి వైదొలగాలనే నిర్ణయించడంతో అశోక్‌గజపతి రాజు, వై ఎస్ చౌదరిలు తమ పదవులకు రాజీనామా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించేందుకు ప్రతిపక్షం నుంచి విమర్శలు రావడంతో చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, మంత్రి వర్గం నుంచి రాజీనామా చేసినప్పటికీ ఎన్‌డిఎలో టిడిపి భాగస్వామ్య పార్టీగా కొనసాగుతోంది.

హరీశ్‌రావుతో టిఆర్‌ఎస్‌లో చీలిక

- **కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి జోస్యం**

మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్‌ఎస్ పార్టీని చీల్చేందుకు నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ నేత ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లలో ఎవరో ఒకరు చీలికవర్గానికి నాయకత్వం వహిస్తారన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో హరీశ్‌రావు గతంలో భేటీ అయ్యారని, బిజెపి ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న వారి బంధువుతోనూ మాట్లాడింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ప్రాంగణంలో రేవంత్ రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడుతూ, టిఆర్‌ఎస్‌లో ఉంటే హరీశ్‌ను రాజకీయంగా చంపడం ఖాయమన్నారు. గతంలోనే పార్టీ మారుతానని హరీశ్ దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కలిసారని, తనను అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ చేయకుండా ఈటల రాజేందర్‌ను చేయడంతో ఏకంగా పార్టీని విలీనం చేసేందుకు సిద్ధపడింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో కావాలనే ప్రచారం చేసుకుని ఇతరులపై నెడుతున్నారన్నారు. ఇతర నాయకులను పార్టీ మారుతున్నారని భ్రష్టు పట్టించారని ఇప్పుడు హరీశ్ వంతు వచ్చిందన్నారు. హుజూరాబాద్ ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా తమ పార్టీ చేసిన ఆరోపణలు నిర్దిష్టంగా ఉన్నాయని, వాటికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. పౌరసరఫరాల శాఖలో అవినీతిపై విచారణకు ఆదేశిస్తే నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని, తాము చేసిన ఆరోపణలపై ఈటల రాజేందర్ స్వయంగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రభుత్వ దోపిడికి ఇంతకన్నా ఉదాహరణ మరొకటి లేదన్నారు.

గుజరాత్‌లో భూ ప్రకంపనలు

అహ్మదాబాద్ : గుజరాత్‌లో శనివారం సాయంత్రం భూకంపం సంభవించింది. కచ్ జిల్లాలో కొన్ని ప్రాంతాలలో రిక్టర్ స్కేల్‌పై 4.2 పాయింట్లుగా దీని తీవ్రత నమోదైందని అధికార వర్గాలు తెలిపాయి. బచౌవూకు 15 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం నమోదు అయిందని గాంధీనగర్‌లోని సిస్మలాజికల్ పరిశోధనా కేంద్రం అధికారి వెల్లడించారు. సాయంత్రం 5.14 గంటలకు సంభవించిన ఈ ప్రకంపనలు స్వల్ప స్థాయిలోనే ఉన్నాయని, దీని ప్రభావంతో ఆస్తి నష్టం, ప్రాణనష్టం ఏదీ నిర్ధారణ కాలేదని అధికారులు తెలిపారు. అయితే భూకంప తాకిడి ప్రాంతం అయిన కచ్‌లో ప్రకంపనలు సంభవించడంతో ఆందోళన నెలకొంది.

కాంగ్రెస్‌ది అంగడి యాత్ర

- **టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ జీవన్‌రెడ్డి**



మన తెలంగాణ/హైదరాబాద్ : దేశంలో ఏ ప్రతిపక్ష పార్టీ పోషించని అసమర్థ పాత్రను తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పోషిస్తోందని టిఆర్ ఎస్ ఎంఎల్‌ఎ ఎ.జీవన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల బస్సు యాత్రకు 'అంగడి యాత్ర'గా పేరొచ్చిందన్నారు. తెలంగాణ పట్టణాల్లో అంగడిరోజున జన సందడి కనిపిస్తుందని, అదే రోజు తెలివిగా కాంగ్రెస్ నాయకులు బస్సు యాత్రను చేపట్టారన్నారు. బోధన్‌లో అదే జరిగిందని, అయినా జనం లేక బస్సు యాత్ర విఫలమైందన్నారు. టిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్సుయాత్ర పేరుతో కాంగ్రెస్ అలీబాబా నలభై దొంగల బృందం బయలుదేరి నోటికొచ్చిన భాష మాట్లాడుతోందన్నారు. ఈ నలభై మందిలో 33 మంది సిఎం అభ్యర్థులే ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. మంత్రి కెటిఆర్‌కు నీతులు చెప్పే విపక్షనేత జానారెడ్డి అడ్డగోలు భాష మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలకు నీతులు చెప్పరా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతల మానసిక స్థితికి 'స్పెషల్ స్టేటస్' ఇచ్చి వెంటనే వారిని పిచ్చాసుపత్రిలో చేర్పించాలన్నారు. ఉత్తమ్‌కు బస్సు యాత్రకు ముందు కొంత మంచి పేరు ఉండేదని, బస్సు యాత్ర తర్వాత తన భాష తో పరువు తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ ఎన్ని యాత్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో అధికారం తిరి గి టిఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. రైతులకు రూ. 4 వేల పెట్టుబడి బ్యాంక్ ఖాతాలో పడ్డ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ఉనికే ఉండదని, మే 15 తర్వాత గాంధీభవన్‌కు 'టు లెట్' బోర్డు తగిలించుకోవాల్సిందేనన్నారు. కాంగ్రెస్ నేతలు పని గట్టుకుని సోషల్ మీడియాలో టిఆర్‌ఎస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. హరీశ్‌రావును ఒక కాంగ్రెస్ నేత బహిరంగంగా చంపే స్తా అని ప్రకటన చేశాడని, కాంగ్రెస్ సంస్కృతి ఇదేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఒక 'బెయిల్ పార్టీ' అని, సోనియా, రాహుల్, రేవంత్ లాంటి నేత లందరూ బెయిల్‌పై ఉన్న వారేనన్నారు.



కెసిఆర్ వెనుక ఒవైసీ సోదరుల హస్తం : కిషన్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: సిఎం కెసిఆర్‌కు మించిన పెత్తందారుడు, టిఆర్ఎస్‌కు మించిన పెత్తందారి పార్టీ దేశంలో ఎక్కడా లేదని బిజెఎల్‌పి నేత జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేస్తున్న టిఆర్ఎస్ కుట్ర వెనకాల, ఒవైసి సోదరుల హస్తం ఉన్నదని, దీనికి కథ, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే వారేనని వ్యాఖ్యానించారు. ఒక కుట్ర ప్రకారమే మజ్లిస్ పార్టీతో కలిసి టిఆర్ఎస్ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీకి వ్యతిరేకంగా కుట్రలు కుతంత్రాలు చేస్తోందన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ బంగారు తెలంగాణను మద్యం తెలంగాణగా, నిరుద్యోగులకు, దళితులకు వెన్నుపోటు పొడిచిన టిఆర్ఎస్ ప్రభుత్వానికి రాబోయే 2019 ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులను దారి మళ్లిస్తోందని, గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. మహిళాల హక్కులకు భంగం కలిగిస్తోందన్నారు. నాలుగేళ్లలో దేశంలో ఏ ప్రభుత్వం కూడా చేయని విధంగా అప్పులు చేసి యుద్ధప్రాతిపదికన తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చిందని చెప్పారు. రాజ్యసభ ఎన్నికలపై తమ పార్టీలో చర్చ జరగలేదన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఈనెల 12న బిజెఎల్‌పి సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

పాఠశాల విద్యలో సంస్కరణలు

- **సగానికి తగ్గనున్న సిబిఎస్ఇ సిలబస్**
- **ఒత్తిడి లేకుండా చదువుకునేలా విద్యార్థులకు ఊరట**



మనతెలంగాణ/హైదరాబాద్ : జాతీయస్థాయిలో పాఠశాల విద్యలో భారీగా సంస్కరణలు చోటు చేసుకోనున్నాయి. పాఠశాల స్థాయిలోనే అధిక సిలబస్ కారణంగా విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని గుర్తించిన కేంద్రం సిలబస్ తగ్గింపుపై దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) స్కూళ్లలో 1 నుంచి 12వ తరగతి వరకు అమలవుతున్న సిలబస్‌ను సగానికి కుదించాలని భావిస్తోంది. సిలబస్‌ను తగ్గిస్తేనే విద్యార్థులు క్రీడలు, కళలతోపాటు ఇతర కార్యకలాపాలపై దృష్టి సారించడానికి సమయం లభిస్తుందని, ఫలితంగా వారిలో మానసిక ఉల్లాసం కలిగి ఒత్తిడికి దూరమవుతారని అనుకుంటోంది. సిలబస్ తగ్గింపులో భాగంగా ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనుంది. ఏప్రిల్ 6 వరకు స్వీకరించే సలహాల మేరకు జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) పాఠ్యాంశాలను తగ్గించనుంది.

రానున్న విద్యాసంవత్సరం నుంచి అమలు : జూన్‌లోగా కొత్త సిలబస్, కరికులమ్‌ను ఖరారు చేసి, రానున్న విద్యా సంవత్సరం నుంచే అమలు చేసేందుకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోంది. పాఠశాల విద్యలో కేంద్రం తీసుకురానున్న సంస్కరణల్లో పాఠ్యాంశాల తగ్గింపు, పరీక్షల విధానంలో మార్పులు, ఉపాధ్యాయులకు శిక్షణ వంటివి ఉండనున్నాయి. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు డిటెన్షన్ విధానం అమలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే విద్యార్థులకు రెండు సార్లు పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించి, రెండవ సారి ఫెయిల్ అయితేనే డిటెన్షన్ అమలు చేయనున్నట్లు తెలిసింది. మార్చిలో జరిగే వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయితే మేలో మరో అవకాశం ఇవ్వనున్నారు.

జెఇఇ, నీట్ సిలబస్‌లో మార్పు : జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రతిష్టాత్మక జెఇఇ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్ సిలబస్‌లోనూ మార్పులు చోటుచేసుకోనున్నాయి. తగ్గనున్న సిబిఎస్ఇ సిలబస్‌కు అనుగుణంగా జెఇఇ, నీట్ సిలబస్ ఉంటుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా 11, 12 తరగతుల సిలబస్‌లో ఏ మాత్రం మార్పులు చోటుచేసుకున్నాఆ ప్రభావం జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షలపై ప్రభావం ఉంటుందని వ్యాఖ్యానించారు. దీనితోపాటు రాష్ట్ర ఇంటర్ సిలబస్ కూడా మారే అవకాశం ఉంది. జెఇఇ, నీట్ పరీక్షలకు అధిక సంఖ్యలోనే రాష్ట్ర విద్యార్థులు పోటీ పడుతున్న నేపథ్యంలో ఇంటర్ ఎంపిసి, బైపిసి గ్రూపుల సిలబస్‌లో మార్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తుంది.

మరోసారి వివాదంలోకి పోలీసు అధికారి శ్రీదేవి

మన తెలంగాణ/హైదరాబాద్ : ధర్నాచౌక్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ స్థానికుల ముసుగులో ధర్నాలో కూర్చుని మద్దతు తెలిపిన పోలీసు అధికారి శ్రీదేవిపై అప్పట్లో బదిలీ వేటు పడింది. తాజాగా ట్యాంక్‌బండ్‌పై జెఎసి తలపెట్టిన మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ సందర్భంగా అరెస్టయిన మహిళ నేతలను బూటు కాలితో తన్నిందని శ్రీదేవిపై జెఎసి నేతలు విమర్శలు ఎక్కుపెట్టారు. చిక్కడపల్లి, నారాయణగూడలో అరెస్టైన జెఎసి మహిళా నేతలను సిసిఎస్‌కు తరలించారు. అక్కడ వ్యాన్‌లో నుంచి వారిని కిందికి దించుతున్న సమయంలో మహిళలు నినాదాలు చేశారు. పోలీసు అధికారి శ్రీదేవి తమను బూటు కాలితో తన్నారని మహిళలు ఆరోపించారు. చట్టపరంగా నడుచుకోవాల్సిన అధికారి అధికార టిఆర్ఎస్ కార్యకర్తగా పనిచేయడం విడ్డూరంగా ఉందని వారు పేర్కొన్నారు. జెఎసి నేతలు ఈ విషయాన్ని నగర పోలీసు కమిషనర్ వి.వి.శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. ప్రస్తుతం శ్రీదేవి సిసిఎస్‌లో ఎసిపి హోదాలో పనిచేస్తున్నారు.

'టిస్'కు యునెస్కో పురస్కారం

మన తెలంగాణ/హైదరాబాద్: టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ సంస్థ (టిస్) ప్రారంభించిన 'ద కనెక్టడ్ లెర్నింగ్ ప్రాజెక్టు'కు యునెస్కో పురస్కారం లభించింది. మొత్తం 79 దేశాల నుంచి వచ్చిన పోటీదారుల్లో 'టిస్' కనెక్టడ్ లెర్నింగ్ ప్రాజెక్టు అగ్రస్థానంలో నిలిచి 'యునెస్కో కింగ్ హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫా' పురస్కారాన్ని కైవసం చేసుకుంది. 'టిస్' ఈ ప్రాజెక్టును ఎంఐటి, టాటా ట్రస్ట్‌లతో కలిసి ప్రారంభించిందని ఎల్ఎల్ఎక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మ సారంగపాణి తెలిపారు. టిస్‌తో కలిసి రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మరింత పెంపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు పాఠశాల విద్యా డైరెక్టర్ జి.కిషన్ తెలిపారు. యునెస్కో పురస్కారం తమ సంస్థకు బలాన్ని చేకూర్చి మరింత భాధ్యతను పెంచిందని టాటా రటస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.వెంకటరామన్ ఈ సందర్భంగా పేర్కొనట్లు టిస్ ఒక ప్రకటనలో వివరించింది.

నేడు హజ్ యాత్రికుల శిక్షణా శిబిరం

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్ళనున్న యాత్రీకుల కోసం ఆదివారం ఒక రోజు శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో ఈ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ హజ్ కమిటి తెలిపింది. తెలంగాణ హజ్ కమిటి చైర్మన్ మసిఉల్లా ఖాన్ అధ్యక్షతన జరిగే ఈ శిక్షణా శిబిరంలో హజ్ యాత్రకు వెళ్ళనున్న భక్తులకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రముఖ మతగురువులు, హజ్ గురించి భక్తులకు వివరిస్తారు. యాత్ర సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, హజ్ ప్రార్థనలు, తదితర అంశాలను బోధించనున్నారు.

మహిళల కోసం కాంగ్రెస్ ఎంతో చేసింది




మన తెలంగాణ/హైదరాబాద్ : మహిళలకు కాంగ్రెస్ పార్టీ చేసినంత మంచి పనులు ఏ ఇతర పార్టీ చేయలేదని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత శాంతా సిన్హా అన్నారు. ఇష్టం లేకపోయినా ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేస్తున్నారని, చట్టాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ మహిళ దినోత్సవం సందర్భంగా శనివారం గాంధీభవన్ లో మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద అధ్యక్షతన సమావేశంలో శాంతాసిన్హా మాట్లాడుతూ, సమాజంలో పితృస్వామ్యం అంతం కావాలన్నారు. మహిళలకు సమాజంలో సమానత్వం రావాలని, మహిళలంతా చదువుకుని చైతన్యవంతులు కావాలన్నారు. బాలికలను చదువుకోనివ్వకుండా, ఇష్టం లేకపోయినా త్వరగా పెళ్లిళ్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు సహా పలు రంగాల్లో మహిళలు పని చేస్తున్నారన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా మహిళలపై ఆంక్షలు ఉంటున్నాయని తెలిపారు. చట్టాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని పిల్లలు, మహిళల హక్కుల కోసం పోరాడాలని ఆమె పేర్కొన్నారు.

నేడు టిఆర్ఎస్ఎల్‌పి సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్ : టిఆర్ఎస్ శాసనసభా పక్ష (టిఆర్ఎస్ఎల్‌పి) సమావేశం ఆదివారం మధ్యాహ్నం 2:30 గంటలకు తెలంగాణ భవన్‌లో జరగనుంది. ఈ నెల 12 నుంచి జరగనున్న బడ్జెట్ సమావేశాలలో పార్టీ ఎంఎల్‌ఎలు అనుసరించాల్సిన తీరుపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దిశానిర్దేశం చేయనున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సభ ద్వారా మరింతగా ప్రజలలోకి తీసుకెళ్ళడంతో పాటు విపక్షాల విమర్శలను తిప్పికొట్టే వ్యూహంపై సమావేశంలో చర్చించనున్నట్లు సమాచారం. ఎంఎల్‌ఎల పనితీరుపై సర్వే నివేదికను కూడా సమావేశంలో సిఎం కెసిఆర్ వెల్లడించే అవకాశమున్నట్లు వార్తలు వస్తున్నాయి. రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు పోటీ చేయించే అభ్యర్థుల పేర్లను ముఖ్యమంత్రి ఈ సమావేశంలో ప్రకటించే అవకాశముంది. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక కోసం సిఎం కెసిఆర్ పార్టీలోని వివిధ వర్గాల సీనియర్ నాయకులతో చర్చలు జరుపుతున్నారని, శనివారం రాత్రికే దాదాపు ఖరారయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి మృతి, రాపోలు ఆనంద్ భాస్కర్, సి.ఎం.రమేష్‌ల కాలపరిమితి ముగియడంతో రాష్ట్రం నుంచి 3 రాజ్యసభ స్థానాల్లో ఖాళీ ఏర్పడింది. మూడు స్థానాలనూ గెల్చుకునే సంఖ్యాబలం టిఆర్ఎస్‌కు ఉన్నప్పటికీ కాంగ్రెస్ కూడా అభ్యర్థిని నిలబెట్టాలని నిర్ణయించింది.

టిఆర్ఎస్‌ది నియంతృత్వ పాలన



మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వ పాలనను అవలంభిస్తోందని మాజీ ఎంఎల్‌సి కపిలవాయి దిలీప్‌కుమార్ ఆరోపించారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ నిమిత్తం ట్యాంక్‌బండ్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన ఆయనను శనివారం అరెస్టు చేసి బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కపిలవాయి దిలీప్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో మిలియన్ మార్చ్‌ది కీలక ఘట్టమన్నారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభకు ప్రభుత్వం అనుమతి నిరాకరించిచడంతో పాటు ముందస్తు అరెస్టులకు పాల్పడడం అన్యాయమని, సిఎం కెసిఆర్ నియంతృత్వ పోకడలకు ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకు భిన్నంగా టిఆర్ఎస్ పాలన కొనసాగుతోందని అన్నారు.

తాగునీటి ప్రణాళిక ఖరారు!



- **చేపట్టాల్సిన పనుల కోసం రూ. 1598.14కోట్ల వ్యయం**
- **ప్రభుత్వానికి ప్రతిపాదనలు**

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎండాకాలం... కలుషిత నీరు, అపరిశుభ్ర వాతావరణంతో వ్యాధులు ప్రబలే ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం తక్షణం పూర్తిచేయాల్సిన పనులపై ప్రణాళిక తయారు చేసి ప్రతిపాదనలు పంపాలని పారిశుధ్య, తాగునీటి కార్యాచరణ ప్రణాళిక కమిటీకి సూచించింది. ఈ కమిటీ గ్రామాల వారీగా జాబితా తయారు చేసింది. గ్రామాల్లో తాగునీటి సమస్య, పారిశుద్ధ్య సమస్యను అధిగమించాలంటే తక్షణం 28,72,741 పనులను పూర్తి చేయాలని, వీటికి రూ.1,598.14 కోట్లు వ్యయమవుతుందని, పనులవారీగా ప్రణాళిక తయారుచేసింది. ఈ ప్రణాళిక ప్రకారం గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండడానికి మొత్తం 14, 45,076 పనులను పూర్తి చేయాలని వీటి కోసం 1,167.89 కోట్లు వ్యయమవుతుందని ప్రతిపాదించింది. ఈ పనుల్లో రూ. 41.35 కోట్ల 19,278 చేతిపంపులకు ఖర్చుకానుంది. 2,84, 431 తాగునీటి సరఫరా పథకాల నిర్వహణ, మరమ్మతుల కోసం రూ.59.35 కోట్లు, 25,005 చేతి పంపులకు ప్లాట్‌ఫారంల పనులకు రూ.25.61 కోట్లు, 1,15,097 బోరు బావులను వేయడం కోసం రూ.100.28కోట్లు, 62,187 మినీట్యాంకుల కోసం రూ.83.46 కోట్లు, 1994 మంచినీటి బావుల కోసం రూ. 53.17 కోట్లు ఇలా మొత్తం రూ. 1,167 కోట్లు ఖర్చు కానున్నట్లు ఆ ప్రణాళికలో కమిటీ ప్రతిపాదించింది.

పారిశుద్ధ్య పనులకు రూ.430.25కోట్లు : పారిశుద్ధ్య సమస్య పరిష్కారం కోసం రూ. 430.25 కోట్ల అంచనా వ్యయంతో 14,27,665 పనులను కమిటీ ప్రతిపాదించింది. ఇందులో 7, 97,617 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.53.89 కోట్లు, గ్రామపంచాయతి కార్యాలయాల్లో 15,719 మరుగుదొడ్ల కోసం రూ.12.29 కోటు, పాఠశాలల్లో 4,752బాలుర మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.15.39 కోట్లు, 4,478 బాలికల మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.13.04 కోట్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 5,664 మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.17.21 కోట్లు చొప్పున ప్రతిపాదనల్లో నివేదించింది.

నేడు రెండో విడత పల్స్ పోలియో



మన తెలంగాణ /హైదరాబాద్ : పోలియోరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంధ సంస్థల భాగస్వామ్యంతో రెండవ విడత పల్స్ పోలియో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ప్రారంభమవుతున్న ఈ కార్యక్రమంలో ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేయించాలన్నారు. పోలియోచుక్కలు వేయించలేనివారి కోసం 11వ తేదీ తర్వాత వరుసగా రెండు రోజుల పాటు వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి వేస్తారని తెలిపారు. రాష్ట్రంలో 36,55,204 మంది పిల్లలకు పోలియో చుక్కలను వేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకోసం 22,768 కేంద్రాలను ఏర్పాటు చేసి 95,500 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణాల్లో ఉన్నవారి కోసం బస్టాండ్లు, రైల్వేస్టేషన్లతో పాటు ప్రధాన కూడళ్లల్లో 737 ట్రాన్సిట్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు 787 మొబైల్ టీంలు, 2,280 మంది రూట్ సూపర్‌వైజర్స్, 8,711 మంది ఎఎన్‌ఎంలు, 27,045 ఆశా వర్కర్లు, 32, 082 అంగన్‌వాడి వర్కర్లు పనిచేస్తున్నారని తెలిపారు. గడిచిన ఏడేళ్ళల్లో దేశంలో ఎక్కడా పోలియో ప్రభావం కనిపించలేదన్నారు. దేశానికి పొరుగున్న పాకిస్థాన్, అఫ్ఘనిస్తాన్, నైజిరియా లాంటి దేశాల్లో పోలియో కేసులు నమోదైనందున వల్ల మనం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమాన్ని వివిధ ప్రాంతాల్లో మంత్రులు, ఎంపి లు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, జిల్లా కలెక్టర్లతో పాటు ఇతర ఉన్నతాధికారులు ప్రారంభిస్తారని తెలిపారు. నగరంలోని మోహిదిపట్నం సమీపంలోని అఫ్జల్‌సాగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో తాను పాల్గొంటానని తెలిపారు.

నన్నూ చంపేయండి.!

- **మోసం భరించ లేక హత్య చేసినట్టు వాంగ్మూలం**
- **అశ్విని భౌతికకాయానికి అంత్యక్రియలు**

చెన్నై: తనకు చేస్తున్న మోసాన్ని భరించలేకే అశ్వినిని హతమార్చినట్టు నిందితుడు అళగేశన్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. అశ్విని లేని జీవితం తనకు వద్దని, తననూ హతమార్చాలని లేకుంటే ఆత్మహత్య చేసుకుంటానని పోలీసుల వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక, అళగేషన్‌ను ఉరి తీయాలని అశ్విని కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. చెన్నైలో ప్రేమోన్మాది అళగేషన్(22) ఘాతకానికి శుక్రవారం అశ్విని(18) బలైన విషయం తెలిసిందే. ప్రజలు చితక్కొట్టడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అళగేషన్ ఆరోగ్యం శనివారం కుదుట పడింది.

దీంతో ఉదయాన్నే పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టి అతడి వాంగ్మూలం తీసుకున్నారు. ఆ మేరకు ఆలపాక్కం ధనలక్ష్మి నగర్‌లో ఉన్నప్పుడు తొలిసారిగా అశ్వినిని చూసినట్టు పేర్కొన్నాడు. కొన్ని నెలలు ఆమె వెంట పడ్డానని, చివరకు తన ప్రేమను తెలియజేయడంతో అంగీకరించిదని తెలిపాడు. రెండేళ్లుగా తాను, అశ్విని ప్రేమించుకుంటున్నామని వివరించారు. ఆమెకు తండ్రి లేదని, తల్లి, సోదరుడు మాత్రమే ఉన్నట్టు చెప్పాడు. అందుకే తాను ఆమె ను చదివించేందుకు కష్ట పడుతూ వచ్చానని పేర్కొన్నారు. తనను ప్రేమించేందుకు తగ్గ అర్హతలు ఉన్నాయా అని అశ్విని ప్రశ్నించడం భరించలేక పోయాయని పేర్కొన్నాడు. ఆమె తల్లి ఒత్తిడి మేరకే అలా చెప్పినట్టు భావించానని, పోలీస్ స్టేషన్లో సైతం ఫిర్యాదు చేయడంతో తీవ్ర మనోవేదనకు గురైనట్టు తెలిపాడు. తనకు దక్కనిది మరొకరికి దక్కకూడదని భావించి ఆమెను హతమార్చిన మరుక్షణం తాను ఆత్మాహుతి చేసుకోవాలన్న లక్ష్యంతోనే కేకేనగర్‌కు వెళ్లడం జరిగిందన్నారు. తనను అక్కడి జనం పట్టుకోవడంతో ఆత్మహత్య చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది.ఇప్పుడు తనను చంపేయాలని లేకపోతే ఏదో ఒక రోజు ఆత్మహత్య చేసుకుంటానని వాపోయాడు. అశ్విని లేని జీవితం తనకు వద్దు అని బోరున విలపించాడు.

కంటి చూపును దెబ్బతీసే గ్లకోమా

- రేపటి నుంచి గ్లకోమా వారోత్సవాలు
- అవగాహన కార్యక్రమాల నిర్వహణ



మన తెలంగాణ /హైదరాబాద్: గ్లకోమా అనే వ్యాధి పునరుద్ధరించలేని అంధత్వమని, ఈ వ్యాధిని గుర్తించడం కష్టమని, త్వరితగతిన గుర్తించి చికిత్సను తీసుకున్నట్లయితే కంటిచూపు శాశ్వతంగా పోకుండా కాపాడుకోవచ్చని ఎల్వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ శాఖాధిపతి డాక్టర్ శిరీషా సెంథిల్ అన్నారు. ఈ వ్యాధి కారణంగా కంటిచూపు పోతే ఇక పునరుద్ధరించడం సాధ్యం కాదని ఆమె వివరించారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకొని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ అనిల్ కె.మండల్, డాక్టర్ శిరీషా సింథిల్ మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నామని, 'గ్లకోమా రన్'ను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.దేశంలో ప్రతి ఎనిమిది మందిలో ఒకరికి ఈ వ్యాధి సోకుతుందని, సుమారు 40 మిలియన్ల మందికి వ్యాధి వచ్చే అవకాశముందన్నారు. ప్రస్తుతం దేశంలో 11.2 మిలియన్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. ఇందులో 1.1 మిలియన్ల మం ది పిల్లల్లో ఈ వ్యాధి ఉందని తెలిపారు. సాధారణంగా 40 ఏళ్లు పైబడిన వారికి వ్యాధి సోకుతుందని, అధిక హ్రస్వదృష్టి, మధుమేహం, జన్యుపరంగా ఈ వ్యాధి మరింత ఎక్కువగా సోకుతుందని తెలిపారు. త్వరితగతిన వ్యాధిని గుర్తించడానికి క్రమబద్ధంగా కంటి పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ప్రపంచ జనాభాలో 3 శాతం మందికి ఈ వ్యాధి సోకుతుందని, సుమారు 40 మిలియన్ల మంది బాధపడుతున్నారని, మన దేశంలో సుమారు 11.2 మిలియన్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని, ఇందులో 1.1 మిలియన్ల మంది పిల్లలేనని వివరించారు. అవగాహన లోపం వల్ల చాలా మంది దీన్ని ప్రాథమిక స్థాయిలో గుర్తించలేకపోతున్నారని, సుమారు 80 శాతం మందికి వ్యాధిని నివారించే అవకాశం ఉన్నా ఈ కారణంగానే ఏడాదికి 7 మిలియన్ల మంది ప్రపంచవ్యాప్తంగా వ్యాధిబారిన పడుతున్నారని పేర్కొన్నారు. దాదాపు మూడింట రెండొంతు మంది స్త్రీలేనని పేర్కొన్నారు. గతంలో అవగాహనలేమివల్ల, ఆధునిక చికిత్స అందబాటులో లేకపోవడం వల్ల ఫలితాలు అంతంతమాత్రమేనని, కానీ ప్రస్తుతం శస్త్రచికిత్సల్లో మార్పులు, ఆధునాతన పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో అరగంట వ్యవధిలోనే చికిత్స సాధ్యమవుతోందన్నారు. సరోజినిదేవి ఆసుప్రతి ఆధ్వర్యంలో రన్‌తో పాటు సదస్సులు, సమావేశాలతో పాటు పిల్లలకు వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సూపరింటెంటెండ్ రవీందర్‌గౌడ్ తెలిపారు. పలు ప్రైవేటు ఆసుప్రతులు సైతం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. సరోజినీ దేవి ఆసుప్రతి ఆధ్వర్యంలో ఉదయం నిర్వహించనున్న గ్లకోమా రన్‌ను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రారంభించనున్నారు.

పాక్ ఆరోపణలను తిప్పికొట్టిన భారత్

- **కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ వైఖరిని తూర్పారబట్టిన ఇండియా**
- **ఐక్యరాజ్యసమితిలో పాక్‌పై ధ్వజమెత్తిన భారత్ కార్యదర్శి**




ఐక్యరాజ్య సమితి : కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ వైఖరిని భారత్ తూర్పారబట్టింది. ఐక్యరాజ్యసమితిలో ఆ దేశం చేస్తున్న ఆరోపణలను తిప్పి కొట్టింది. పాక్‌ను ఉగ్రవాద దేశంగా పరిగణిస్తూ భారత్ విమర్శలు చేసింది. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న మీరు మాకు పాఠాలు చెప్తున్నారా అని ప్రశ్నించింది. హక్కుల గురించి మీరు చెప్తే నేర్చుకోవాల్సిన పరిస్థితుల్లో భారత్ లేదని ఐరాసలో భారత కార్యదర్శి పాక్‌పై ధ్వజమెత్తారు. ఐరాసలో పాకిస్థాన్ కశ్మీర్ అం శాన్ని లేవనెత్తింది. జమ్ముకశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ విషయమై వాదించింది. అదే విషయాన్ని నిన్న మరోసారి లేవనెత్తడానికి ప్రయత్నించడంతో ఐరాసలో భారత రెండో కార్యదర్శి మిని దేవి కుమమ్ పాక్‌పై విమర్శలకు దిగారు.'ఓ విఫలమైన దేశం నుంచి ప్రజాస్వామ్యం, మానవ హక్కులపై పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు. ఉగ్రవాదులను అరికట్టడంలో పాక్ విఫలమైన దేశం. అక్కడ ఉగ్రవాదులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అలాంటిది పాక్ భారత్‌లో మానవ హక్కుల పరిరక్షణ గురించి లెక్చర్లు ఇస్తోంది' అని కుమమ్ పాక్‌పై విమర్శలు చేశారు. అప్పుడు ఒసామా బిన్ లాడెన్‌ను పాక్‌లోనే దొరికాడు. తాజాగా ముంబయి దాడుల కీలక సూత్రధారి హఫీజ్ సయీద్ అక్కడ స్వేచ్ఛగా తిరుగుతున్నాడు అని అన్నారు. 2008 ముంబయి దాడులు, 2016 లో జరిగిన పఠాన్‌కోట్, ఉరి దాడుల్లో న్యాయం కోసం భారత్ ఎదురుచూస్తోందని, ఈ ఘటనలపై పాక్ కఠిన చర్యల తీసుకోవాలని డిమాండ్ చేశారు. సయీద్‌ను ఐరాసతో పాటు అమెరికా కూడా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. సరిహద్దులో పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందనికుమమ్ఆరోపించారు.పాక్ కశ్మీర్ అంశంపై మాట్లాడడానికి ముందు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను ఖాళీ చేసి వెళ్లాలని అన్నారు. జమ్ముకశ్మీర్‌లో ఉన్న అసలైన సమస్య ఉగ్రవాదమని తెలిపారు. పాకిస్థాన్ నుంచి లేదా దాని ఆధీనంలోని ప్రాంతాల నుంచే ఉగ్రవాదులు ప్రవేశిస్తున్నారన్నారు.

నటి ఇంటిని ముట్టడించిన ఆందోళనకారులు



చెన్నై(పెరంబూరు): నటి కస్తూరి ఇంటిని ఆందోళనకారులు ముట్టడించారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను అరెస్ట్ చేశారు. విల్లుపురంజిల్లా, తిరుకోవిలూర్‌లో కొందరు దుండగులు ఒక ఇంట్లో చేసిన దాడిలో ఒక పసివాడు బలైయ్యాడు. దీంతో అతని తల్లి, సహోదరి తీవ్రంగా గాయాలపాలైన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ వ్యవహారంపై నటి నటి కస్తూరి తన ట్విట్టర్‌లో సామాజిక వర్గాన్ని విమర్శించడం వివాదానికి దారి తీసింది. కస్తూరి వ్యాఖ్యలను ఖండిస్తూ పమూహ నీది క్షత్రియ పేరవై నేత పోన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టింది. ముందుగా చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నటి కస్తూరిపై తగిన చర్యలు తీసుకోవలసిందిగా ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానిక తేనాంపేటలోని నటి కస్తూరి ఇంటిని చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. ఈ కార్యక్రమంలో ఆ పేరవై కార్యదర్శి ఎస్ఎం. కుమార్‌తో పాటు మాజీ శాసన సభ్యుడు రవిరాజ్, కార్తికేయన్, మలర్ ఆర్ముగం, శశికుమార్, దినకరన్, దాస్, ముత్తు, వేలు, గౌరి 100 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సమాచారం అందిన పోలీసులు ఆ ప్రాంతానికి వచ్చి ఆందోళనకారులను అరెస్ట్ చేశారు.



"మన మాటలనూ, చేతలనూ పొగిడే వారి కంటే, మన తప్పిదాలను ఎత్తిచూపేవారే నమ్మదగినవారని తెలుసుకోవాలి.
– సోక్రటీస్"

నాటకీయ పరిణామం

సంపాదకీయం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్‌తో చర్చలకు డిపిఆర్ కొరియా (ఉత్తర కొరియా) అధ్యక్షుడు కిమ్‌జోంగ్ అన్ ఆహ్వానం. చర్చలకు ట్రంప్ అంగీకారం. బహుశా మే నెలలో ముఖాముఖీ సమావేశం. ఇది కొద్ది మాసాల క్రితం ఎవరూ ఊహించని నాటకీయ పరిణామం. ఉత్తరకొరియా ఖండాంతర మిస్సిలీల ప్రయోగ పరీక్షలు, అణ్వస్త్ర కార్యక్రమం కారణంగా కత్తులు దూసుకున్న ఇరుదేశాల నేతలు చర్చలకు అంగీకరించటం కొరియన్ ద్వీపకల్పానికే కాదు, యావత్ ప్రపంచానికి శుభవార్త. చర్చల ఫలితాలెలా ఉంటాయి, ఉత్తర కొరియా తన అణుకార్యక్రమాన్ని విడనాడుతుందా? కొరియా ద్వీపకల్పం నిస్సైనీకరణకు అమెరికా ముందుకు వస్తుందా? ఉత్తర కొరియా సార్వభౌమత్వ పరిరక్షణకు ట్రంప్ ఏమైనా హామీలిస్తారా? ఇటువంటి క్లిష్టసమస్యలపై ఇప్పటినుంచే ఊహాగానాలు చేయటంకన్నా, చర్చలు జరగటమన్నదే అతిపెద్ద సానుకూల పరిణామంగా భావించాల్సి ఉంటుంది. ఉత్తర–దక్షిణ కొరియాల పునరేకీకరణ అభిలాష సహోదర ప్రజల్లో ఉంది. అయితే సైనిక స్థావరాలు నెలకొల్పి దక్షిణ కొరియా పాలకవర్గానికి మద్దతుగా ఉన్న అమెరికా ప్రభుత్వాలు అందుకు అడ్డుకట్టవేశాయి.

చరిత్రలోకి తొంగిచూస్తే, 1945లో రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ ఓటమి పొందటంతో కొరియాపై జపాన్ ఆక్రమణ అంతమైంది. సోవియట్ యూనియన్ అండతో ఉత్తరభాగాన కిమ్ ఇల్ సంగ్ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని నెలకొల్పగా, దక్షిణ కొరియా అమెరికా రక్షణకిందకు వచ్చింది. 1950 జూన్‌లో చైనా అండతో ఉత్తర కొరియా దక్షిణంపై దాడి చేసింది. అమెరికా నాయకత్వంలో సంకీర్ణకూటమి సియోల్ ను తిరిగి స్వాధీనం చేసుకుంది. 1953లో నిర్యుద్ధ సంధి జరిగింది. ప్యాంగ్‌యాంగ్‌పై అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించింది. తదాదిగా ఉద్రిక్తత కొనసాగుతూనే ఉంది. అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ 1994 జూన్‌లో ఉత్తర కొరియాను సందర్శించి సంచలనం సృష్టించాడు. అక్టోబర్‌లో కిమ్ ఇల్‌సంగ్ మరణం, ఆయన కుమారుడు కిమ్‌జోంగ్ ఇల్ అధికారంలోకి వచ్చాక ప్యాంగ్‌యాంగ్–వాషింగ్టన్ మధ్య ద్వైపాక్షిక ఒప్పందం జరిగింది. పౌర వినియోగ అణుశక్తి రియాక్టర్లు నిర్మించటానికి అమెరికా అంగీకరించటంతో తమ సైనిక అణుశక్తి కార్యక్రమాన్ని నిలుపు చేయటానికి, సంబంధిత వసతులు ధ్వంసం చేయటానికీ ఉత్తర కొరియా సుముఖత తెలిపింది. కిమ్‌జోంగ్ ఇల్ 1999 సెప్టెంబర్‌లో మిస్సిలీ పరీక్షలను వాయిదా వేశారు, అమెరికా ఆంక్షలు సడలించింది.

అయితే అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ 2002 జనవరిలో ఉత్తరకొరియా, ఇరాన్, ఇరాక్‌లను 'దుష్టరాజ్యాలు'గా ప్రకటించటంతో ఉద్రిక్తత పెచ్చరిల్లింది. 2006 అక్టోబర్‌లో యువ అధ్యక్షుడు కిమ్ జోంగ్ అన్ నాయకత్వంలో ఉత్తర కొరియా తొలి అణుపరీక్ష నిర్వహించింది. 2017 లో ఉత్తర కొరియా మిస్సిలీ, అణుబాంబు పరీక్షలు నిర్వహించి, అమెరికా భూభాగంలోని ఏ ప్రాంతాన్నయినా ధ్వంసం చేసే శక్తి తమకుందని ప్రకటించటం, ఉత్తర కొరియా ప్రభుత్వం తన మరణ శాసనాన్ని లిఖించుకుంటోందని ట్రంప్ హెచ్చరించటం, చైనా ద్వారా ఉత్తరకొరియాను వెనక్కి లాగేందుకు ప్రయత్నించటం, ఆ తర్వాత దఫదఫాలుగా ఆంక్షలు విధింపచేయటం తెలిసిందే.

ఆర్థిక ఆంక్షలు ఉత్తర కొరియాను కృంగదీశాయా లేక దక్షిణ కొరియా దౌత్యం ఫలించిందా – ఏదయితేనేం అన్–ట్రంప్‌లు చర్చల బల్లవద్దకు వస్తున్నారు. గతనెలలో దక్షిణ కొరియాలో జరిగిన శీతాకాల ఒలింపిక్స్ వేడిని చల్లార్చాయి. వాటిలో ఉత్తర కొరియా పాల్గొనటమేగాక ఉభయ కొరియాలు ఒకే పతాకం కింద పాల్గొన్నాయి. ఆ తదుపరి దక్షిణ కొరియా నేతలు కిమ్ ఇల్ అన్‌తో జరిపిన చర్చలు ఉద్రిక్తోపశమన దిశగా ప్రయాణానికి బాటవేశాయి. ట్రంప్‌కు తన ఆహ్వానాన్ని అన్ దక్షిణ కొరియా బృందం ద్వారానే పంపారు. మతిభ్రమించిన వారుగా పరస్పరం నిందించుకున్న నేతలు ముఖాముఖీ మాట్లాడుకునే సందర్భం చరిత్రాత్మకం కానుంది. స్వయంగా చర్చలు జరపటానికి ట్రంప్ ముందుకు రావటం ఆయన విలక్షణ పని విధానానికి నిదర్శనం. ట్రంప్ అన్నట్లు కొరియన్ అణుసంక్షోభం పరిష్కార ప్రయత్నాల్లో ఇది "గొప్ప పురోగతి". చర్చలు ఫలప్రదం కావాలని యావత్ ప్రపంచం ఆశిస్తుంది.

నీటి ఎద్దడిపై ఎనలేని నిర్లక్ష్యం

చూపు

ఒక్క చుక్క నీరు దొరకని రోజులు దగ్గరలోనే ఉన్నాయి. దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లోనూ, భారత్‌లోని బెంగళూరులోనూ నీటి కొరత అనివార్యంగా కనిపిస్తోంది. కేప్ టౌన్‌లో రోజుకు ఒక మనిషికి 50 లీటర్లే లాంటి జల సంరక్షణ విధానాలు అమలు చేసి చుక్కనీరు లేని రోజులను ఏప్రిల్ నుంచి జులైకి వాయిదా వేయగలిగారు. అక్కడ మేలో వర్షాలు కురుస్తాయని ఆశిస్తున్నారు. ఒక వేళ తగినంత వర్షం కురవకపోతే ప్రజలు బారులు తీరి నీటికోసం ఎదురు చూడవలసి వస్తుంది. కానీ బెంగళూరులోనూ, మన దేశంలోని ఇతర నగరాల్లోనూ నీటి కటకట నివారించడానికి ప్రయత్నాలేవీ లేవు. వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని వ్యవహరించడానికి, మన గొయ్యి మనమే తవ్వుకుని సంక్షోభంలో కూరుకుపోవడానికి ఉన్న తేడా అంటే ఇదే. నీటి కొరత ఏర్పడడానికి నీటి దొంగతనంతో పాటు, విచ్చల విడిగా నీరు వాడకం వరకు అనేక కారణాలున్నాయి.

కేప్‌టౌన్‌లో నీటి సంక్షోభం భారత్‌కు మేలుకొలుపు కావాలి. ఎందుకంటే సమీప భవిష్యత్తులో అనేకచోట్ల నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉంది. మన దేశంలో అందరికీ అందవలసిన వనరులను కొంతమంది ఎలా విపరీతంగా వాడతారో, తద్వారా సమాజంలో అసమానతలు ఎలా చోటు చేసుకుంటాయో గుర్తించాలి. కేప్ టౌన్‌లో లాగే మన దేశంలో పేదలే తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వారు నీటి కోసం గంటల తరబడి చూడవలసి వస్తోంది. కొన్నిసార్లు నీళ్లు కూడా కొనుక్కోవలసిన పరిస్థితి. అత్యవసరమైన నీటి కోసం అన్వేషణా తప్పడం లేదు.

సంపన్నులకు కుళాయిల్లో నీళ్లు వస్తాయి. దాన్ని మేడ మీద ఉన్న నీటి తొట్టెలోకి చేరుస్తారు. వాడుకోవడానికి, దుర్వినియోగం చేయడానికి కూడా ఆ నీరే ఉపయోగపడుతోంది. నీటి కోసం సంపన్నులు చెల్లిస్తున్నది నామమాత్రం కనక పొదుపుగా నీళ్లు వాడుకోవాలను కోరు. సమాజంలో అంతరాలు అత్యంత సహజంగా కొనసాగుతున్నాయి కనక తాము నీటి వృథా చేస్తున్నామో లేదా విలువైన జల వనరును మితిమీరి వాడుతున్నామేమో అనే అపరాధ భావన కూడా సంపన్నులకు ఉండదు.

మన నగరాల్లో నీటి కొరత, వినియోగం, పంపిణీలో అసమానతలతో పాటు నీటిని ఎలా వినియోగిస్తాం, సంరక్షిస్తాం అన్న విషయం కూడా సంక్షోభ పూరితమైందే. విలువైన ఈ వనరు గురించి మన వైఖరి ఉష్ట్రపక్షి ధోరణిలో ఉంటుంది. మన తలలు సతతం నిర్వేతుకమైన రీతిలో ఇసుకలో కూరుకు పోయి ఉంటాయి. అధికారులు, పౌరులు కూడా ప్రతి ఏటా ఎలాగోలా వర్షాలు కురుస్తాయి లెమ్మన్న భ్రమల్లో గడుపుతుంటారు. వర్షం కురిసి మన నదులు, జలాశయాలు నిండి భూగర్భ జలమట్టం పెరుగుతుందని అనుకుంటూ ఉంటాం. ఒకవేళ వర్షం కురవకపోతే శీతోష్ణస్థితిలో మార్పులు, భూతాపం వంటి వాటి మీద నెపం మోపుతాం. పరిరక్షించవలసిన బాధ్యత గురించి మాత్రం ఆలోచించం. ఇవాళ పొదుపు చేసే నీరే రేపటికి ఉపకరిస్తుంది అన్న అలోచనే ఉండదు.

ఈ ఆలోచనా ధోరణి కారణంగానే మన నగరాలు అడ్డదిడ్డంగా పెరిగిపోయాయి. నీరులాంటి వనరులు ఎలా సమకూరతాయోనన్న



ధ్యాసే లేదు. ఆ నీటిని ఎలా పంపిణీ చేయాలో గమనించం. 1991లో బెంగళూరు జనాభా 45 లక్షలు ఉండేది. ఇప్పుడు కోటీ 35 లక్షలకు చేరింది. నగర విస్తీర్ణం గతంలో 226 చదరపు కిలోమీటర్లు ఉంటే ఇప్పుడు 800 చదరపు మీటర్లకు చేరింది. జల సంక్షోభం నిరంతరంగా ఉంటుంది. అయినా ఉన్న వనరులను పరిరక్షించం. ఒకప్పుడు నిండా నీళ్లతో తొణికిసలాడే చెరువులు, కుంటలు మాయమై పోయాయి. వాటిని పరిరక్షించలేదు. బెంగళూరు కావేరీ నదీజలాల మీద ఆధారపడుతుంది. ఆ నగర దాహార్తి తీర్చడం కోసమే కర్నాటక ప్రభుత్వం కావేరీ జలాల్లో ఎక్కువ వాటా కావాలంటుంది. ఇటీవలి కోర్టు కేసులో వాటా పెంచుకోగలిగింది. అయినా బెంగళూరు నీటి అవసరాలు తీరవు. ఆ రాష్ట్రంలోని ఇతర నగరాల్లో నీటి అవసరాలూ తీరవు.

నీటి వాడకంలో గృహావసరాలకు నీటి వినియోగం అంత ప్రధానమైంది కాదు. వ్యవసాయానికి నీరు ముఖ్యమైంది. ఇక్కడా సమస్య ఏమిటో తెలుసు.1960ల తర్వాత హరిత విప్లవం కారణంగా సేద్యపు నీటి వినియోగమూ పెరిగింది. దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటాయి. భూగర్భంలో ఉన్న నీటి చెలమల్లో తడి ఆరకుండా చేసిందేమీ లేదు. వర్షాలు కురవనప్పుడల్లా సమస్య ఎదురవుతూనే ఉంటుంది. ఉపరితల జలాన్ని సేద్యానికి మళ్లించినా అదీ చాలడం లేదు. దీనికి నర్మదా నదే పెద్ద ఉదాహరణ. ఆ నది మీద సర్దార్ సరోవర్ ఆనకట్టతో సహా అనేక ఆనకట్టలు కట్టారు. అయినా నర్మదా నదిలో నీటి మట్టం ఆందోళనకరంగా తగ్గుతోంది. ఆ నదిపై ఆధారపడ్డ పట్టణాలకు తగినంత నీరు సరఫరా చేయలేకపోతున్నారు. ఇక సేద్యానికి ఉన్న అవసరాల సంగతి చెప్పక్కర్లేదు. నర్మదా జలాన్ని అహ్మదాబాద్ ద్వారా వెళ్లే సబర్మతి నదికి తరలిస్తున్నారు. సబర్మతిలో నీరింకిపోయింది.

మార్చి 22న భారత్‌లో కూడా అంతర్జాతీయ జల దినోత్సవం జరపబోతున్నాం. ఇది ఓ తంతుగా మారింది. ఆ రోజున ప్రతి ఏటా ప్రభుత్వాలు జల సంరక్షణ ఎలా చేయాలో ప్రవచిస్తాయి. వృథాగా పోయే నీటిని మళ్లీ ఎలా వాడుకోవచ్చో వివరిస్తుంటాయి. ఆ తర్వాత పట్టణ ప్రణాళికల రూపకల్పన, నగరాల అడ్డగోలుగా విస్తరించడం, వ్యవసాయం, ఇంధన ప్రణాళికల గురించి ఎవరూ పట్టించుకోరు. మరో ఏడాది కూడా నీటి కటకట ఎలాగోలా గట్టుక్కెతాం లెమ్మన్న ధీమాతోనే విధానాలు రూపొందిస్తారు. నీటిని ఎలా వాడుతున్నాం, ఎలా దుర్వినియోగం చేస్తున్నాం అనేదే ఒక సమాజం సామాజిక న్యాయాన్ని పరిరక్షిస్తోందా, పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా వ్యవహరిస్తోందా అనడానికి కొలమానం. ఈ విషయంలో దేశంలో ఉన్న పరిస్థితి చూస్తే మనకు సున్నా మార్కులే వస్తాయి.

✻ (ఇ.పి.డబ్ల్యు. సౌజన్యంతో)

సరికొత్త చరిత్ర తయారీ!

చరిత్రలో జాతీయతా భావాలను మరింత పెంచడానికి, హిందూరాజులు, హిందూ చారిత్రక పురుషులకు సముచిత స్థానం కల్పించడానికి భారత ప్రభుత్వం ఒక కమిటీ వేసిందని రాయిటర్ వార్తా సంస్థ వివరాలతో సహా తెలియజేసింది.

ఈ కమిటీని సాంస్కృతిక శాఖ మంత్రి మహేష్ శర్మ వేశారు. కమిటీ ఛైర్ పర్సన్ కె.ఎన్. దీక్షిత్ రాయిటర్ వార్తా సంస్థతో చెప్పిన మాటలు, "ప్రాచీన చరిత్రకు సంబంధించి కొన్ని అంశాలను తిరగరాయడానికి ఉపయోగపడే నివేదిక ఇవ్వాలని నన్ను కోరారు. చాలా సార్లు బాహాటంగానే ప్రకటించారు. ఈ కమిటీని కూడా 2016లోనే ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఆర్ఎస్ఎస్ స్వంత పుస్తకాల్లో రాసిన మాటలే ఇప్పుడు చరిత్రగా నిరూపించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఆరెస్సెస్ శాఖల్లో చెప్పే విషయాలను సత్యాలుగా నిరూపించడానికి చరిత్రలోకి ఎక్కిస్తున్నారు. "చారిత్రక వాస్తవాలకు సంబంధించిన పరిజ్ఞానం ఆరెస్సెస్, బిజెపి నేతలకు అంతగా ఉండదని చాలా సందర్భాల్లో బయటపడుతూ ఉంటుంది. కాని ఆరెస్సెస్, బిజెపి నేతలు భారత చరిత్రను తిరగరాయాలన్న ఆలోచనను రహస్యంగా ఏమీ పెట్టుకోలేదు. భారత పాఠ్యగ్రంథాల్లో ఎక్కువ గా కాంగ్రెసీకరించిన పాఠాలే ఉంటాయన్న ఆరోపణ బిజెపి చేస్తుంటుంది. నిజానికి ఈ ఆరోపణ బిజెపియే కాదు చాలామంది కూడా చేస్తుంటారు. కాంగ్రెసు నాయకుల గురించి పాఠ్యపుస్తకాల్లో ఎక్కువగా ఉందన్న మాటలో వాస్తవాలు కూడా లేకపోలేదు. కాని ఇప్పుడు కేంద్ర మంత్రి మహేష్ శర్మ ఏర్పాటు చేసిన ఈ కమిటీ చేసే పని పాఠ్యపుస్తకాల్లో అనవసరంగా అత్యధికంగా కాంగ్రెసు నేతల ప్రస్తావనలను సరిదిద్దడం కాదు. గత పన్నెండు వేల సంవత్సరాలుగా భారత సంస్కృతి, నాగరికతల పరిణామ వికాసాలను తమ దృక్కోణంతో రాయించడం. అంటే తమకు అనుగుణమైన చరిత్రను ఒక కమిటీతో రాయిస్తున్నారు. వేల సంవత్స రాలు వెనక్కు వెళ్ళి భారతదేశం, భారతీయత అనే భావాలను అప్పటి నుంచి తమకు అనుగుణంగానే ఉన్నాయని నిరూపించడం.

రాయిటర్స్ రిపోర్టు ప్రకారం కమిటీకి స్పష్టమైన లక్ష్యా లు నిర్దేశించడం జరిగింది. పురాతత్వ ఆధారాలను ఉపయోగించి ప్రస్తుతం దేశంలో ఉన్న హిందువులు వేల సంవత్సరాలుగా ఇక్కడనే ఉంటున్న మూలవాసులని నిరూపించడం. అలాగే ప్రాచీన హిందూ గ్రంథాలు పురాణాలు కాదు చారిత్రక వాస్తవాలని నిరూపించడం. ఈ కమిటీలో జియోలజిస్టులు, ఆర్కియాలజిస్టులు, ప్రాచీన సంస్కృత పండితులు, ఇద్దరు బ్యూరోక్రాట్లు ఉన్నారు. మొత్తం 12 మంది సభ్యులు. ఇందులో 9 మందితో డైలీ ఓ మాట్లాడినప్పుడు, ప్రాచీన హిందూ గ్రంథాలను పురాతత్వ తదితర ఆధారాలతో సరిపోల్చి అవన్నీ వాస్తవాలని, పురాణాలు కాదని నిరూపించడం, హిందూ సంస్కృతి అనేది అందరూ అనుకుంటున్న దానికన్నా చాలా ప్రాచీనమైందని నిరూపించడం తమ పనిగా చెప్పారు. చారిత్రక పరిశోధనల ద్వారా చరిత్రను పునర్దర్శించడం అన్నది చాలామంచి విషయమే. కాని ఇక్కడ జరుగుతున్నది అది కాదు. కమిటీకి ఒక లక్ష్యం ముందే నిర్దేశించారు. నిరూపించవలసిందేమిటోముందే చెప్పేశారు. దానికి అవసరమైన సాక్ష్యాధారాలు సేకరించడమో, తయారు చేయడమో ఈ కమిటీ చేయవలసిన పని. అంటే కొత్తగా కనిపెట్టడం కాదు, తాము అనుకున్నది కనిపెట్టినట్లు చెప్పడం జరుగుతుంది.

పైగా ఇదంతా సమాజంలో భిన్న వర్గాల మధ్య గోడలు కట్టే సిద్ధాంతానికి అవసరమైన విషయాలను నిరూపించడం. చరిత్రను పురాణాలను కలగాపులగంగా కలిపేయడం. ఒక మతం మిగిలిన వాటికన్నా చాలా గొప్పదని చెప్పడానికి ప్రయత్నించడం. ఈ కమిటీని నియమించిన బిజెపి గత చరిత్రను పరిశీలిస్తే ఈ భయాలు మరింత పెరుగుతాయి. దేశంలో అనేక మతకల్లోలాల్లో ఈ పార్టీ నాయకుల వ్యవహారశైలి, వివిధ సందర్భాల్లో ఈ పార్టీ నేతల విద్వేషపూరిత వ్యాఖ్యలు దానికి నిదర్శనం. ఈ కమిటీని నియమించిన సాంస్కృతిక శాఖ మంత్రి మహేష్ శర్మ గతంలో చేసిన వ్యాఖ్యలనే తీసుకుందాం. అమ్మాయిలు రాత్రి బయట తిరగడం మన

> ప్రస్తుతం భారతదేశంలో హిందువులు దాదాపు 80% ఉంటారు. ముస్లిములు దాదాపు 14.25% ఉన్నారు. క్రైస్తవులు 2.3% ఉన్నారు. అందరికీ భారత రాజ్యాంగం సమాన హక్కులిచ్చింది. కేవలం హిందువులకు అధిక ప్రాముఖ్యం ప్రాధాన్యత కట్టబెట్టే ఏ ప్రయత్నమైనా రాజ్యాంగానికి వ్యతిరేకమైనది. మహేష్ శర్మ నియమించిన కమిటీ ఇచ్చే నివేదిక ఏమిటన్నది వేచి చూడవలసిందే. కాని భారత ప్రభుత్వమంటే అది దేశంలోని అన్ని మత కులవర్గాల ప్రజలందరి ప్రభుత్వం. ఏదో ఒక సముదాయం ప్రయోజనాలు, ప్రాబల్యం, ఔన్నత్యం గురించి మాత్రమే మాట్లాడడం అన్నది రాజ్యాంగ స్ఫూర్తి కానే కాదు.

సంస్కృతి కాదన్నాడు. మన చరిత్ర, మన సంస్కృతి అనేక సం॥లుగా కలుషితమైపోయాయని, వాటిని ప్రక్షాళనం చేయవలసి ఉందని మరోసారి చెప్పాడు. ఎ.పి.జె. అబ్దుల్ కలాం ముస్లిం అయినప్పటికీ దేశభక్తుడని చెప్పాడు. భారత ఆత్మకు ఖురాన్, బైబిలు కేంద్రం కావని, గీత, రామాయణాలే కేంద్రమని చెప్పాడు. భారతదేశం వచ్చే విదేశీ టూరిస్టులు స్కర్టులు ధరించరాదన్నాడు. బిజెపి నేతలు చాలాసార్లు ముస్లిములను పాకిస్తాన్ పొమ్మంటూ మాట్లాడడం కొత్త కాదు. ఇది ప్రజల్లో చిచ్చుపెట్టే వైఖరి. ఈ కమిటి విషయంలోను ఆయన చెప్పిందేమిటంటే "నేను రామాయణాన్ని ఆరాధిస్తాను. అది చారిత్రక కథ అనుకుంటాను. ఇదంతా కల్పన అనడం చాలా పెద్ద తప్పు". కాబట్టి ఆయన వాస్తవమని అనుకుంటున్న విషయాలు నిరూపించడానికి కమిటీ వేశాడు. కమిటీ పని వాస్తవమని నిరూపించడం. ఈ కమిటీ తుది నివేదికను పార్లమెంటుకు సమర్పిస్తామని, మానవ వనరుల శాఖతో మాట్లాడి కమిటీ కనిపెట్టిన విషయాలను పాఠ్యపుస్తకాల్లో వచ్చేలా చేస్తామని అన్నారు. నిజానికి కమిటీ కొత్తగా కనిపెట్టేది ఏదీ లేదు. శర్మ వాస్తవాలు అని చెబుతున్న మాటలనే కమిటీ తన నివేదికలో రాయాలి తప్ప కమిటీ కనిపెట్టేది ఏముంది? ఆ మాటలకు ఏవోకొన్ని నిరూపణలు చూపించే ప్రయత్నం చేస్తుంది.

ఈ కమిటీ పనిని చాలా సీరియస్‌గా తీసుకుంటామని, ప్రస్తుతం పాఠ్యపుస్తకాల్లో బోధిస్తున్న చరిత్రను ప్రశ్నించే ధైర్యం ఉన్న ప్రభుత్వం తమదని మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ అన్నాడు. దేశంలో మూలవాసులు హిందువులు మాత్రమేనని ఆరెస్సెస్ అభిప్రాయం. ఇతర మతస్తులు మతం మార్చుకున్నవారు లేదా విదేశీయులని తీర్మానిస్తోంది. అందువల్ల వారు ఘర్ వాపసీ ద్వారా హిందుత్వంలోకి రావాలి లేదా బాబర్ కీ ఔలాద్ వంటి దాడులను ఎదుర్కోవాలి.

దీనికి చారిత్రక ఆధారాలు ఆరెస్సెస్‌కి అవసరం లేదు. భారతదేశంలో అసలు మతం హిందుత్వ. కాబట్టి హిందూ భూభాగంలో హిందువులకే ఎక్కువ హక్కులుండాలన్నది ఆరెస్సెస్ భావన. ఆరెస్సెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చరిత్ర పుస్తకాల్లో చేసిన మార్పులు దీనికి ఉదాహరణలు. ఇటీవల రాజస్థాన్‌లో హల్దీఘాట్ యుద్ధ చరిత్రను పూర్తిగా మార్చేసి రాశారు. అక్బర్ గెలిచిన చారిత్రక సత్యాన్ని పక్కన పడేసి మహారాణా ప్రతాప్ గెలిచాడన్నారు. హిందూరాజులు ధైర్యసాహసాలతో పోరాడడం గురించి చెబితే ఆరెస్సెస్‌కు సరిపోదు. యుద్ధాలు జరిగితే అందులో హిందూ రాజులే గెలిచేలా చరిత్ర ఉండాలి. ముస్లిం రాజుపై ప్రతి యుద్ధంలోను హిందూ రాజు గెలిచిన చరిత్రే కావాలి. ఇంతకు ముందు గుజరాత్‌లో బిజెపి అధికారంలో ఉన్నప్పుడు 1995లో కేశూభాయ్ పటేల్ ప్రభుత్వం పాఠ్య పుస్తకాల్లో ముస్లిములు, క్రైస్తవులు, పార్శీలను విదేశీయులుగా చూపించడం జరిగింది. క్రయిస్తవ ఫాదరీల గురించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు పాఠ్యపుస్తకాల్లో చేర్చారు. స్కూలు పాఠ్యపుస్తకాల్లో ఇలాంటి మతతత్వ ప్రచారం చాలా విషాదకరమైనది, ఆందోళనకరమైనది. బిజెపి పరిపాలన, ప్రగతి అనే అంశాల పట్ల శ్రద్ధ చూపే బదులు కాషాయ పార్టీ అనగానే గుడ్డిగా ఓటువేసే మనస్తత్వం ప్రజల్లో సృష్టించడానికి ప్రయత్నిస్తోంది. బిజెపి ప్రభుత్వం నెహ్రూ విధానాలకు విరుద్ధంగా వ్యవహరించడం అంటే సెక్యులరిజం, అందరిని కలుపుకుపోవడం వంటి విలువలకు తిలోదకాలు ఇవ్వడం మాత్రమే కాదు, సైంటిఫిక్ టెంపర్ (శాస్త్రీయ చైతన్యం)కు కూడా వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. వినాయకుడికి మొట్టమొదటి ప్లాస్టిక్ సర్జరీ జరిగిందని పిల్లలు నమ్మడం బిజెపికి కావాలి. అంటే ఆ విధంగా ముస్లింలు ఇక్కడికి రాకముందు దేశంలో గొప్ప సంస్కృతి ఉందన్నది అందరూ నమ్మడమే బిజెపికి కావాలి. ప్రతి పార్టీ తన ప్రయోజనాలకు అనుకూలమైన చారిత్రక అంశాలను మాత్రమే ప్రస్తావిస్తుందన్నది నిజమే, కాని బిజెపి మాత్రం తన ప్రయోజనాలకోసం అవసరమైన చరిత్రను తయారు చేస్తోంది. ప్రస్తుతం భారతదేశంలో హిందువులు దాదాపు 80% ఉంటారు. ముస్లిములు దాదాపు 14.25% ఉన్నా రు. క్రైస్తవులు 2.3% ఉన్నారు. అందరికీ భారత రాజ్యాంగం సమాన హక్కులిచ్చింది. కేవలం హిందువులకు అధిక ప్రాముఖ్యం ప్రాధాన్యత కట్టబెట్టే ఏ ప్రయత్నమైనా రాజ్యాంగానికి వ్యతిరేకమైనది. మహేష్ శర్మ నియమించిన కమిటీ ఇచ్చే నివేదిక ఏమిటన్నది వేచి చూడవలసిందే. కాని భారత ప్రభుత్వమంటే అది దేశంలోని అన్ని మతకులవర్గాల ప్రజలందరి ప్రభుత్వం. ఏదో ఒక సముదాయం ప్రయోజనాలు, ప్రాబల్యం, ఔన్నత్యం గురించి మాత్రమే మాట్లాడడం అన్నది రాజ్యాంగ స్ఫూర్తి కానే కాదు.

✻ (డైలీ ఓ కథనం)

విస్మృత వీర నారులు



ఆర్వీ రామారావ్
9676999856

సామాజిక కార్యకర్తలుగా తమ ఆత్మకు ఇంపైన పనులు చేయడం, అత్యంత అననుకూలమైన పరిస్థితులలో కూడా ధైర్యంగా జీవిత పోరాటం సాగిస్తూ అన్యాయాన్ని ఎదిరించడంలో సాటిలేని కృషిచేసి చరిత్రకు అందకుండా పోయిన వారు ఎందరో.

ఝార్ఖండ్‌లో ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు ఫ్యాక్టరీ వల్ల 40 గ్రామాల ప్రజలు నిర్వాసితులవుతారన్న వాదనతో ఆ కర్మాగారం ఏర్పాటును వ్యతిరేకించిన ఆదివాసీ మహిళ దయామణి బర్ల పోరాటానికి ప్రతీకగా నిలిచారు. వృత్తి రీత్యా ఆమె పత్రికా రచయిత. 2014 లోకసభ ఎన్నికలలో ఆం ఆద్మీ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆమె తండ్రి నిరక్షరాస్యుడైనందువల్ల ఉన్న భూమిని లాగేసుకున్నారు. ఆయన పొట్ట చేతపట్టుకుని పట్నం వెళ్లి పోయాడు. తల్లి మరో చోట పాచి పని చేసి బతుకు వెళ్లదీసేది. దయామణి మాత్రం చదువుకోవడం కోసం రాంచీలోనే ఉండిపోయి రైతుకూలీగా పనిచేసి చదువు కొనసాగించారు. జర్నలిజం చదువుకోవడానికి ఫీజు చెల్లించడానికి పాచిపని చేశారు. చాలాసార్లు రైల్వేస్టేషన్ లోనే పడుకోవాల్సి వచ్చేది.

బర్లా ప్రాతినిధ్యం వహించే ఆదివాసి, మూలవాసి, అస్తిత్వ రక్షా మంచ్ ఉక్కు ఫ్యాక్టరీవల్ల నిర్వాసితులైన వారు మరోచోట బతకలేరని వాదించారు. ఈ కర్మాగారం వల్ల అడవులు, జీవావరణం దెబ్బ తిటాయంటారు. పత్రికా రచనలో ఆమె చేసిన కృషికి ప్రసిద్ధ పత్రికా రచయిత పాలగుమ్మి సాయినాథ్ రాసిన 'ఎవ్రీ వన్ లవ్స్ ఎ గుడ్ డ్రాట్' అన్న పుస్తకంపై వచ్చే డబ్బుతో ఏర్పాటు చేసిన కౌంటర్ మీడియా అవార్డు ఆమెకు దక్కింది.

ఆసిడ్ దాడికి వెరవక: ఢిల్లీ లోని ఖాన్ మార్కెట్లో లక్ష్మిపై ఆమె సోదరుడి స్నేహితుడు ఆసిడ్ పోశాడు. ఆమె ముఖం గుర్తుపట్టడానికి వీలు లేనంతగా మారిపోయింది. జీవితంలో సర్వస్వం కోల్పోయింది. సోదరుడికి క్షయ వ్యాధి. తండ్రి మరణించాడు. కుటుంబ పోషణ భారం తానే స్వీకరించింది. జవజీవాలు కూడదీసుకుని బతుకులో నిలదొక్కుకోవడమే కాకుండా ఆసిడ్ దాడికి గురైన ఇతరుల కోసం కూడా పోరాడుతోంది. ఇలాంటి దాడులకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమంలో ఉద్యమం నడుపుతోంది. ఆమె మీద ఆసిడ్ పోసిన వ్యక్తికి పదేళ్ల శిక్ష పడింది. ఒబామా భార్య మిషెల్ ఒబామా ఆమెకు అవార్డు ప్రకటించారు. అంతర్జాతీయ సాహస మహిళల అవార్డు కూడా దక్కింది.

పట్టు పరిశ్రమ మాఫియాపై పోరు: బెంగళూరులోని మగదిలో పట్టు పరిశ్రమ మాఫియాపై పోరాడి కె.ఎస్. సరోజమ్మ 3000 మంది బాలలను కట్టుబానిసత్వం నుంచి విముక్తుల్ని చేశారు. విముక్తి పొందిన బాల కార్మికుల కోసం ఆమె 'చిగురు బాల వికాస్ సంస్థ' నడుపుతున్నారు. ఆమెను 'అమ్మ' అని పిలుస్తారు.

బృందావన్ వితంతువుల కోసం: నా అన్న వారు లేని వితంతువులు బృందావనంలో కాలం గడుపుతుంటారు. వారిని ఆదుకోవడమే డా. లక్ష్మి గౌతం పని. దిక్కుమొక్కు లేకుండా మరణించిన వందమంది వితంతువుల అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. వితంతువులకు ఆర్థిక సహాయం చేస్తారు. ధైర్యం చెప్తారు.

అభాగ్యులకు అండ : ప్రీతి పాట్కర్ ముంబైలో 1986 నుంచి వేశ్యల సంతానం కోసం మూడు కేంద్రాలు నడుపుతున్నారు. రాత్రి పూట పిల్లలకు వసతి కల్పిస్తారు. వారి భోజన సదుపాయం, వారం వారం వైద్య పరీక్షలు కూడా చేయిస్తారు. కశ్మీర్‌కు చెందిన సబా హాజీ బెంగళూరులో ఉండే వారు. కాని కశ్మీర్ తిరిగి వచ్చి బ్రిస్వానాలోని తన తండ్రి ఇంట్లో రెండు గదుల్లో 2009లో ఓ పాఠశాల ప్రారంభించారు. ఈ పాఠశాలలో 200మంది విద్యార్థులు ఉన్నారు. ఎవరూ బడి మానేయకపోవడం సబా నడుపుతున్న పాఠశాల ప్రత్యేకత.

రాజస్థాన్‌లోని దూవార్‌లో కుండలు చేసే సామాజిక వర్గానికి చెందిన అతి సామాన్యురాలు భన్వారీ దేవి మహిళాభివృద్ధి పథకం కింద భూమి, నీరు, ఆరోగ్యం వంటి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేసేవారు. కాని 1992లో బాల్య వివాహాలను వ్యతిరేకించడం వల్ల ఆమె పరిస్థితి అకస్మాత్తుగా మారి పోయింది. ఆమె మీద సామూహిక అత్యాచారం జరిగింది. కాని వెనుకాడకుండా అత్యాచారం గురించి బాహాటంగా మాట్లాడారు. సంఘ బహిష్కారాన్నీ ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రాణాలకు తెగించి అత్యాచారానికి గురైన మహిళలకు న్యాయం చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

ఎయిడ్స్ బాధితులకోసం: సామాజిక కార్యకర్త సునీతా కృష్ణన్ ప్రజ్వల సంస్థ వ్యవస్థాపకురాల్లో ఒకరు. అంగడి సరుకైపోయిన మహిళలకు సునీత ఆశ్రయం ఇస్తారు. ప్రజ్వల సంస్థ హైదరాబాద్‌లో ఎయిడ్స్ సోకిన 5000 మంది బాలలకు విద్యగరపుతోంది. ఆమె కూడా అత్యాచారానికి గురయ్యారు.

విరబూసిన తెలుగు కలువలు : తెలుగు వారిది స్వాతంత్ర్య పోరాటంలో విశిష్టమైన పాత్ర. మహిళలూ ఏ మాత్రం వెనుకాడకుండా ఆ పోరాటంలో పాల్గొన్నా రు. అయితే ఇందులో మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి, కొన్ని సందర్భాలలో సంపన్న మహిళలు కూడా పాల్గొన్నారు. దువ్వూరు సుబ్బమ్మ, దుర్గాబాయి దేశ్ ముఖ్, సంగం లక్ష్మీ బాయమ్మ, యెల్లాప్రగడ సీతా కుమారి, అమ్మన్న రాజా వంటి వారు ఈ పోరాటంలో ప్రసిద్ధులే. కాని ఆంధ్ర మహాసభ, తెలంగాణ సాయుధ పోరాటంలో మాత్రం మల్లు స్వరాజ్యం, రావి సీతాదేవి, ఆరుట్ల కమాలా దేవి వంటి వారితో పాటు సామాన్య స్త్రీల పాత్ర అమోఘం. 1960ల మధ్యలో కొనసాగిన నక్సలైట్ ఉద్యమంలోనూ పంచాది నిర్మల (జయక్క) మొదలైన వారు ఎన్ కౌంటర్లకు బలయ్యారు. చాకలి అయిలమ్మ పోరాట పటిమ సుప్రసిద్ధమే. అనేక మంది మహిళలు, ముఖ్యంగా సామాన్య మహిళలు పోలీసుల తూటాలకు బలయ్యారు. వారి త్యాగ నిరతి అసామాన్యమైంది. ఏడు నెలల గర్భవతి అయిందాకా అజ్ఞాత వాసం గడిపి అజ్ఞాతంలోనే బిడ్డకు జన్మనిచ్చి, రెండు నెలల పాపను ఇతరులకు అప్పగించి మళ్లీ పోరుబాట పట్టిన చంద్రమ్మ (పైలా వాసుదేవ రావు ఆమె భర్త), జీవితాంతం పోరుబాట పొడవునా పాదముద్రలు చెరగనీయని జీవిత గడుపుతున్న కొండపల్లి కోటేశ్వరమ్మ లాంటి నిరుపమాన త్యాగశీలురు సజీవంగా ఉన్నారు. భావి తరాలకు వాళ్లే స్ఫూర్తి ప్రదాతలు.

సామాజిక రాజకీయ ఉద్యమాలు, విద్యా, సాంస్కృతిక రంగాలు, శాస్త్ర పరిశోధనలు, నిర్భాగ్యులను ఆదుకోవడం ఇలా వివిధ రంగాలలో తమ పాత్ర ద్వారా సమాజాభ్యుదయానికి పాటుబడ్డ మహిళలు ఎందరో ఉన్నారు. అయితే వారిలో విస్మృత నారీమణుల సంఖ్యే ఎక్కువ. అయినా ఇప్పటికీ మహిళలంటే సమాజానికి విపక్షే. చిన్న చూపే. ఈసడింపే. రైతు కూలీ మహిళలకు, కాయ కష్టం చేసుకునే మహిళలకు సమానపనికి సమానవేతనం ఇప్పటికీ అమలుకావాల్సిన ఆదర్శమే. గాంధీ ఆశించినట్టు మహిళ అర్ధరాత్రి వేళ రోడ్డు మీద నిర్భయంగా నడవగలిగే పరిస్థితి ఎటూ లేదు. పట్ట పగలే దిక్కు లేదు. అత్యాచారాలు, అఘాయిత్యాలు నిత్యకృత్యం. మానం మహిళలకు మాత్రమే ఉంటుందన్నది పురుషాహంకార సమాజ విశ్వాసం. అందుకే స్త్రీ మానమర్యాదలు దోపిడీకి గురవుతుంటాయి. నిర్భయ చట్టాలు చూసి భయపడే కామాంధులు ఎవరూ లేరు. మహిళలను పూజించక్కర లేదు. బతకనివ్వడమే సంస్కారానికి ప్రతీక. దానికే కరువు.

ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం
మన తెలంగాణ
మన
మనపేజీ
మనందరిపేజీ
www.manatelangana.news
హైదరాబాద్ | ఆదివారం | 11 మార్చి | 2018

ఆహార భద్రత ప్రధాన లక్షణంగా జీవించే స్వయం సమృద్ధ ఆదివాసీ జీవన విధానంలోకి వాణిజ్య పంటలను చొప్పించడం ఎంత వరకు సమంజసం? గిరిజన జీవన శైలిలో అన్నిటికన్నా నాకు నచ్చిన విషయం వారికి డబ్బు సంపాదించాలనే యావ , ఆధునిక సౌకర్యాల పైన మోజు లేకపోవడం. తినడానికి కావలసినంత కష్టపడటం, తర్వాతంతా కావలసినంత తీరిక. రంపచోడవరం ఏజెన్సీలోని కొండరెడ్లతోనే కాదు, నా పనిలో భాగంగా నల్లమల లోని చెంచులతో, ఆదిలాబాద్ లోని గోండులతో, జార్ఖండ్‌లోని ముండా తెగ వారితో, పశ్చిమ బెంగాల్ లోని సంథాల్ లతో ఇలా ఎన్నో గిరిజన తెగల వారితో పని చేయడం జరిగింది. ఈ అన్ని ప్రాంతాలలోను నేను గమనించింది ఒకటే. అభివృద్ధి, నాగరికతల పేరుతో జరుగుతున్న గిరిజనుల సంతృప్తికరమైన, స్వయం సమృద్ధమైన జీవితాల విధ్వంసం.





ఆధునికత దాడిలో ఆదివాసీలు

ఆహార భద్రతకు, ప్రశాంతతకు దూరమై

కొంచెం బియ్యం, కారం దొంగతనం చేశాడనే ఆరోపణపై ఇటీవల కేరళలో కొట్టి చంపబడిన ఆదివాసీ యువకుడు మధు ఉదంతం దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీసింది. ప్రధాన, సామాజిక మీడియాలలో విస్తృతంగా చర్చించబడ్డ ఈ సంఘటన నిజంగానే ఒక దారుణం. మానవత్వాన్నే ప్రశ్నార్థకంగా మార్చిన దుర్ఘటన. ఎవరైతే మధుని కొట్టి చంపారో ఆ గుంపులోని వ్యక్తులే ఆ సంఘటనను చిత్రీకరించి సోషల్ మీడియా లో పోస్ట్ చేయడంతో ఈ విషయం వెంటనే వెలుగులోకి వచ్చింది కానీ నిజానికి ఈ మధు ఒంటరి వాడు కాదు. ఆదివాసీలపై ఇటువంటి వివక్ష, దాడులు కొత్త కూడా కాదు.

కొన్ని సంవత్సరాల క్రితం గిరిజనులకు సంబంధించిన ఒక అధ్యయనంలో భాగంగా సుబ్బారావు గారనే ఒక గిరిజన వైద్యుడితో మాట్లాడటం జరిగింది. రంపచోడవరం ఏజెన్సీలోని ఒక చిన్న గిరిజన గ్రామం ఈయనది. ఆ ఏజెన్సీ లో ప్రతి చెట్టు, ఆకు, కొమ్మ, కాండం అన్నీ ఆయనకు తెలుసు. దేనిలో ఏ ఔషధ విలువలు ఉన్నాయో ఏ చెట్టు లో ఏ భాగాన్ని ఎటువంటి వైద్యానికి వాడాలో ఆయనకు వారసత్వంగా వచ్చిన విద్య. అక్కడి కొండ రెడ్ల జీవితం అడవితో ఎలా పెనవేసుకుని ఉంటుందో ఎంతో చక్కగా వివరించారాయన. కలపేతర అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని దగ్గరలో ఉన్న వారపు సంతలో అమ్ముకోవడం, ఉన్న కొద్దిపాటి కొండ పోడు లో వ్యవసాయం చేసుకోవడం అక్కడి గిరిజనుల ప్రధాన జీవనోపాధులు. ఒక ఎకరం కొండ పోడు ఉంటే వరి, కొర్రలు, ఆవాలు, కందులు ఇలాంటివి పదకొండు రకాల పంటలు ఒక ఏడాదిలో పండిస్తారని చెప్పారాయన. ఆ పంటలు, అడవిలో దొరికే పండ్లు, కాయలతో వారికి ఆహార భద్రతకి లోటు ఉండదు అని ఆయన చెబుతుండగానే పెద్ద శబ్దం చేస్తూ రెండు లారీ లు కొండవైపుకి వెళ్లడం చూశాం. వాటి నిండా యేవో మొక్కలు ఉన్నట్లు కనపడి అవి ఏమిటి అని అడిగాను ఆయనను.

కాఫీ మొక్కలు అని చెప్పారాయన. మా గిరిజనులకు వ్యవసాయం చేయడం తెలియక ఎక్కువ లాభాలు పొందలేక పోతున్నామని మా కొండ పోడు లో ఈ కాఫీ మొక్కలు పెడతారట గవర్నమెంట్ వాళ్ళు. వీటితో మాకు లాభాలు బాగా వస్తాయని చెబుతున్నారు అన్నారు ఆయన. మరి మీ ఆహార పంటలు ఏమవుతాయి, అవి లేకపోతే మీరేమి తింటారు? అంటే మీ అందరి లాగా మార్కెట్‌లో కొనుక్కోవాలి ఇక అన్నారు సుబ్బారావు గారు నిట్టూరుస్తూ.

ఆహార భద్రత ప్రధాన లక్షణంగా జీవించే స్వయం సమృద్ధ జీవన విధానంలోకి వాణిజ్య పంటలను చొప్పించడం ఎంత వరకు సమంజసం అనుకుంటూ తిరిగి వచ్చాను ఆ ఊరినుండి నేను. వారి జీవన విధానం లో అన్నిటికన్నా నాకు నచ్చిన విషయం వారికి డబ్బు సంపాదించాలనే యావ లేదు. ఆధునిక సౌకర్యాల పైన మోజు లేదు. తినడానికి కావలసినంత కష్టపడటం, తర్వాతంతా కావలసినంత తీరిక.

ఈ రంపచోడవరం ఏజెన్సీలోని కొండరెడ్లతోనే కాదు, నా పనిలో భాగంగా నల్లమల లోని చెంచులతో, ఆదిలాబాద్ లోని గోండులతో, జార్ఖండ్‌లోని ముండా తెగ వారితో, పశ్చిమ బెంగాల్ లోని సంథాల్ లతో ఇలా ఎన్నో గిరిజన తెగల వారితో పని చేయడం జరిగింది. ఈ అన్ని ప్రాంతాలలోను నేను గమనించింది ఒకటే. అభివృద్ధి, నాగరికతల పేరుతో జరుగుతున్న గిరిజనుల సంతృప్తికరమైన, స్వయం సమృద్ధమైన జీవితాల విధ్వంసం.

2001 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 8.10 శాతం ఆదివాసీలు. వీరి ఆవాసాలు అడవులు, కొండ ప్రాంతాలే. పోడు వ్యవసాయం, కలపేతర అటవీ ఉత్పత్తుల సేకరణ వీరి ప్రధాన వృత్తులు. స్వయం సమృద్ధ జీవన విధానం, ప్రత్యేకమైన సంస్కృతి సంప్రదాయాలు, తమవైన కట్టుబాట్లు ఆచారాలతో దేశంలోని అనేక గిరిజన తెగలు నాగరిక సమాజానికి దూరంగా జీవనం సాగిస్తున్నారు. వీరి ఆవాసాలు ఉండే ప్రాంతాలు మౌలిక సదుపాయాల కల్పనకు అనుకూలంగా లేకపోవడం, ఆ సౌకర్యాల గురించి గట్టిగా ప్రశ్నించే గొంతు గిరిజనులకు కొరవడడంతో ఈనాటికీ అనేక ఆదివాసీ గ్రామాలు త్రాగునీరు, విద్యుత్తు, రవాణా సదుపాయాలు వంటి కనీస మౌలిక వసతులు కూడా కరవై అభివృద్ధికి ఆమడ దూరంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇక విద్య, వైద్యం వంటి సదుపాయాల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. ఆ మధ్య ఒడిస్సా లో ఒక గిరిజనుడు అంబులెన్సు సదుపాయం అందుబాటులో లేక పక్కన వెక్కి వెక్కి ఏడుస్తున్న కూతురు వెంటరాగా తన భార్య శవాన్ని భుజాన వేసుకుని మైళ్ళ కొద్దీ నడిచిన సంఘటన ప్రతి ఒక్కరికీ బాధ కలిగించింది. ఇక విద్యా సదుపాయాల విషయానికి వస్తే చాలా వరకు గిరిజన గ్రామాలలో పాఠశాలలే లేవు. ఉన్నా వాటిపై పర్యవేక్షణా లోపంతో ఉపాధ్యాయుల లో జవాబుదారీతనం లేదు. ఒకవేళ మంచి టీచర్లు ఉండి బోధన జరిగినా తమ జీవన విధానానికి ఏ మాత్రం సంబంధంలేని పాఠ్యాంశాలు ఆ గిరిజన బాల బాలికలను అయోమయానికి గురి చేయడం తప్ప వారికి అవసరమైన విద్య, పరిజ్ఞానాన్ని అందివ్వలేకపోతున్నాయి.

ఆదివాసీ సంస్కృతి పై, వనరులపై జరిగే మరోదాడి పర్యాటకం అనే రూపంలో కూడా కొనసాగడం నేను గమనించిన మరొక అంశం. పశ్చిమ బెంగాల్ లోని భీర్‌భమ్ జిల్లాలోని బోల్‌పూర్ (ఇక్కడే రవీంద్రుని శాంతినికేతన్, ప్రస్తుత విశ్వ భారతి యూనివర్సిటీ ఉంది) దగ్గర ఒక సంతాల్ గిరిజన గ్రామాన్ని గతంలో నేను సందర్శించడం జరిగింది. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలలోని విభిన్నతను, వైవిధ్యాన్ని నాగరీకులకు తెలియచేయాలనే ఉద్దేశ్యంతో ఆ రాష్ట్ర పర్యాటక శాఖ ఆ గ్రామాన్ని రూరల్ టూరిజం (గ్రామీణ పర్యాటక) కేంద్రంగా మార్చింది. పర్యాటకులు అక్కడ బస చేసేందుకు కాటేజ్ లు నిర్మించి, అక్కడి ఆదివాసీలలో కొందరికి గైడ్లుగా శిక్షణ ఇచ్చి చేతులు దులుపుకుంది. శాంతినికేతన్ కు వచ్చే పర్యాటకులు అక్కడికి కేవలం మూడు నుండి నాలుగు కిలోమీటర్ల దూరంలో పచ్చటి అడవిలో ఉన్న ఈ గ్రామంలో విడిది చేయడం, కాలుష్యానికి కల్మషానికి దూరంగా ప్రశాంతంగా ఉన్న ఆ గిరిజన గ్రామాన్ని చెత్త, కాలుష్యంతో నింపేయడం తప్ప ఈ పర్యాటక కేంద్ర హోదా వల్ల ఆ ఆదివాసీలకు ఒరిగిందేమీ లేదు.

గిరిజనుల మరొక ప్రధాన సమస్య భూమిపై హక్కు. వ్యవసాయం చేసుకునే భూమిపై పట్టా లేకపోవడం కొందరి సమస్య అయితే భూ రికార్డు ల నిర్వహణలో అవకతవకలు, వాటికి తోడు గిరిజనుల పేదరికం, నిరక్షరాస్యతల వల్ల వారి భూములు చాలా వరకు స్వార్థపరులైన నాగరీకుల చేతులలోకి వెళ్లిపోయాయి. మన తెలంగాణా చరిత్రను ఒక్క సారి చూస్తే 1940 లలో ఆదిలాబాద్ జిల్లాలో కొమరం భీం నాయకత్వాన గోండు తెగకు చెందిన గిరిజనులు జరిపిన పోరాటం తమ భూమికోసమే, ఆ భూమిపై హక్కు కోసమే. బ్రిటిష్ కాలంలో మెరుగుపడిన రవాణా వ్యవస్థ గిరిజనులు మైదాన ప్రాంతాలకు ప్రయాణించేందుకు వెసులుబాటు కల్పించినదానికన్నా నాగరీకులు గిరిజన ప్రాంతాలలోకి చొరబడి వారి భూములు, వనరులు లాక్కునేందుకు ఎక్కువ అవకాశం కల్పించింది.

దీనితో ఆ ఆదివాసీలు ఎదురు తిరిగి తమ భూమి కోసం ఉద్యమం చేసినప్పటికీ భూ రికార్డులు సరిగా లేకపోవడంతో ఆ భూములు తమవే అని నిరూపించుకోలేక తరతరాలుగా సాగుచేసుకుంటున్న భూమిని కోల్పోవాల్సి వచ్చింది. 1946–51 మధ్య వచ్చిన తెలంగాణా సాయుధ పోరాటం, పశ్చిమ బెంగాల్ లో మొదలై ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలకు విస్తరించిన నక్సల్బరీ ఉద్యమం, 1980 లో ఇంద్రవెల్లి తిరుగుబాటు అన్నీ భూ పోరాటాల చరిత్రలే. 1990 లలో వచ్చిన పీసా (PESA Panchayat Extension to Scheduled Areas), 2006 నాటి అటవీ హక్కుల చట్టం వంటి బలమైన శాసనాలు కూడా అమలులో చిత్తశుద్ధి లోపం, ఆదివాసీల అవగాహనా రాహిత్యం వల్ల ఎందుకూ కొరగానివిగా అయిపోయాయి. నిజానికి అత్యధిక శాతం ఆదివాసీలకు వారి సంక్షేమం కోసం రూపొందించబడిన ఎన్నో పథకాల పేర్లు కూడా తెలియవు.

భారత దేశంలోని గిరిజనుల జీవితాలపై విస్తృతంగా అధ్యయనం చేసిన హేమాండార్ఫ్ అనే సామాజిక శాస్త్రవేత్త ప్రకారం మైదాన ప్రాంతాల నుండి వలస వెళ్లిన నాగరీకులు గిరిజనులకు మద్యం, డ్రగ్స్ (మత్తుమందులు) అలవాటు చేసి వారి భూములను, విలువైన వనరులను దోచుకోవడం మొదలు పెట్టారు. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో దీనిని నేను స్వయంగా చూశాను. అక్కడి గిరిజనులు వారమంతా అడవిలో తిరిగి గమ్ కరయా, కరక్కాయ, తిప్పతీగ (దీనిని మలేరియా తీగ అని పిలుస్తారు), తేనె వంటి కలపేతర అటవీ ఉత్పత్తులను సేకరించి అడ్డతీగల వారపు సంతలో అమ్ముకుని వారికి కావాల్సిన ఉప్పు, పప్పులను కొనుక్కుని వారి వారి గ్రామాలకు తిరిగి వెళతారు. ఈ సంతలో ఒకరోజు గడిపిన మాకు బయట మార్కెట్ లో దాదాపు కిలో రెండువేల ఖరీదు చేసే గమ్ కరయా (దీనిని ఫార్మా పరిశ్రమలో ఎక్కువగా వినియోగిస్తారు)ను సారాదుకాణం లో ఇచ్చి ఒక సీసా చీప్ లిక్కర్ తీసుకుని తాగుతున్న గిరిజన దంపతులను చూసి బాధ కలిగింది. ఆ గిరిజనుల బలహీనతలను, అమాయకత్వాన్ని తమ దోపిడీకి వాడుకునే నాగరీకులను నిజంగా నాగరీకులు అనవచ్చా అనే సందేహం కలిగింది. తేనె, కరక్కాయ, ఉసిరి, కుంకుడుకాయలు ఇలా ఏ అటవీ ఉత్పత్తి తీసుకున్నా మార్కెట్ ధరలో ఆ గిరిజనులకు దక్కేది రూపాయలో పది పైసలు మాత్రమే. వారు ఎంతో శ్రమపడి తెచ్చిన ఉత్పత్తులను ఇంత తక్కువ ధరకు తీసుకోవడం అన్యాయం కదా అని దళారీని అడిగితే 'వాళ్ళకి అడవిలో ఉచితంగా దొరికే వాటికి ఈ మాత్రం ఇవ్వడమే ఎక్కువ' అనేశారాయన. అవి సేకరించేందుకు వారు ఖర్చు పెట్టిన సమయం, శ్రమ, తీసుకున్న రిస్క్ లకు ఏ మాత్రం విలువ లేదు వారి దృష్టిలో. తాడుకట్టుకుని కొండ అంచునుండి తలకిందులుగా వేలాడుతూ కొద్దిపాటి కొండ తేనె సేకరించేందుకు ఒక గిరిజనుడు తన ప్రాణాలనే రిస్క్ చేస్తుంటాడు. కానీ మన దృష్టిలో అది ఉచితంగా దొరికే పదార్థం. ఇలా వారి భూములు, వనరులు కారు చౌకగా లేదా ఉచితంగా నాగరీకులు దోచుకుని ఆదివాసీలను నిరుపేదలుగా, నిస్సహాయులుగా మారుస్తున్నారు.

ఇక దేశంలో పెద్ద ఎత్తున ఏ అభివృద్ధి ప్రాజెక్ట్ లు చేపట్టినా అందులో ప్రధానంగా నిర్వాసితులయ్యేది గిరిజనులే. భారీ నీటి పారుదల ప్రాజెక్ట్ లు, గనుల తవ్వకాలు, పారిశ్రామిక అభివృద్ధి ఇలా ఏది చేపట్టినా నిర్వాసితులయ్యే జనాభాలో దాదాపు మూడింట ఒకటో వంతు గిరిజనులే ఉంటున్నారని అనేక అధ్యయనాలలో వెల్లడయింది.

ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాలలో వేళ్ళూనుకునిపోయిన నక్సల్ ఉద్యమం కూడా ఆదివాసీల జీవితాలను అతలాకుతలం చేసింది. తమపై జరుగుతున్న దోపిడీ, దౌర్జన్యాలకు ఆగ్రహించిన కొంతమంది ఆదివాసీలు నక్సల్ ఉద్యమాన్ని బలంగా సమర్థించి దానికి తోడ్పాటునందించగా ఆ ఉద్యమాలను అణచివేసేందుకు ప్రభుత్వాలు, కాపాడుకునేందుకు నక్సలైట్‌లు పరస్పరం తలపడడంతో జరుగుతున్న ఘర్షణలో నలిగిపోతున్నది కూడా ఆదివాసీలే. అందుకే పెద్దఎత్తున ఆ ప్రాంతాలలోని ఆదివాసీలు తమ ఆవాసాలను వదిలి మన తెలంగాణాలోని భద్రాచలం చుట్టుపక్కల ప్రాంతాలలో కూలి నాలీ చేసుకుంటూ బతకడం మొదలుపెట్టారు. ఆదివాసీ సంస్కృతి పై, వనరులపై జరిగే మరోదాడి పర్యాటకం అనే రూపంలో కూడా కొనసాగడం నేను గమనించిన మరొక అంశం. పశ్చిమ బెంగాల్ లోని భీర్‌భమ్ జిల్లాలో ని బోల్‌పూర్ (ఇక్కడే రవీంద్రుని శాంతినికేతన్, ప్రస్తుత విశ్వ భారతి యూనివర్సిటీ ఉంది) దగ్గర ఒక సంతాల్ గిరిజన గ్రామాన్ని గతంలో నేను సందర్శించడం జరిగింది. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలలోని విభిన్నతను, వైవిధ్యాన్ని నాగరీకులకు తెలియచేయాలనే ఉద్దేశ్యంతో ఆ రాష్ట్ర పర్యాటక శాఖ ఆ గ్రామాన్ని రూరల్ టూరిజం (గ్రామీణ పర్యాటక) కేంద్రంగా మార్చింది. పర్యాటకులు అక్కడ బస చేసేందుకు కాటేజ్ లు నిర్మించి, అక్కడి ఆదివాసీలలో కొందరికి గైడ్లుగా శిక్షణ ఇచ్చి చేతులు దులుపుకుంది. శాంతినికేతన్ కు వచ్చే పర్యాటకులు అక్కడికి కేవలం మూడు నుండి నాలుగు కిలోమీటర్ల దూరంలో పచ్చటి అడవిలో ఉన్న ఈ గ్రామంలో విడిది చేయడం, కాలుష్యానికి కల్మషానికి దూరంగా ప్రశాంతంగా ఉన్న ఆ గిరిజన గ్రామాన్ని చెత్త, కాలుష్యంతో నింపేయడం తప్ప ఈ పర్యాటక కేంద్ర హోదా వల్ల ఆ ఆదివాసీలకు ఒరిగిందేమీ లేదు.



కేరళలో హత్యకు గురైన గిరిజనుడు మధు (ఫైల్)

తెలంగాణ రాష్ట్రంలోని మూడు ప్రధానమైన ఏజెన్సీ ప్రాంతాలు : ఉట్నూర్, ఏటూరు నాగారం, భద్రాచలం. ఈ మూడు ఏజెన్సీ ప్రాంతాలలోని గిరిజనులదీ ఇదే పరిస్థితి. ఎప్పుడో 1970 ల లోనే హేమాండార్ఫ్ ఉట్నూర్ ప్రాంతాన్ని సందర్శించి మహారాష్ట్ర నుండి, గుజరాత్ నుండి వచ్చిన గిరిజనేతరులు ఆ ప్రాంతంలో బలమైన వర్గంగా మారడం గమనించారు. ఏదో కొద్ది మంది గుజరాతీలు చిన్న పాటి దుకాణాలు, వడ్డీ వ్యాపారం వంటి వృత్తులలో స్థిరపడగా చాలా వరకు ఈ వలస దారులు అక్కడి గిరిజనుల భూములను ఆక్రమించుకుని వారిని వారి స్వంత ప్రాంతంలోనే ఒక మైనారిటీ వర్గంగా మార్చేయడం జరిగింది. గిరిజనుల భూములు, వనరులపై జరుగుతున్న దోపిడీ మాత్రమే ఇదంతా. ఇక నిస్సహాయులైన, అమాయకులైన గిరిజన స్త్రీలపై జరిగే అకృత్యాల గురించి రాయాలంటే పేజీలు సరిపోవు. ఒక్కసారి వాకపల్లి ఉదంతం గుర్తు చేసుకుంటే చాలు, దుఃఖం పొంగుకొస్తుంది.

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ ఇలా ఏ ప్రాంతం తీసుకున్నా గిరిజనుల ప్రాంతాలను ఆక్రమించి, వారి సంస్కృతి సంప్రదాయాలను విచ్ఛిన్నం చేసి, వారికి జీవనోపాధి లేకుండా చేసి వారిని బలహీనులుగా, నిస్సహాయులుగా మార్చినది నాగరీకులం అని చెప్పుకునే మనవంటి వారి స్వార్థం, క్రూరత్వమే. అప్పుడప్పుడు బయట పడే మధు లాంటి వారి ఉదంతాలు మన నాగరికత వికృత రూపాన్ని బయట పెడుతున్నాయి. మనం సామూహికంగా సిగ్గుపడాల్సిన సందర్భాలలో అది ఒకటి మాత్రమే.



మధు కుటుంబాన్ని పరామర్శించిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ (ఫైల్ ఫోటో)



భారతి కోడె
9440103411

బౌద్ధ జైనాలు విలసిల్లిన కండ్లపల్లి

జగిత్యాల జిల్లా బిర్పూర్ మండలంలోని కండ్లపల్లి గ్రామం చరిత్ర పుటల్లోకి ఎక్కబోతోంది. పలు ప్రైవేటు, ప్రభుత్వ భూముల్లో వందల ఏళ్ల చరిత్ర గురించిన పురాతన శిల్పాలు బయలుపడుతుండడంతో పురావతస్తు శాఖ ఈ గ్రామాన్ని గుర్తించి తవ్వకాలను చేపడుతున్నది. ఇప్పటి వరకు దొరికిన శిలా విగ్రహాల ప్రకారం కాకతీయులు ఈ ప్రాంతాన్ని పాలించినట్లుగా ఆధారాలు లభ్యమవుతున్నాయి. బౌద్ధం, జైనం కూడా ఇక్కడ విసిల్లినట్లు తెలుస్తోంది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ముందు భాగంలో ఈ మధ్యకాలంలో జరిపిన తవ్వకాల్లో బౌద్ధ, జైన మతాలకు చెందిన కొన్ని ఆధారాలు లభ్యమయ్యాయి. గ్రామం సమీపంలోనూ అనేక చిన్న, చిన్న గుడులు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 400 ఏళ్ల క్రితం ఇక్కడ బ్రాహ్మణ కుటుంబాలు ఎక్కువగా ఉండేవని వీరు ఆ చిన్న చిన్న గుడులలో పూజారులుగా ఉండి జీవనం సాగించేవారని తెలుస్తోంది. ఆ గుడులన్నీ కాలగర్భంలో కలిసిపోవడం మూలంగా ఆ కుటుంబాలు ఒక్కటొక్కటిగా బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతం చుట్టూ చెరువులు, కుంటలు ఉండడంతో వ్యవసాయం అభివృద్ధి చెంది ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పురావస్తు తవ్వకాల్లో శివలింగం, గండదీప స్తంభం, గణపతి, కాలభైరవ, అమ్మవారి విగ్రహాలతోపాటు బుద్ధుని విగ్రహాలు, సప్త మాత్రుకలు బయటపడ్డాయి. దీనిని బట్టి ఆరో శతాబ్దంలో శాతనవాహనులు, బైద్ధ, జైన సంస్కృతులు విరాజిల్లినట్లు అంచనా వేస్తున్నారు. తిరిగి ఈ మధ్య కాలంలో చెరువు సమీపంలో జరిపిన తవ్వకాల్లో బుద్ధ విగ్రహం బయటపడింది. గ్రామంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం తవ్వకాలు జరుపగా, సప్త మాత్రుకలు బయట పడడంతో అధికారులకు సమాచారం అందించారు. మూడు రోజుల క్రితం గ్రామాన్ని సందర్శించిన అధికారులు అక్కడ సుమారు పది ఎకరాల భూమిని సేకరించి తవ్వకాలు జరిపేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



– కుంటాల గంగాధర్ (మనతెలంగాణ ప్రతినిధి)
9492789248

రుణాల ఎగవేత నిరోధానికి ఇదిగో కఠిన చర్య!

న్యూఢిల్లీ : బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతున్న సంఘటనలు పెరుగుతుండటంతో కేంద్ర ఆర్థిక శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. అలాంటి వారిని కట్టడి చేసేందుకు ఉపక్రమించింది. శనివారం ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రటరీ రాజీవ్ కుమార్ ఓ ట్వీట్‌లో నిజాయితీగల, బాధ్యతాయుతమైన బ్యాంకింగ్ కోసం తదుపరి చర్య తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రూ.50 కోట్లకు పైబడి రుణాలు తీసుకునేవారు తమ పాస్‌పోర్టు వివరాలను తప్పనిసరిగా సమర్పించాలన్నారు. మోసం జరిగినట్లయితే సత్వరం స్పందించేందుకు ఈ వివరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఆర్థిక నేరగాళ్ళు విదేశాలకు పారిపోవడాన్ని నిరోధించేందుకు ఈ చర్య దోహద పడుతుందన్నారు. రూ.50 కోట్లకు పైబడి రుణాలను తీసుకునే కొత్త రుణగ్రహీతల పాస్‌పోర్టు వివరాలను బ్యాంకులు సేకరిస్తాయన్నారు. ప్రస్తుత రుణగ్రహీతల పాస్‌పోర్టుల వివరాలను 45 రోజుల్లోగా సేకరించాలని బ్యాంకులను కోరినట్లు తెలిపారు.



పాత కౌన్సిల్ భవనంలోనే సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

శాసనసభ భవనంలో శాసనసభ సమావేశాలను, జూబ్లీహాల్‌లో శాసనమండలి సమావేశాలను నిర్వహించుకుంటూ ఉంది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి శాసనసభల ప్రాంగణంలోని అన్ని భవనాలనూ తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించినట్లు తెలిసింది. సోమవారం నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇంతకాలం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాడిన పాత శాసనమండలి హాల్‌లోనే మన శాసనమండలి సమావేశాలు కూడా జరిగేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అదే భవనంలో ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ ఛాంబర్లతో పాటు ముఖ్యమంత్రి ఛాంబర్ కూడా సిద్ధమవుతోంది. ఇప్పటివరకూ తెలంగాణ ప్రభుత్వం శాసనమండలి సమావేశాలు నిర్వహించిన జూబిలీహాల్‌ను ఇకపైన యధావిధిగా కలెక్టర్ల సమావేశాలకు, ప్రభుత్వ సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా మార్చే పనులు జరుగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లిఖితపూర్వకంగా భవనాలను అప్పగిస్తూ లేఖ రాసినట్లు తెలిసింది. కానీ తెలంగాణ శాసన వ్యవహారాల విభాగం అధికారులు మాత్రం ప్రస్తుతానికి పాత శాసనమండలి భవనాన్ని మాత్రమే మన శాసనమండలి సమావేశాల అవసరం కోసం వినియోగించుకుంటున్నామని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగిలిన భవనాలను వినియోగించుకోవడంపై త్వరలో స్పష్టత వస్తుందని వ్యాఖ్యానించాయి. భవనాల విభజనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు పాత శాసనమండలి భవనాన్ని, పాత శాసనసభ భవనాలను కేటాయించిన తర్వాత కేవలం రెండు సమావేశాలను మాత్రమే నిర్వహించింది. ఆ తర్వాత నిర్వహించకపోయినా ఆ భవనాలను మాత్రం తన అధీనంలోనే ఉంచుకుంది. వృథాగా ఉన్న భవనాన్ని తమ అవసరాలకు వాడుకునేలా అప్పగించాలని తెలంగాణ చేసిన విజ్ఞప్తితో అప్పగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

మేమే నెంబర్1

(మొదటిపేజీ తరువాయి)

అందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆదర్శవంతంగా ఉందని మంత్రి తెలిపారు. గుజరాత్‌లో కూడా సాధ్యం కాని విధంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్ర ప్రగతి భేషుగ్గా ఉందని మంత్రి వివరించారు. 3,300 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తితో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్‌గా ఉందని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో 5500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి టార్గెట్ ను సాధించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వివరించారు. దేశంలోని నదుల్లో 75వేల టిఎంసిల నీటి లభ్యత ఉంటే, ప్రతి సంవత్సరం వేలాది టిఎంసిల నీళ్ళు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలు ఆత్మగౌరవంతో బతకాలన్న రాష్ట్ర సిఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ పథకాన్ని ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి ఇంటికి మంచి నీరు అందించేలా మిషన్ భగీరథ, చెరువుల ఉద్ధరణకు మిషన్ కాకతీయ చేపట్టామని తెలిపారు. దేశంలో సమ్మిళిత అభివృద్ధిలో ముందు వరుసలో నిలిచిన తెలంగాణ రాష్ట్రాన్ని స్కోచ్ సంస్థ గుర్తించిందని మంత్రి తెలిపారు. అనంతరం ఇండియా ఫ్రాన్స్ దేశాల మధ్య జరిగిన భాగస్వామ్య ఒప్పందాల సమావేశంలో రాష్ట్ర ఐటి, మునిసిపల్ శాఖ మంత్రి కెటిఆర్ పాల్గొన్నారు. ఇండో – ఫ్రెంచ్ ఎకనామిక్ పార్టనర్ షిప్ సైనింగ్ కార్యక్రమంలో సాఫ్రన్ ఏయిర్ స్పెస్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం మధ్య భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నది. కేంద్ర మంత్రులు సురేష్ ప్రభు, ఆర్ కె సింగ్, ఫ్రాన్స్‌ప్రతినిధులు, కెటిఆర్ ఆధ్వర్యంలో సాఫ్రాన్ సంస్థ సిఇఒ, తెలంగాణ రాష్ట్ర ఐటి కార్యదర్శి జయేశ్ రంజన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. విమానాల్లో ఎలక్ట్రికల్ విభాగాలు తయారు చేయనున్న సాఫ్రాన్ సంస్థ ఇకపై హైదరాబాద్ వేదికగా పరికరాలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.శంషాబాద్ ఏయిర్ పోర్ట్ సమీపంలోని పారిశ్రామిక ఏరియాలో ఈ పరిశ్రమను స్థాపించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ పరిశ్రమ స్థాపనతో వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు రానున్నట్లు మంత్రి తెలిపారు.

బాలికలకు హెల్త్‌కిట్?

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల కోసం 'హెల్త్ కిట్‌ను ప్రవేశపెట్టే ఆలోచన ఉన్నట్లు సమాచారం. దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయల మేర బడ్జెట్ ఉండవచ్చని ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో ఆర్థికశాఖ వర్గాలు మాత్రం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మనం సాధించిన వృద్ధిరేటుకు అనుగుణంగానే ఉంటుందని సూచనప్రాయంగా తెలిపారు. గతంలో 'వ్యాట్' పేరుతో పన్నులు మన పరిధిలోనే ఉండేవని, మన అవసరాలకు అనుగుణంగా మార్చుకునే వెసులుబాటు ఉండేదని, కానీ గతేడాది జూలై నుంచి జిఎస్టి అమలులోకి రావడంతో కేవలం కొన్ని వస్తువులపై అమ్మకపు పన్ను, పెట్రోలియం ఉత్పత్తులు, మద్యం విక్రయాలు మాత్రమే మన పరిధిలో ఉన్నాయని, అందువల్ల బడ్జెట్ అంచనాలు పెరిగినట్లయితే ఆర్థిక వనరులను సమకూర్చుకోవడంలో ఇబ్బందులు ఉంటాయని, అందువల్ల ఏకంగా రెండు లక్షల కోట్ల రూపాయల మేరకు పెరిగే అవకాశం లేదని వ్యాఖ్యానించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాలకు ప్రస్తుతం ఇస్తున్న రూ. 75,000 ఆర్థిక సాయం రూ. 1,00,116కు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీనికి తోడు ఆసరా పింఛన్లను కూడా కనీసంగా రూ. 500 మేరకు పెంచే అవకాశాలు లేకపోలేదని తెలిపారు. నిరుద్యోగ భృతి ఇచ్చే అంశంపై కసరత్తు చేసినప్పటికీ ఈ బడ్జెట్‌లో చోటుచేసుకునే అవకాశాలు తక్కువేనని తెలిసింది. సంక్షేమ బడ్జెట్‌గా ఉంటుందని స్వయంగా ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించినందున ఈసారి మహిళలకు, రైతులకు, బిసి వర్గాలకు సంతృప్తి కలిగించే తీరులో ఉండే అవకాశం ఉంది. ఎన్నికలకు వెళ్తున్న సమయంలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కాబట్టి సహజంగా వివిధ సెక్షన్ల ప్రజలను ఆకర్షించే విధంగా ఉండవచ్చని అధికార పార్టీ వర్గాలు వ్యాఖ్యానించాయి. ఈ ఏడాది డిసెంబరుకల్లా కాళేశ్వరం ప్రాజెక్టు తొలి దశను పూర్తిచేసి లక్ష్యానికి అనుగుణంగా సాగునీటిని అందించాలని భావిస్తున్న ప్రభుత్వం ఆర్థిక వనరులను సమకూర్చుకోవడంపైనా దృష్టి పెట్టింది. అందులో భాగంగానే మిగులు బడ్జెట్‌గా రూపొందించి రానున్న ఆర్థిక సంవత్సరానికి నిబంధనలకు అనుగుణంగా వచ్చే 3.5% ఎఫ్ఆర్‌బిఎమ్ (ఫిస్కర్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) కింద వచ్చే సుమారు రూ. 28,000 కోట్లను తొలి త్రైమాసికంలోనే పొంది దానిని రైతు లక్ష్మి పథకంతో పాటు సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేయాలని భావిస్తున్నట్లు ఆర్థికశాఖ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు కొన్ని సాగునీటి ప్రాజెక్టులకు ప్రత్యేకంగా 'కార్పొరేషన్'ను ఏర్పాటు చేసి దాని ద్వారా కూడా రుణం రూపంలో ఆర్థిక వనరులను సమీకరించుకునే అవకాశాలపై ఆర్థికశాఖ వర్గాలు దృష్టి సారించాయి. మరోవైపు రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ ద్వారా కూడా రుణం రూపంలో వివిధ ద్రవ్య సంస్థల నుంచి ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలని భావిస్తోంది. పన్నుల రూపేణా ఆదాయ వనరులు తగ్గిపోతుండడంతో ఇలాంటి ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వం ఆధారపడుతోంది.

రేపటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

15న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్



మన తెలంగాణ / హైదరాబాద్ : శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉభయ సభలను ఉద్దేశించి సోమవారం గవర్నర్ ప్రసంగించనున్నారు. ఆ తర్వాత రెండు రోజుల పాటు ఆ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈ నెల 15వ తేదీన ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ 2018–19 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాలు ఒకింత వేడిగా జరిగే అవకాశాలున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగే పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు కావడంతో ఈ సమావేశాలను అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నా యి. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి కాంగ్రెస్, విపక్షా లు సిద్ధమవుతుంతగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు ఫలితాలను ప్రస్తావించి విమర్శలను తిప్పికొట్టడానికి అధికార టిఆర్‌ఎస్ సమాయత్తమవుతోంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు, దళితులకు భూ పంపిణీ, మైనార్టీలకు రిజర్వేషన్లు, కెజి టు పిజి ఉచిత విద్య,నేరేళ్లలో దళితులపై దాడి, నల్లగొండలో కాంగ్రెస్ నేత శ్రీనివాస్ హత్య తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రభుత్వంపై దూకుడుగానే పోవాలని కాంగ్రెస్ ఆలోచిస్తోంది. వడ్డీ మా ఫీ జరగని రైతుల జాబితా స్పీకర్‌కు సమర్పిస్తే న్యాయం చేస్తామని ప్రభుత్వం గత సమావేశాల సందర్భంగా వ్యా ఖ్యానించినా ఆ జాబితాను సమర్పించి నెలలు గడిచినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనలేదనే అంశాన్ని ఈ సమావేశాల్లో ఎత్తిచూపాలని కాంగ్రెస్, టిడిపి పక్షాలు భావిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు కోసం రాష్ట్రానికి చేసిన నిధుల కేటాయింపు, చేసిన ఖర్చులను ప్రత్యేకంగా ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీయాలని బిజెపి ఆలోచిస్తూ ఉంది. అధికార టిఆర్‌ఎస్ సైతం విపక్షాలను అదే స్థాయిలో ఎదుర్కొనేందుకు సన్నద్ధమౌతోంది.2009 ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేకపోయినా టిఆర్‌ఎస్ మాత్రం 90 శాతం హామీలను అమలు చేశామని చెప్పేందుకు కసరత్తు చేస్తోంది.

24 గంటల విద్యుత్ సరఫరాను అమలు, కెజి టు పిజీ పథకంలో భాగంగా గురుకుల విద్యాసంస్థల ఏర్పాటు, ఇంటింటికి తాగునీరిచ్చే మిషన్ భగీరథ, ఉత్తర తెలంగాణాకు జీవనరేఖ అయిన కాళేశ్వరంను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తుండడం తదితరాలను ఈ సమావేశాల ద్వారా ప్రజల్లోకి తీసుకుపోయి కాంగ్రెస్ విమర్శలను ఘాటుగా సమాధానం ఇవ్వాలని టిఆర్‌ఎస్ భావిస్తోంది. పాలమూరు –రంగారెడ్డి పూర్తితో తెలంగాణ రూపురేఖలు మారుతాయని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇతర దేశాలవారు చూసిపోతుండగాఇక్కడి ప్రతిపక్షాలు మా త్రం విమర్శలు చేస్తున్న అంశాలను ప్రస్తావిస్తామని టిఆర్‌ఎస్ నాయకులు వ్యాఖ్యానించారు.

సమగ్రాభివృద్ధితోనే సామాజిక న్యాయం

జాతీయ చట్టసభల సభ్యుల సదస్సులో ప్రధాని మోడీ



మన తెలంగాణ/ న్యూఢిల్లీ: దేశంలో మంచి మార్పు తేవడానికి ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. శనివారం పార్లమెట్ లోని సెంట్రల్ హాల్ లో జరిగిన జాతీయ చట్ట సభల సభ్యుల సదస్సులో ఆయన సాంఘిక న్యాయం గురించి మాట్లాడారు. మన దేశంలో మానవ వనరులు, నైపుణ్యం, వనరులు ఉన్నాయన్నారు. ఇప్పుడు చేయవలసినది వీటన్నిటినీ ఉపయోగించుకుని ఉద్యమ స్ఫూర్తితో మంచి మార్పు కోసం పని చేయడమేనన్నారు. ''అభివృద్ధి కోసం మనం'' శీర్షికతో ఈ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహజన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సామాజిక న్యాయంపై విస్తృత చర్చలు జరుగుతున్నాయని ప్రధాని అన్నారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందినపుడే సామాజిక న్యాయం సాధ్యం అవుతుందన్నారు. కొన్ని జిల్లాలు అభివృద్ధి చెందాయాని, మరికొన్ని జిల్లాలు వెనకబడి ఉన్నాయని మోడీ చెప్పారు. పిల్లలంతా బడులకు వెళ్ళినపుడు, అన్ని కుటుంబాలకు విద్యుత్తు సదుపాయం అందినపుడు సాంఘిక న్యాయం దిశగా ఓ అడుగు పడినట్లు భావించవచ్చునన్నారు. అభివృద్ధి జరగకపోవడానికి కారణం బడ్జెట్, వనరులు లేకపోవడం కాదన్నారు. సుపరిపాలన లేకపోవడం వల్లే అభివృద్ధి జరగడం లేదన్నారు. సుపరిపాలన, పథకాల సమర్థ అమలు, శ్రద్ధతో కార్యకలాపాలను నిర్వహించడం వంటివాటి వల్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. 'సాధారణంగా ఒక విద్యార్థి ఒక విషయంలో బాగా రాణించినా మరో విషయంలో వెనుకబడిపోవచ్చు. అలాగే రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలు కూడా ఒకేలా ఉండవు. కొన్ని అభివృద్ధి చెంది ఉంటాయి. మరికొన్ని వెనుకబడిపోయి ఉంటాయి. వెనుకబడిన జిల్లాలు తమ లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. దేశంలో అభివృద్ధి చెందిన జిల్లాలతో పోలిస్తే మనం ఎక్కడున్నామో గమనించాలి. తదనుగుణంగా ప్రణాళిక రచించుకోవాలి. ఇందులో జిల్లా కలెక్టర్ల పాత్ర కీలకం. కలెక్టర్లు ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలతో పోల్చుకోవాలి. అక్కడ అనుసరిస్తున్న విధానాలను పరిశీలించాలి. ఇందుకు కలెక్టర్లకు నాయకులు, ప్రజల భాగస్వామ్యం అవసరం. పనితీరు ఆధారంగానే కలెక్టర్ల బదిలీలు ఉంటాయి' అని మోడీ అన్నారు.ఇక జిల్లాలో అందరు బాలబాలికలకు విద్య అందించి.. అన్ని గ్రామాలకు విద్యుత్ ఇవ్వగలిగినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఒక గ్రామానికి విద్యుత్ ఉండి మరో గ్రామానికి లేకపోతే అది సామాజిక న్యాయం కాదన్నారు. దీనిపై అన్ని రాష్ట్రాలు చర్చలు జరపాలని ప్రధాని మోడీ సూచించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుండి ఎంపిలు కవిత, కొత్త పల్లి గీతలు సంధాన కర్తలుగా వ్యవహరించి పలు అంశాలపై జరిగిన సదస్సులను నిర్వహించారు. ఈ సమావేశం గురించి ఎంపి కవిత మాట్లాడుతూ..... శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు ఈ సమావేశాలు జరగనున్నాయని తెలిపారు. దేశంలోని పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు అందరూ కలసి పనిచేసినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్న ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశారని వెల్లడించారు. దేశం వ్యాప్తంగా అన్ని అంశాలపై సమగ్ర సమాచారాన్ని నీతిఆమోగ్ ద్వారా శాసన సభ్యులకు, పార్లమెంట్ సభ్యులకు అందజేశారని అన్నారు. దేశంలో కొన్ని జిల్లాలు కొన్ని అంశాలలో ఇతర ప్రాంతాల కంటే అభివృద్ధి లో వెనుకబడి ఉంటాయి, కొన్ని అభివృద్ధిలో ముందుంటాయి, కాబట్టి అన్ని ప్రాంతాలు సమతుల్యమైన అభివృద్ధిని సాధించేందుకు గాను ఎటువంటి కృషి చేయాలనే విషయంపై ఈ సమావేశాన్ని నిర్వహించారని తెలిపారు. ఈ సమావేశం దేశాభివృద్ధికి చాలా ఉపయోగకం అని ఎంపి కవిత అన్నారు. భారతదేశం లాంటి పెద్ద దేశంలో వనరులను సమగ్రంగా ఏవిధంగా వినియోగించుకోవాలనే దానిపై చాలా మంది తమ సలహాలు, సూచనలు ఇచ్చారని, శనివారం మధ్యాహ్నం ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో అభివృద్ధి ఎలా జరుగుతుందనే విషయంపై ఆయా రాష్ట్రాల నుండి చాలా మంది శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు పలు సూచనలు ఇచ్చారని వెల్లడించారు. అనంతరం అరకు ఎంపి కొత్తపల్లి గీత మాట్లాడుతూ భారత దేశం లాంటి సమాఖ్య వ్యవస్థ లో దేశాభివృద్ధిలో శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులకు సమానమైన పాత్ర ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, పాలసీలపైన అందరికీ అవగాహన ఉండాలనే ఉద్దేశంతో లోక్ సభ స్పీకర్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారని ఎంపి కొత్తపల్లి గీత తెలిపారు. ఈ సదస్సుకు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, కేంద్ర మంత్రులు, సిఎంలు పాల్గొన్నారు.

కారుణ్య ఉత్తర్వులు

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత ప్రస్తుతం ఉన్న చట్టానికి సవరణలు చేస్తూ 'ప్రోస్పెక్టివ్' పద్ధతిలో కారుణ్య నియామకం కల్పించేలా ఈ సర్క్యులర్‌ను జారీ చేసినట్లు సింగరేణి సంస్థ డైరెక్టర్ పేర్కొన్నారు. నిబంధనల మేరకు ఇకపైన పనిచేయడానికి వైద్యపరంగా వీలుకాని కార్మికుల వారసులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.చట్టబద్ధంగా దత్తత తీసుకున్న పిల్లలకూ ఇది వర్తిస్తుందని, ఆ కార్మికుల కుటుంబంలో వారసురాలిగా ఉన్న మహిళకు, విభిన్న ప్రతిభావంతుల పనిచేసే శారీరక సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కారుణ్య నియామకం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఒకవేళ పిల్లలు లేనట్లయితే కార్మికుడి భార్యకు లేదా అవివాహిత కుమార్తెకు లేదా అవివాహిత కుమారుడికి లేదా చట్టబద్ధంగా దత్తత తీసుకున్న పిల్లలకు ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఒకవేళ ఆ కార్మికుడికి పై తరహాలో ఉద్యోగం పొందగలిగే వారసులు లేనట్లయితే సోదరుడు లేదా వితంతువుగా ఉన్న కుమార్తె, వితంతువుగా ఉన్న కోడలు లేదా అల్లుడు ప్రస్తుతం ఆ కార్మికులతోనే ఉంటున్నట్లయితే లేదా ఆ కార్మికుడి ఆర్థిక వనరుల మీద ఆధారపడి ఉంటున్నట్లయితే వారికి కూడా కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గనుల లోపల పనిచేసే 'బదిలీ' కార్మికులకు సంబంధించి కారుణ్య నియామాక ఉద్యోగం పురుషులకు మాత్రమేనని, గనుల పైభాగం (ఉపరితలం)లో పనిచేసే కార్మికులకు సంబంధించిన కారుణ్య నియామకాలు మాత్రం మహిళా వారసులకు, విభిన్న ప్రతిభావంతులకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఒకవేళ ఇప్పటికే ఇలాంటి వారసత్వ ఉద్యోగాలకు మార్గదర్శకాలను జారీ చేసినట్లయితే అవి పైన పేర్కొన్న మార్పులకు అనుగుణంగా వర్తింపజేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సింగరేణి కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల సందర్భంగా టిఆర్‌ఎస్ అనుబంధ కార్మిక విభాగం హామీ ఇవ్వడంతో పాటు ఇటీవలసిఎం కెసిఆర్ పర్యటన సందర్భంగా కూడా కారుణ్య నియామకాల (వారసత్వ) గురించి హామీ ఇచ్చారు.ఆ హామీకి అనుగుణంగా ఇప్పుడు సింగరేణి సంస్థ సర్క్యులర్ జారీ చేయడం గమనార్హం.

ప్రేమజంట ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

ఉంటూ కొత్త లారీని కొనుగోలు చేసి పనులు చేయిస్తున్నాడు. వారి ఇంటికి ఎదురుగానే బొంత శంకరయ్య కుటుంబం ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ప్లాంట్ నిర్వహణకు అయిలయ్య బోరును వినియోగిస్తున్నాడు. దసరా పండుగకు కొద్ది రోజుల ముందు గణేష్, పూజితల ప్రేమ వ్యవహారం కుటుంబ సభ్యులకు తెలిసింది. కులాలు వేరు కావడం ఇద్దరు మైనర్లు కావడంతో ఇరువురి కుటుంబ సభ్యులు మందలించారు. ఒకరి వద్దకు మరొకరు వెళ్ళకూడదని హెచ్చరించారు. ఈ నెల 9 న పూజిత పాఠశాలకు వెళ్తానని చెప్పి ఇంటి నుండి బయలుదేరగా గణేష్ లారీ వద్దకు వెళ్తానని తల్లికి చెప్పి బయటకు వెళ్ళాడు. పూజిత పాఠశాలకు వెళ్ళలేదని తెలుసుకున్న తల్లి లక్ష్మీ ఆమె కోసం వెతికింది. బంధువులు స్నేహితుల ఇండ్లల్లో వెతికినా ఆచూకి లభించక పోవడంతో నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో తన కూతురిని కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేశారు. విషయాన్ని గణేష్ తల్లి ధనమ్మ తన భర్తకు తెలియజేసింది. వారి ఆచూకీ కోసం ఇరువురి కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. చిట్యాల మండలం వట్టిమర్తి శివారులోని సాయిబాబ గుడి సమీపంలో ఉన్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన ఇద్దరు అక్కడే తమ వెంట ఉన్న బ్యాగును, ద్విచక్రవాహనాన్ని వదిలివెళ్ళారు.తమ కోసం ఇరువురి కుటుంబ సభ్యులు వెతుకుతున్నారని తెలుసుకున్న పూజిత గణేష్‌లు రామన్నపేట మండలానికి చేరుకున్నారు. జేపీ గార్డెన్ ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్ మీద శుక్రవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు.ఉదయం 6.`10 నిమిషాలకు సికింద్రాబాద్ నుండి విజయవాడ వెళ్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్ గార్డ్ స్థానిక స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించాడు.విషయం చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలకు పాకింది. పూజిత, గణేష్‌ల కోసం వెతుకుతున్న బంధువులకు సమాచారం తెలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను గుర్తించారు. స్థానిక ఎస్.ఐ బి.నాగన్న సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.స్టేషన్ మాస్టర్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వేశాఖ ఎస్ఐ అచ్యుతం తెలిపారు.స్థానిక ఏరియా ఆసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ విఫలం



బోసిపోయిన ట్యాంక్‌బండ్

(మొదటి పేజీ తరువాయి)

బలగాలను మోహరించారు. నగరానికి వచ్చే అన్ని ఆర్‌టిసి, ప్రైవేటు వాహనాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకునేందుకు ప్రయత్నించిన తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డిలతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దశలవారీగా అరెస్టుల పర్వం కొనసాగింది. తెలంగాణ జెఎసి, సిపిఐ, న్యూ డెమొక్రసీ, 'తెలంగాణ ఇంటి పార్టీ', వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై శనివారం జరపతలపెట్టిన మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఎలాగైనా జరిపేందుకు నేతలు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. ట్యాంక్‌బండ్‌తో పాటు రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో 40 వేల మంది పోలీసులను మోహరించారు. సభకు తరలివస్తున్న వేలాది మంది నేతలు, కార్యకర్తలను పోలీసులు ఎక్కడిక్కక్కడే నిర్బంధించి అరెస్టుచేశారు. హైదరాబాద్‌కు దారితీసే రోడ్లపై వందలాది పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. పోలీసుల నిర్బంధకాండకు నిరసనగా అనేక ప్రాంతాలలో సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మలను దగ్ధం చేయగా, మరికొన్ని ప్రాంతాలలో రాస్తారోకో, ధర్నాలకు బైఠాయించడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. జెఎసి ఛైర్మన్ కోదండరామ్‌ను తార్నాకలో ఆయన నివాసం దగ్గరే అరెస్టు చేసి బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ట్యాంక్‌బండ్‌కు బయలేదేరిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెకంటరెడ్డిని హిమాయత్‌నగర్‌లోని మఖ్దూంభవన్ వద్దనే అడ్డుకుని అరెస్టు చేశారు. టియుఎఫ్ నేత విమలక్కను చిక్కడపల్లిలో అరెస్టు చేశారు. ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకున్న మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్కడి నుంచి ఆయనను మరో ప్రాంతానికి తరలించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 వేల మందిని అరెస్టు చేశారు. వీరిలో 90 శాతం మందిని సాయంత్రం ఆరు గంటల తరువాత వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు.

కోదండరామ్ నివాసం వద్ద కర్ఫ్యూ వాతావరణం : తార్నాకలోని కోదండరామ్ నివాసానికి వెళ్లే ప్రాంతాల్లో పోలీసులు ఆంక్షలు విధించారు. ఉదయం ఆరు గంటల నుంచే వందలాది మంది పోలీసులు ఆయన నివాసంతో పాటు సమీప ప్రాంతాలను దిగ్బంధం చేసి బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాలలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారిని అనుమతించలేదు. దీంతో ఆ ప్రాంతం కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించింది. కోదండరామ్‌ను కలిసిఏందుకు వచ్చిన వారిని కూడా అరెస్టు చేశారు.

ఇది ప్రజాస్వామ్యమా... నిరంకుశత్వమా ? : కోదండరామ్

సిఎం కెసిఆర్‌కు ఢిల్లీలో ధర్నా చేసేందుకు స్వేచ్ఛ ఉండొచ్చు కాని, తమకు మాత్రం రాష్ట్రంలో ధర్నా, నిరసనలు తెలిపే హక్కు ఉండకూడదా అని తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ ప్రశ్నించారు. ప్రశ్నించేవారి పట్ల ప్రభుత్వం నిరంకుశ వైఖరిని అవలంబిస్తోందన్నారు. ప్రస్తుత పాలనలో తెలంగాణ ఉద్యమాన్ని గుర్తుచేసుకోవడమే నేరమైందన్నారు. తార్నాక వద్ద కోదండరామ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందని, ఏ కార్యక్రమం చేపట్టినా అడుగడుగునా ఆటంకాలు, నిర్భందాలు, అరెస్టులు కొనసాగుతున్నాయని, ప్రజాస్వామ్య భారతదేశంలోనే ఉన్నామా అనే అనుమానాలు కలుగుతున్నాయని వ్యాఖ్యానించారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ నిర్వహించడం వల్ల అధికార పీఠాలు కదులుతాయా? లేక భూమి బద్దలవుతుందా అని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో మనుషులను మాత్రమే అరెస్టు చేశారని, తెలంగాణ రాష్ట్రంలో మనుషులతో పాటు గృహాలను కూడా ముందస్తు అరెస్టులు చేయడం కొత్తగా చూస్తున్నామని వ్యాఖ్యానించారు. పోరాటం ద్వారా సాధించిన తెలంగాణలో ఇన్ని నిర్భందాలు ఉంటాయని తాము ఊహించలేదన్నారు.

నైతిక విజయం : చాడ

టిఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసినా మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమం నైతికంగా విజయం సాధించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ కార్యాలయం మఖ్దుంభవన్ నుంచి మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం మధ్యాహ్నం ట్యాంక్‌బండ్‌కు బయలుదేరిన చాడ వెంకటరెడ్డితోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు సుమారు వంద మందిని పోలీసులు అరెస్టు చేసి బేగంబజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్, కార్యవర్గసభ్యులు ఇ.టి.నరసింహా, డాక్టర్ డి.సుధాకర్, మంద పవన్, పుస్తకాల నరసింగ్‌రావు, ప్రజా సంఘాల నాయకులు కె.శివరామకృష్ణ (ఎఐఎస్‌ఎఫ్), ఎం.అనిల్ కుమార్ (ఎఐవైఎఫ్), పోటు కళావతి ఉన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో సిఎం కెసిఆర్ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా నియంతృత్వ పాలన సాగిస్తున్నారన్నారు.



మోడీ, రాహుల్‌కు లేఖ రాసిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీలకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. కలిసి మాట్లాడడానికి సమయం ఇవ్వాలని కోరుతూ ఆయన వారికి లేఖలు పంపించారు. నగరంలో కమర్షియల్ కాంప్లెక్స్‌లను సీజ్ చేయడానికి కారణమైన చట్టంలో మార్పులు చేయాలని కేజ్రీవాల్ మోడీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. దుకాణాలు మూసేయడం వల్ల చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారని, ఇది శాంతి భద్రతలకు కూడా సమస్యగా మారుతుందని తెలిపారు. మార్చి 31లోగా దుకాణాల సీజ్‌ను నిలిపేయక పోతే తాను నిరాహార దీక్షకు దిగుతానని నిన్న కేజ్రీవాల్ హెచ్చరించారు. వ్యాపారులు నిజాయితీగా వ్యాపారం చేసుకుని, పన్నులు కడుతున్నారని; ఒక్కో దుకాణం కొందరికి జీవనాధారం కల్పిస్తోందని కేజ్రీవాల్ తెలిపారు. వారంతా నిరుద్యోగులు అయ్యారని వెల్లడించారు. దుకాణాలు సీజ్ చెయ్యకుండా పార్లమెంటులో వెంటనే బిల్లు ప్రవేశపెట్టాలని ఆయన మోడీని కోరారు. దీనిపై మాట్లాడడానికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని అడిగారు. ఈ విషయంపై పార్లమెంటులో బలమైన వాదన వినిపించాలని, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ రాహుల్‌కు కూడా కేజ్రీవాల్ లేఖ రాశారు. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ మార్గదర్శకాల మేరకు గత ఏడాది డిసెంబరు నుంచి మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దుకాణాలను సీజ్ చేస్తున్నారు.

మంచినీళ్లు మహాప్రభో!

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు
- 25 రోజులుగా నీళ్లురాక అవస్థలు





మన తెలంగాణ/ మోత్కూరు : మంచి నీటి కోసం మహిళలు, కాలనీ వాసులు రోడ్డెక్కి ఆందోళన నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని డాబంగ్లా కాలనీ వాసులు తమకు గత 15రోజులుగా నీళ్ళు రావడం లేదని శనివారం మోత్కూరు తిర్మలగిరి ప్రధాన రహదారిపై మండల పరిషత్ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. తమ కాలనీకి గత 25 రోజులుగా గ్రామ పంచాయతీ నల్లా నీళ్లు రాడం లేదని ఎన్నిసార్లు గ్రామ పంచాయతీ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపించారు. గ్రామ పంచాయతీ అధికారులు వచ్చి తమ సమస్య పరిష్కరించే వరకూ ఆందోళన విరమించేది లేదని కాలనీ వాసులు ,మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. నూతనంగా నిర్మిస్తున్న మండల పరిషత కార్యాలయం నిర్మాణ పనుల కు గ్రామ పంచాయతీ నల్లానీటినే వాడుతున్నారని దీంతో కాలనీ వాసులకు సరిగ్గా నీటి సరఫరా జరగడం లేదని కాలనీ వాసులు ఆరోపించారు. కాలనీ వాసులు సుమారు గంట పాటు రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫీక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో స్థానిక ఏఎస్ఐ కె,మోహన్ అక్కడకు చేరుకొని కాలనీ వాసులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, సర్పంచ్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించు కోవాలని, రోడ్డుపై బైఠాయించి ప్రయాణీకులకు, ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని తెలిపి రాస్తారోకోను విరమింపజేసారు. రాస్తారోకోలో డాబంగ్లా కాలనీ వాసులు దేవరపెల్లి లోక్మ, ఖాజమ్మ, నస్రీన్, పర్వీన్, పురగుల సాయమ్మ, నల్లమధు, కడమంచి రాములు తదితరులు పాల్గొన్నారు.

చంటిబిడ్డ సహా తల్లి ఆత్మహత్య



మన తెలంగాణ/ వికారాబాద్ రూరల్ (వికారాబాద్ జిల్లా) : వికారాబాద్ మండలంలోని అత్వెల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయని వికారాబాద్ వలయాధికారి వెంకటరామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతురాలు వరాలు(23), 10 నెలల బాబుతో మంచి నీటి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని ఆయన పేర్కొన్నారు. మృతురాలి ఆత్మహత్యకు ప్రధాన కారణం భర్త వేధింపులేనని ఆమె బంధువులు ఆరోపించినారని ఆయన అన్నారు. ఎక్‌మామిడి గ్రామానికి చెందిన వరాలును అత్వెల్లి గ్రామానికి అశోక్‌తో గత 3 సంవత్సరాల క్రితం వివాహం అయ్యిందని ఆయన తెలిపారు. శుక్రవారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో పక్కనే ఉన్న మంచి నీటి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని, మంచి నీళ్ళకు వెళ్ళిన మహిళలు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని బావిలో ఉన్న శవాలను బయటికి తీసి స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది విద్యార్థుల డిబార్

మన తెలంగాణ/ సిద్దిపేట అర్బన్ : సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలో తొమ్మిది మంది విద్యార్థులను అధికారులు డీబార్ చేశారు. నంగునూరు, హుస్నాబాద్ మోడల్ స్కూల్, గజ్వేల్ జిఎంఆర్ స్కూల్ కేంద్రాల్లో ఒకొక్కరి చొప్పున, చేర్యాలలోని టిఎస్‌డబ్ల్యుఆర్ పరీక్షా కేంద్రంలో ఆరుగురు విద్యార్థులను డిబార్ చేశారు. నంగునూరులో డిఐఇవొ కె.నర్సింలు, హుస్నాబాద్‌లో పి.వెంకటరెడ్డి, గజ్వేల్లో అరుణకుమారి, చేర్యాలలో ఇంటర్మీయట్ అధికారులు పరీక్షలను కేంద్రాలలో తనిఖీలు చేసి తగ్గరుండి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

మరో ప్రాంతంలో నలుగురు..

రంగారెడ్డి: ఇంటర్ పరీక్షలలో మాల్ ప్రాక్టీస్ చేస్తున్న నలుగురు విద్యార్థులను పట్టుకుని డీబార్ చేశారు. శనివారం నిర్వహించిన ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్ 1 పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 61,253 మంది విద్యార్థులు హాజరుకావలసి ఉండగా 59,239 మంది విద్యార్థులు హాజరు కాగా 2014 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. జిల్లాలోని అమన్‌గల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టిస్ చేస్తు పట్టుబడగా , ఆమన్‌గల్లులోని కెఆర్‌డిఆర్ కో ఆపరేటివ్ జూనియర్ కళాశాలలో మరో ఇద్దరు విద్యార్థులు పట్టుబడ్డారు.

కల్తీకల్లు తాగిన 11 మందికి అస్వస్థత

మన తెలంగాణ/ శంషాబాద్: శంషాబాద్ మండల పరిధిలోని జూకల్ గ్రామంలో కల్తీ కల్లు సేవించి 10 మంది పెద్దలతో పాటు చిన్నారికి అస్వస్థత గురైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పాలమాకుల, పిల్లోనిగూడ, జూకల్ గ్రామాలకు చెందిన 11 మంది జూకల్ నుంచి పాలమాకుల వెళ్లె దారిలో నల్లచెరువు వద్ద తాటికల్లు తాగి అస్వస్థతకు గురైయ్యారు. వాంతులు కావడంతో వారిని శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. పాలమాకుల వార్డు సభ్యుడు క్రిష్ణ సైతం కల్లు తాగి ఆస్వస్థతకు గురి అయ్యారు. క్రిష్ణ ఫిర్యాదు మేరకు శంషాబాద్ రూరల్ సిఐ క్రిష్ణ ప్రసాద్ కల్తీ కల్లు విక్రయించిన లింగం గౌడ్‌పై కేసు నమోదు చేశారు. శంషాబాద్ ఎక్సైజ్ అధికారులు సైతం ఘటన స్థలాన్ని సందర్శించి విచారణ నిర్వహిస్తున్నారు.

ఎస్‌పిది ఔరంగజేబు పాలన



లక్నో: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ సమాజ్‌వాదీ పార్టీని పరోక్షంగా విమర్శించారు. యుపిలో గతంలో అధికారంలో ఉన్న సమాజ్‌వాదీ పార్టీని మొగలుల పాలనతో పోల్చారు. రాష్ట్రంలో ప్రజలు ఔరంగజేబు పాలనను కోరుకోవట్లేదని ఆయన పేర్కొన్నారు. తమకు మంచి ప్రభుత్వం, అభివృద్ధి కావాలని ప్రజలు నిర్ణయించుకున్నారని యోగి వెల్లడించారు. ఇతర పార్టీల మాదిరిగా భాజపా బయట నుంచి వ్యక్తులను తీసుకొచ్చి పోటీ చేయించట్లేదని, తమ కార్యకర్తలనే ఎంచుకుంటుందని అన్నారు. ఇదే బిజెపి, ఇతర పార్టీలకున్న తేడా అని తెలిపారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలకు ఎస్‌పి, బిఎస్‌పి కలిసి పోటీ చేయడాన్ని యోగి విమర్శించారు. వారిది అవకాశవాదమని పేర్కొన్నారు. ఏనుగు సైకిల్‌పై కూర్చొని సవారీ చేసేందుకు ప్రయత్నిస్తోందని, అది సాధ్యం కాదని యోగి విమర్శించారు. సమాజ్ వాదీ పార్టీ గుర్తు సైకిల్ కాగా, బహుజన్ సమాజ్ పార్టీ గుర్తు ఏనుగు. యుపి ప్రజలు వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించారన్నారు.

ఎంపి శివప్రసాద్ 'మేలుకొలుపు'



చిత్తూరు: ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై పార్లమెంటులో విచిత్ర వేషధారణలతో కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టిన చిత్తూరు ఎంపి శివప్రసాద్ నియోజకవర్గంలోనూ అదే తరహాలో ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం మోసగించిన తీరు, ప్యాకేజీ పేరుతో నిధులు ఇవ్వకపోవటాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించేందుకు 'మేలుకొలుపు' పేరుతో తన నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా చంద్రగిరి పట్టణంలో క్లాక్ టవర్ వద్ద డప్పు కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ప్రత్యేక హోదా ఇస్తామని అధికారం చేపట్టిన బిజెపి తెలుగు ప్రజలను మోసగించటం అన్యాయమని పేర్కొన్నారు. బాబును దూరం చేసుకోవటం మోడీ ప్రభుత్వానికి నష్టమన్నారు.

32 కోట్ల ఓటరు గుర్తింపు కార్డులు ఆధార్‌తో అనుసంధానం

బెంగళూరు : సుమారు 32 కోట్ల ఓటరు గుర్తింపు కార్డులు దేశవ్యాప్తంగా ఆధార్‌తో అనుసంధానమైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఒపి రావత్ తెలిపారు. సుప్రీం అనుమతి తర్వాత మరో 54 కోట్ల గుర్తింపు కార్డును ఆధార్ అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. బెంగళూరులో జరిగిన 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫారమ్స్ 14వ జాతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం మూడు నెలల్లో 32కోట్ల కార్డులను ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేశామన్నారు. అయితే ఆధార్ చట్టాన్ని సవాలు చేస్తూ గతేడాది నవంబరులో కర్నాటకకు చెందిన మాథ్యూథామస్ అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆధార్ కార్డులో బయోమెట్రిక్‌తో కూడిన వ్యక్తిగత సమాచారం ఉన్నందున ఆధార్ వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తుందనే విషయంపై కోర్టుకెళ్లారు. అయితే దీనికి సంబంధించి ఇవిఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్) ట్యాంపరింగ్ అంశం గురించి కూడా వివరించారు.

ప్రధానికి రాఖీ కట్టిన శర్మతీ దేవి కన్నుమూత

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీకి రాఖీ కట్టిన సోదరి శర్మతీ దేవి కన్నుమూశారు. ఆమె వయసు 103 సంవత్సరాలు. జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌కు చెందిన శర్మతీ దేవి రాఖీ దినోత్సవాన మోడీకి రాఖీ కడ్తుండేవారు. దీంతో వారి మధ్య అక్కాతమ్ముళ్ల అనుబంధం ఏర్పడింది. స్వచ్ఛ భారత్ ఉద్యమంలో తనకు స్ఫూర్తిగా నిలిచిన కున్వర్ బాయ్ యాదవ్‌ను ఇటీవలే కోల్పోయిన మోడీకి శర్మతీ దేవి కన్నుమూతతో మరో విషాదం ఎదురైనట్లైంది. తన మేకలను అమ్మి పబ్లిక్ టాయిలెట్లు కట్టించిన కున్వర్ బాయ్ యాదవ్ గత నెల 22న కన్నుమూశారు. 106 ఏళ్ల కున్వర్ బాయ్ తనకు స్ఫూర్తినిచ్చారని స్వయంగా మోడీ చెప్పారు. బహిరంగ సభ వేదికపై ఆమె పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

రజనీకాంత్ మళ్లీ హిమాలయాలకు..

సిమ్లా: తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ హిమాలయాల యాత్రకు వెళ్లారు. శనివారం ఆయన చెన్నై విమానాశ్రయం నుంచి బయల్దేరి సిమ్లాకు వెళ్లారు. 10 నుంచి 15 రోజుల పాటు ఆయన హిమాలయాల్లోని బాబాజీ గుహలో ధ్యానం చేయనున్నారు. ప్రస్తుతం రజనీకాంత్ ధర్మశాలలోని పలు దేవాలయాలను సందర్శించారు. అక్కడున్న వారితో కాసేపు ముచ్చటించారు. రజనీకాంత్ తెల్ల దుస్తులు ధరించి, మెడలో పూలమాలలు వేసుకొని ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాగా రజనీకాంత్ వెంట అత్యంత సన్నిహితులు కొందరు వెళ్లారు. అంతే కాదు ఆయనకి కావాల్సిన సౌకర్యాలు కూడా వాళ్లే చూసుకుంటున్నారు.

దేశానికి కెసిఆర్ సేవలు అవసరం

- ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి



మనతెలంగాణ/కొడంగల్‌రూరల్: రాజీనామాను స్పీకర్‌కు పంపించానని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి నుండి ఇంత వరకు ఎలాంటి పత్రం తమ కార్యాలయానికి అందలేదని డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆమె కొడంగల్ మీదుగా కర్నాటకలోని శ్రీయానగుంది మాణికేశ్వరి మాతా దర్శనానికి వెళ్తూ కొడంగల్‌లో కాసేపు విడిది చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని కెసిఆర్ ఎంతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దారన్నారు. గత 70సంవత్సరాల నుండి ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ అభివృద్ధి చెందిందన్నారు. పడ్డ చినుకు వృథాకాకుండా మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తాగు, సాగు నీటి సమస్య పరిష్కారం కోసం ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గతంలో ఉన్న నీటి ఎద్దడితో పాటు ఫ్లోరైడ్ సమస్య నివారణకు మిషన్ భగిరథతో చక్కటి పరిష్కారం చేస్తున్నట్లు చెప్పారు.

బస్సు యాత్ర కాదు...కొట్లాడుకునే యాత్ర...!

కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా చైతన్య బస్సు యాత్రకు ప్రజల నుండి స్పందన,చైతన్యం కరువైందన్నారు. తమ ఉనికిని చాటుకునేందుకు మాత్రమే బస్సు యాత్రను కాంగ్రెస్ చేపడుతోందని విమర్శించారు. బస్సు యాత్ర కాస్తా సీనియర్లు, జూనియర్లు కొట్లాడుకునే యాత్రగా కొనసాగిందని ఏదేవా చేశారు. ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి తన స్థాయికి మించి మట్లాడరాదని హెచ్చరించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ అమ్రపాలి

మనతెలంగాణ/ వరంగల్ బ్యూరో: వరంగల్ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ కాట అమ్రపాలి అధికారులను ఆదేశించారు. అమ్రపాలి వివాహనంతరం శుక్రవారం సాయంత్రం విధుల్లో చేరారు. శనివారం జిల్లాతోపాటు వరంగల్ నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై వరంగల్ మున్సిపల్ కమిషనర్ శృతిఓజా, ఇన్‌చార్జి కలెక్టర్‌గా విధులు నిర్వహించిన జాయింట్ కలెక్టర్ ఎస్. దయానంద్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న జంక్షన్‌ల అభివృద్ధి పనుల తీరుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్ భవన్ ప్రగతిని కలెక్టర్ వాకబు చేశారు. అనంతరం జూలైవాడలోని తాత్కాలిక భవనంను సందర్శించి వివిధ విభాగాలను సందర్శించారు. రికార్డ్ రూమ్‌లో రికార్డ్‌లను జాగ్రత్తగా భద్ర పరచాలని, ఇంకా మిగిలి ఉన్న ఫైల్‌లను క్రమపద్ధతి సర్దిపెట్టాలని అధికారులకు సూచించారు.



గ్రేటర్ వరంగల్ కమిషనర్‌గా విపి గౌతమ్



మనతెలంగాణ/ కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా విపి గౌతమ్ శనివారం సాయంత్రం హన్మకొండలోని క్యాంపు కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ శృతిఓజా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా బదిలీ కావడంతో ఆమెస్థానంలో ములుగు సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న విపి గౌతమ్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ విపి గౌతమ్‌కు నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విపి గౌతమ్ మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగుల సహకారం, సమన్వయంతో నగరాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తనదైన శైలిలో శృతిఓజా

వరంగల్ నగరపాలక సంస్థ నుంచి హైదరాబాద్ నగర పాలక సంస్థకు బదిలీపై వెళ్తున్న శృతిఓజా వరంగల్ నగరంలో తనదైన శైలిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నగరాభివృద్ధికి కృషి చేశారు. 2016 డిసెంబర్ 4న పదవీ బాధ్యతలు చేపట్టిన శృతిఓజా కమిషనర్‌గా 16 నెలల పాటు పనిచేశారు. ఇందుకు స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలలో 28వ ర్యాంకు రాగా స్కోచ్ అవార్డు, హెరిటేజ్ సిటి అవార్డులు దక్కాయి. స్మార్ట్ సిటి, హృదయ్, అమృత్‌తో పాటు ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించిన రూ. మూడున్నర కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూనే కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్‌గా అనేక సంస్కరణలు నగర అభివృద్ధి కోసం చేపట్టారు.

ఆర్‌టిసి ఉద్యోగి ఇంట్లో చోరీ



మన తెలంగాణ/ కామారెడ్డి జిల్లా : జిల్లా కేంద్రంలోని ఎన్‌జిఒస్ కాలనీలో గల ఆర్‌టిసి ఉద్యోగి జితేందర్‌రెడ్డి నివాసంలో చోరీ జరిగినట్లు డిఎస్‌పి ప్రసన్నారాణి, సిఐ శ్రీధర్‌కుమార్ తెలిపారు. తాళం వేసి ఉన్న ఇంట్లోంచి సుమారు 50 నుంచి 60 తులాల బంగారు, రూ. 1.5 లక్షల నగదు దుండగులు దోచుకెళ్లారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'భగీరథ' అద్భుతం

- సిఎం కెసిఆర్ పట్టుదలతోనే అభివృద్ధి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



మన తెలంగాణ/ కోహెడ : ప్రపంచంలోనే మిషన్‌భగీరథ ఒక అద్భుతమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు అభివర్ణించారు. సిఎం కెసిఆర్ 2లక్షల కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ శుద్ధజలాలను తేవడం గొప్ప విషయం అన్నారు. జూన్ నాటికి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ శుద్ధ జలాలను అందించడం జరుగుతుందన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా, కోహెడ గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవం ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌లతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ పట్టుదలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లుతున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను చూసేందుకు దేశం నలు మూలాల నుంచి వచ్చి చూసిపోతున్నరన్నారు. 70ఏళ్ల కాలంలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధిని సిఎం కెసిఆర్ 3ఏళ్ల కాలంలోనే చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సిఎం కెసిఆర్ గ్రామం నుంచి మండలానికి, జిల్లా, రాజధాని వరకు సింగిల్, డబుల్, నాలుగు వరుసల రహదారుల నిర్మాణానికి 80కోట్ల నిధులను వెచ్చించడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటి వరకు హుస్నాబాద్ నియోజకవర్గానికి 425కోట్లతో రోడ్లను నిర్మించడం జరిగిందన్నారు. ఇన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నా కాంగ్రెస్ నాయకులకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో దుర్మార్గపు పరిస్థితులు ఉండేవన్నారు. అధికారం కోసమే కాంగ్రెస్ బస్సుయాత్ర చేపట్టిందని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత టిఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి 22.50 లక్షల నిధులను వెచ్చిస్తుందన్నారు. మహాత్మ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కోసం పంచాయతీరాజ్‌లో కొత్త చట్టం తేవడం జరుగుతుందన్నారు. సర్పంచ్‌లకు అధికార బాధ్యతలు పెంచి అదనపు నిధులు వెచ్చించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు విద్య, వైద్యం కార్పొరేట్ తరహాలో అందిస్తున్నామన్నారు. మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు 80లక్షలతో నిర్మించే సిసి రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కృష్ణరావు, ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌లను గ్రామ పంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పేర్యాల రవీందర్‌రావు, దేవేందర్‌రావు, ఎంపిపి స్వామి, జడ్పీటిసి పొన్నాల లక్ష్మణ్, ఎఎంసి చైర్మన్, తైదాల రవీందర్, డిపిఒ సురేశ్‌బాబు, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు కొక్కుల రమేశ్, సర్పంచ్‌లు దొమ్మట జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ హత్యకు కుట్రపై సిబిఐ విచారణ

- ఆరు బిసి సంఘాలు డిమాండ్

మన తెలంగాణ / హైదరాబాద్/ముషీరాబాద్ : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగను హతమార్చాలనే ప్రభుత్వ కుట్రను ఆరు బిసి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వం చేయవలిసిన పని కాదని, ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడొద్దని సంఘాలు అభిప్రాయపడ్డాయి. శనివారం హైదరాబాద్ విద్యానగర్ బిసి భవన్‌లో విలేకరుల సమావేశంలో బిసి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, తెలంగాణ బిసి ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేష్ యాదవ్, బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.నర్సింహాగౌడ్, బిసి హక్కుల పోరాట కమిటీ అధ్యక్షులు సి.రాజేందర్, బిసి సంఘర్షణ సమితి అధ్యక్షులు టిఆర్.చందర్, తెలంగాణ బిసి ప్రజా సమితి అధ్యక్షులు మధుసూదన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంద కృష్ణ తమ కులం అభివృద్ధి కోసం పోరాడుతున్నారని, దీనిని వ్యక్తిగతంగా తీసుకోరాదన్నారు. రాష్ట్రం ఎవరి జాగీరు కాదని, ప్రతి ఒక్కరూ జీవించే హక్కు ఉందన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి రాజ్యాంగానికి విరుద్ధంగా పరిపాలిస్తున్నారన్నారు. ఈ కుట్రపై సిబిఐ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

పశువులపై ఆగని చిరుత దాడులు

- భయాందోళనకు గురవుతున్న అటవీ పరిసర ప్రాంత ప్రజలు



మన తెలంగాణ/ రామాయంపేట : పశువులపై చిరుత పులి వరుస దాడులు చేస్తుంది. దీన్ని పట్టుకోవడానికి అటవీ అధికారులు చేస్తున్న యత్నాలు ఫలించం లేదు. దీంతో అటవీ ప్రాంతంలోని ప్రజలు భయం గుప్పిట్లో బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారు. రామాయంపేట మండలంలోని అటవీ ప్రాంత పరిసర గ్రామాలైన తొనిగండ్ల, లక్ష్మాపూర్, కాట్రియాల, జాన్సీ లింగాపూర్, సుతారిపల్లిల్లో చిరుత సంచారం చేస్తుంది. ముఖ్యంగా రాత్రిల్లో వ్యవసాయ బావుల వద్ద ఉన్న పశువులనే టార్గెట్ చేసుకుని వాటిపై దాడి చేసి చంపి వేస్తుంది. రెండురోజుల క్రితం లక్ష్మాపూర్ లేగ దూడను చంపగా సుతారి పల్లిలో 3మేకలను చంపి వేసింది. శుక్రవారం రాత్రి కాట్రియాల గ్రామానికి చెందిన ద్యాగల రాజు ఆవును చంపివేసింది. అతను తన వ్యవసాయ బావి వద్ద కట్టి వేసి శనివారం ఉదయం వెల్లి చూసే సరిగా ఆవు చనిపోయి ఉంది. అయితే వరుస చిరుత దాడుల మూలంగా ప్రజల ఆందోళన మేరకు అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు దాన్ని బంధించడానికి బోనులను పెట్టారు. గత గురువారం రాత్రి మెదక్ డిఎఫ్ఒ పద్మజారాణి అటవీ ప్రాంతంతో చిరుత కోసం తిరిగారు. అయినా దాని జాడ ఎక్కడా కానరాలేదు. మరిమరుసటి రోజే కాట్రియాలలో ఆవును చంపి వేయడంతో ఎప్పుడు ఏవైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందోనని అక్కడి ప్రజల మరింత భయపడుతున్నారు. రక్తానికి రుచి మరిగిన చిరుత ప్రజలపై దాడి చేయకముందే పట్టు కోవాలని అటవీ అధికారులను ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆ ప్రచారంలో నిజం లేదు

తెలుగులో బయోపిక్స్ చాలా తక్కువ. గతంలో కొన్ని బయోపిక్స్ తీసినా అవి నామమాత్రంగా చేసినవే. పేరున్న ఫిల్మ్‌మేకర్స్ మంచి బయోపిక్స్ తీసిన దాఖలాలు లేవు. అయితే ప్రస్తుతం తెలుగులో ఇద్దరు రాజకీయ ఉద్ధండుల జీవిత కథలు వెండితెరకు ఎక్కుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులు ఎన్‌టిఆర్, వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిల బయోపిక్స్ కోసం జోరుగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఎన్‌టిఆర్ బయోపిక్‌ను దర్శకుడు తేజ రూపొందించనుండగా... వైఎస్ బయోపిక్‌ను 'ఆనందో బ్రహ్మ' ఫేమ్ మహి వి.రాఘవ్ తెరకెక్కించనున్నాడు. ఎన్‌టిఆర్ బయోపిక్‌లో ఆయన తనయుడు బాలకృష్ణ ప్రధాన పాత్ర పోషించనుండగా... వైఎస్ జీవిత కథ చిత్రంలో మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి నటిస్తాడన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ ప్రచారంలో నిజం లేదని అంటున్నాడు మహి. తాను వైఎస్ బయోపిక్ కోసం పనిచేస్తున్న మాట వాస్తవమేనని... ప్రస్తుతం స్క్రిప్ట్ చివరి దశకు చేరుకుందని ఆయన చెప్పాడు. స్క్రిప్ట్ పూర్తయ్యాకే నటీనటుల గురించి ఆలోచిస్తామని పేర్కొన్నాడు.



మల్టీస్టారర్‌లో అన్న, తమ్ముడిగా..?





ఎన్‌టిఆర్ రామ్‌చరణ్

రెండు వంశాలకు చెందిన పెద్ద స్టార్లు ఒకే సినిమాలో కలిసి నటిస్తే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. ఇలాంటి అరుదైన కాంబినేషన్స్ తెలుగులో చాలా తక్కువగా సెట్ అవుతుంటాయి. రాజమౌళి దర్శకత్వంలో ఎన్‌టిఆర్, రామ్‌చరణ్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన రాకపోయినా ఇప్పటికే చిత్ర కథ, కథనాలు, పాత్రల తీరుతెన్నులపై అనేక వార్తలు వస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో ఎన్‌టిఆర్, చరణ్ అన్న, తమ్ముడిగా కనిపించనున్నారట. అటు వయసు ప్రకారం చూసుకున్నా... ఇటు సీనియారిటీ ప్రకారం చూసుకున్నా... ముఖ కవళికల ప్రకారం చూసుకున్నా అన్న పాత్రకు ఎన్‌టిఆర్, తమ్ముడి పాత్రకు చరణ్ సరిపోతారని అనుకోవచ్చు. కానీ సినిమాలో నిజంగా ఈ స్టార్లు అన్న, తమ్ముడిగా కనిపిస్తారా అనేది చూడాలి. గతంలో అయితే ఈ చిత్రం బాక్సింగ్ నేపథ్యంలో ఉంటుందని ప్రచారం జరిగింది. కానీ ఇందులో నిజంలేదనే టాక్ గట్టిగా వినిపించింది. ఇక ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను రాజమౌళి స్టైల్‌లో తెరకెక్కించనున్నారనే మాట ఎక్కువగా వినిపిస్తోంది. ఇప్పుడు మెగా ఫ్యామిలీ హీరో చరణ్ తమ్ముడిగా, నందమూరి స్టార్ ఎన్‌టిఆర్ అన్నగా నటిస్తే ప్రేక్షకులకు కిక్ సూపర్‌గానే ఉంటుంది. కానీ ఇది నిజమవుతుందా లేక అన్ని గాసిప్‌ల మాదిరిగా తేలిపోతుందా అనేది చూడాలి.

'పెద్దపులి...' తీన్‌మార్ డ్యాన్స్



నితిన్

'నువ్వు పెద్ద పులినెక్కినావమ్మో గండిపేట గండి మైసమ్మ' అంటూ పాడగానే ప్రతి తెలుగు అభిమాని పూనకం వచ్చినట్టు డ్యాన్సులు చేస్తారు. ఎందుకంటే ఆ పాటలో ఉన్న ఎనర్జీ అటువంటిది. ఇప్పుడు ఈ పాటను యంగ్ హీరో నితిన్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న 'ఛల్ మోహన్ రంగ'లో రిక్రియేట్ చేస్తున్నారు. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీమతి నిఖితా రెడ్డి సమర్పిస్తున్నారు. పవన్‌కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ్ మూవీస్ సంయుక్త నిర్మాణంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. తెలంగాణ సంస్కృతి, పెద్దమ్మ తల్లి గొప్పతనాన్ని చాటుతూ బోనాల సంబరాలలో పాడుకునే పాట 'పెద్ద పులి'. ఆ పాటను అంతే గొప్పగా... దానిస్థాయి ఏమాత్రం తగ్గకుండా సంగీత దర్శకుడు తమన్, రచయిత సాహితి చాలా జాగ్రత్తగా రిక్రియేట్ చేశారు. పెద్ద పులి పాట సినిమాలో హీరో నితిన్‌కు ఇంట్రడక్షన్ సాంగ్. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలోని ఈ పాటలో నితిన్ మాస్ స్టెప్స్ ప్రేక్షకులను అదరగొడతాయి. ఇక సాహితి అసలైన తెలంగాణ పదాలను వాడుతూ... పాటలో ప్రాస యాస ఏమాత్రం తగ్గకుండా ఈ పాటను రాశారు. రాహుల్ సిపిలిగంజ్ ఈ పాటను పాడారు. శుక్రవారం రాత్రి వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్‌లో యువత కేరింతల మధ్య ఈ గీతం విడుదలైంది. డా.కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, పమ్మి సాయి, రాజశ్రీ నాయర్ తదితరులు ప్రధాన తారాగణంగా నటించిన ఈ చిత్రానికి కెమెరాః ఎన్.నటరాజ సుబ్రమణియన్, ఎడిటింగ్ః ఎస్.ఆర్.శేఖర్, ఫైట్స్ః స్టంట్ సిల్వ, రవివర్మ.

నవతరం ప్రేమ కథ

అనూహ్యమైన కథాంశంతో ఆద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కుతోన్న కొత్త తరం ప్రేమ కథా చిత్రం 'సమ్మోహనం'. సుధీర్‌బాబు హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ అదితిరావు హైదరీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం జూన్ 15న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ''సినిమా చివరి షెడ్యూల్‌ను ఈనెల 21 నుంచి ఏప్రిల్ 3 వరకు హిమాచల్‌ప్రదేశ్, ముంబయ్‌లలో తెరకెక్కిస్తాం. దీంతో షూటింగ్ పూర్తవుతుంది. ఏప్రిల్, మే నెలలో పోస్ట్‌ప్రొడక్షన్ పనులు పూర్తిచేస్తాం. జూన్ 15న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. సంగీతానికి మంచి ప్రాధాన్యత ఉన్న చిత్రమిది''అని అన్నారు. దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ ''కొత్త ఎత్తుగడ, కొత్త పోకడ ఉన్న ఈ నవతరం కథలో రొమాన్స్, హాస్యం సమ్మిళితమై ఉంటుంది. పి.జి.విందా ఫొటోగ్రఫీ, వివేక్ సాగర్ సంగీతం, రవీందర్ కళా దర్శకత్వం ఈ సినిమాలో స్పెషల్ హైలైట్స్. ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. మంచి కథ, కథనానికి చక్కటి నిర్మాణ విలువలు తోడయ్యాయి''అని చెప్పారు. నరేష్, తనికెళ్ల భరణి, పవిత్రా లోకేష్, హర్షిణి, నందు, కాదంబరి కిరణ్, హరితేజ, రాహుల్ రామకృష్ణ, కేదార్ శంకర్ తదితరులు ఈ చిత్రంలో ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ఎడిటర్ః మార్తాండ్ కె.వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్ః యస్.రవీందర్, కో డైరెక్టర్ః కోట సురేశ్ కుమార్.



అదితిరావు హైదరీ
సుధీర్‌బాబు

గీతాంజలి సీక్వెల్‌కు సన్నాహాలు

హారర్ కామెడీ జోనర్‌లో వచ్చిన చాలా సినిమాలు మంచి విజయాన్ని అందుకున్నాయి. అలాంటి వాటిలో 'గీతాంజలి' ఒకటి. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్ ప్లాన్ చేస్తున్నారు. సుబ్బు అనే కొత్త దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కించనున్నాడు. ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో బిజీగా ఉంది. త్వరలో ఈ సినిమాను అధికారికంగా ప్రకటించబోతున్నారు ఫిల్మ్‌మేకర్స్. కోన వెంకట్ ఈ సినిమాను నిర్మించబోతున్నాడు. అంజలి, శ్రీనివాస్ రెడ్డి ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించబోతున్నారు. రాజ్‌కిరణ్ దర్శకత్వం వహించిన 'గీతాంజలి'కి కొనసాగింపుగా తెరకెక్కబోతున్న ఈ మూవీకి సంబంధించి నటీనటుల, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది. ఇక అంజలికి 'గీతాంజలి' చిత్రం మంచి పేరు తెచ్చిపెట్టింది. ఈ సీక్వెల్ మూవీ కూడా తనకు మరింత పేరు తీసుకురావాలని కోరుకుంటోంది అంజలి.



అంజలి



'దెయ్యం చెప్పిన కథ' ఆడియో వేడుకలో సాగర్, రామసత్యనారాయణ, సాయివెంకట్, ప్రదీప్‌రాజ్, దయాకర్ రెడ్డి తదితరులు

'దెయ్యం చెప్పిన కథ' గీతాల ఆవిష్కరణ

ఆరాధ్య ప్రొడక్షన్స్ పతాకంపై శివ, సుప్రియ, సురేష్ జెండా, సునీల్, పద్మ ముఖ్య తారాగణంగా ప్రదీప్‌రాజ్ దర్శకత్వంలో పెనాక దయాకర్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'దెయ్యం చెప్పిన కథ'. నవీన్.జె సంగీత దర్శకత్వంలో రూపొందిన పాటలను హైదరాబాద్‌లోని ఫిలిం చాంబర్‌లో ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆడియో బిగ్ సీడీని సాగర్, రామసత్యనారాయణ, సాయి వెంకట్‌లు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ప్రదీప్‌రాజ్, నిర్మాత పి.దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ''తొలి ప్రయత్నంగా మేము కష్టపడి చేసిన ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. పాటలు అద్భుతంగా తెరకెక్కాయి. ఇందులో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు బాగా సహకరించారు. సినిమా బాగా వచ్చింది. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తాము''అని అన్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ఘన విజయం సాధించాలని అతిథులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సినిమా యూనిట్ పాల్గొంది.



సిమ్రాన్ పరీన్‌జా

సిమ్రాన్ పరీన్‌జాకు బంపర్ ఆఫర్

నిఖిల్ సరసన 'కిర్రాక్ పార్టీ'లో హీరోయిన్‌గా నటించిన యంగ్ బ్యూటీ సిమ్రాన్ పరీన్‌జా. ఈ సినిమా విడుదలకాకుండానే ప్రోమోలు చేసి ఆమెను మరో సినిమాకు ఎంపికచేశారు. నాగశౌర్య హీరోగా శ్రీనివాస చక్రవర్తి అనే కొత్త దర్శకుడు తెరకెక్కించే 'నర్తనశాల' సినిమాకు ఈ జూనియర్ సిమ్రాన్‌ను హీరోయిన్‌గా ఖరారు చేసినట్లు సమాచారం. పట్టుమని పాతికేళ్లు కూడా లేని ఈ ముద్దుగుమ్మ ఇటు పక్కింటి అమ్మాయిగా, అటు గ్లామరస్ తార లుక్‌తో ఆకట్టుకుంటోంది. అందుకే 'నర్తనశాల' చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా తీసుకున్నారు. ఈ సినిమాలో సిమ్రాన్ పరీన్‌జా పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందట. ఇక 'ఛలో' సినిమా తర్వాత నాగశౌర్య రెండు సినిమాలు చేయాల్సి ఉంది. శ్రీనివాస చక్రవర్తితో 'నర్తనశాల', కెమెరామెన్ సాయిశ్రీరామ్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నాడు. సాయి శ్రీరామ్ స్క్రిప్ట్ ఇంకా ఓ కొలిక్కి రాకపోవడంతో ముందుగా శ్రీనివాస చక్రవర్తితో సినిమాను ప్రారంభించనున్నాడు. ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభమయ్యే 'నర్తనశాల' సినిమా కోసం కాస్టింగ్, టెక్నికల్ టీమ్ ఎంపిక మొదలైంది. ఇందులో భాగంగానే ముందుగా హీరోయిన్ సిమ్రాన్ పరీన్‌జాను ఎంపికచేశారు.

ఆ హక్కు ఎవరికీ లేదు

బాలీవుడ్ హీరోయిన్లలో రాధికా ఆప్టే రూట్ ఎప్పుడూ సపరేటే. కొన్ని హిందీ సినిమాల్లో ఈ భామ అందాల ఆరబోతలో హద్దులు దాటేసి యూత్‌ను మురిపించింది. అదేవిధంగా రియల్‌లైఫ్‌లో కూడా గ్లామరస్‌గా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. ఇక ఏ అంశంపైన అయినా తన అభిప్రాయం చెప్పమంటే మాత్రం మనసులో ఉన్నది ఉన్నట్టుగా నిర్మొహమాటంగా చెబుతుంది ఈ భామ. ఈమధ్య రాధిక గోవా బీచ్‌లో సరదాగా తిరిగొచ్చింది. ఈ సందర్భంగా బీచ్‌లో బికినీతో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. సినిమాల్లోనే కాదు నిజ జీవితంలో కూడా అందాల ఆరబోతలో తాను వెనుకాడనని ఈ ఫొటోలతో స్పష్టంచేసింది. అయితే ఆ ఫొటోలను చూసిన నెటిజన్లు కొందరు ఆమెపై కొన్ని నెగటివ్ కామెంట్లు చేశారు. వీటిపై రాధికా ఆప్టే స్పందిస్తూ... ''నేను బీచ్‌కు వెళ్తే చీర కట్టుకొని వెళ్లాలని కోరుకుంటున్నారా? బీచ్‌లో బికినీతో ఎంజాయ్ చేయాలి కానీ చీరతో కాదు. నా లైఫ్... నా ఇష్టం. నా వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడే హక్కు ఎవరికీ లేదు''అని పేర్కొంది. ఇటీవల విడుదలైన అక్షయ్‌కుమార్ 'ప్యాడ్‌మ్యాన్' సినిమాలో రాధిక ప్రధాన పాత్రలో నటించింది. ఇందులో ఆమె పల్లెటూరులో పుట్టి పెరిగిన అమాయకురాలైన మహిళ పాత్రను పోషించింది. ఈ చిత్రానికి మిశ్రమ స్పందన లభించినప్పటికీ రాధిక నటనకు మంచి ప్రశంసలు వచ్చాయి.



రాధికాఆప్టే

సెంటిమెంట్‌తో పాటు వినోదం

సతీష్ రెడ్డి, మౌర్యానీ, ముంతాజ్ హీరోహీరోయిన్లుగా వి.జె.రెడ్డి దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై సిహెచ్ రఘునాథ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రభాస్ శ్రీను, అంబటి శీను, సమ్మెట గాంధీ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఆహ్లాదకరమైన ప్రేమ కథగా ఈ సినిమా తెరకెక్కింది. చిత్ర నేపథ్యం భావోద్వేగాలతో ఉన్నా...కథనం ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. సెన్సార్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం 'యు/ఎ' సర్టిఫికెట్‌ను అందుకుంది. అన్నికార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఈ చిత్రం ఈనెల 16న విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శకుడు విజె రెడ్డి మాట్లాడుతూ ''పల్లె వాతావరణంలో కథంతా సాగుతుంది. పచ్చటి పైరుల అందాలు ప్రేక్షకులకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. కథ రీత్యా సెంటిమెంట్ చిత్రమైనా కావాల్సినంత వినోదం కూడా ఉంటుంది. నలుగురికి మంచి చేసే పెద్దారెడ్డి ఓ యువతి కుటుంబానికి ఆశ్రయమిస్తాడు. ఈక్రమంలో అతనికి అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. వాటి పర్యవసానంగా కథ ఎలాంటి మలుపులు తిరిగింది అనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం''అని అన్నారు. కథానాయకుడు సతీష్ రెడ్డి మాట్లాడుతూ ''నెల్లూరి పెద్దారెడ్డి అనే పాత్ర పేరు ప్రేక్షకులు వినే ఉంటారు. ఆ పెద్దారెడ్డి నవ్విస్తే... ఈ నెల్లూరి పెద్దారెడ్డి మర్చిపోలేని అనుభూతిని అందిస్తాడు. ప్రణాళిక ప్రకారం కేవలం 28 రోజుల్లోనే షూటింగ్ పూర్తిచేశాం. ఈనెల 16న ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం''అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః బాలసుబ్రమణి, ఎడిటింగ్ః మేనగ శీను, సంగీతంః గురురాజ్, డ్యాన్స్ః గోరా మాస్టర్.



సతీష్ రెడ్డి
మౌర్యానీ



వడ్డీరేట్లు పెంచనున్న ఆర్‌బిఐ


ముంబయి: గతకొంత కాలంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బిఐ) కీలక వడ్డీరేట్లపై తటస్థ వైఖరిని కొనసాగిస్తోంది. ఫిబ్రవరిలో జరిగిన 2017–18 ఆర్థిక సంవత్సరం చివరి ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలోనూ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. అయితే 2018–19 ఆర్థిక సంవత్సరంలో జరగబోయే సమీక్షల్లో వడ్డీ రేటును 0.25శాతం పెంచే అవకాశముందని తెలుస్తోంది. ద్రవ్యోల్బణ భయాలు, ద్రవ్యలోటు పెరగడం వల్లే వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలున్నాయని 'కేర్ రేటింగ్స్' అనే సంస్థ తాజా నివేదికలో పేర్కొంది.చమురు ధరలు, ఇంటి అద్దెలు పెరగడం తదితర కారణాల వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆర్‌బిఐ అంచనా వేస్తోంది. 2018–19 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో ద్రవ్యోల్బణం 5.1శాతం నుంచి 5.6శాతం వరకు పెరిగే అవకాశముందని భావిస్తోంది. ఆ తర్వాత తగ్గే సూచనలు కన్పిస్తున్నాయని ఇటీవల జరిగిన సమీక్షలో పేర్కొంది. ఇదే సమయంలో ద్రవ్యలోటు కూడా పెరగడంతో వడ్డీ రేట్లను పెంచక తప్పదని నివేదిక చెబుతోంది. '2018లో రెపో రేటును 0.25శాతం పెంచే అవకాశముంది. ప్రస్తుతం ఇది 6శాతంగా ఉంది' అని నివేదిక వెల్లడించింది. 2018–19 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బిఐ తొలి ద్వైమాసిక పరపతి విధాన కమిటీ సమావేశాలు ఏప్రిల్ 4, 5న జరగనున్నాయి.

సుంకాల యుద్ధానికి భయపడం

ప్రపంచ వాణిజ్య సమరంలో భారత్ నిలదొక్కుకుంటుంది : ఆనంద్ మహీంద్ర

న్యూఢిల్లీ: 'వాణిజ్య యుద్ధంలో భారత్ నిలదొక్కుకుంటుంది' అని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర అన్నారు. స్టీలు దిగుమతులపై అమెరికా పన్నులు పెంచుతున్న నేపథ్యంలో ఆయన ఈ మాట అన్నారు. వేగంగా ఆర్థిక వృద్ధి చెందుతున్న భారత్‌తో ప్రపంచ దేశాలు వాణిజ్యం చేయాల్సి ఉంటుందన్నారు. 'ప్రపంచ సుంకాల యుద్ధానికి భారత్ మార్కెట్లు ఎందుకంత కలవరపడుతున్నాయో అర్థం కావడంలేదు. ఎగుమతులపైనే ఆధారపడే చిన్న దేశాలు నిలదొక్కుకోలేకపోవచ్చు. కానీ పెద్ద దేశీయ మార్కెట్ ఉన్న దేశాలు ఎలాంటి సుంకాల ముప్పునైనా ఎదుర్కోగలవు. వేగంగా ఆర్థిక వృద్ధి సాధిస్తున్న భారత్‌తో ప్రపంచ దేశాలు వాణిజ్యాన్ని కోరుకుంటాయి' అని మహీంద్ర ట్వీట్ చేశారు. వైవిధ్యభరితమైన మహీంద్ర గ్రూపుకు అధినేత అయిన ఆయన బహుళ జాతి సంస్థలు భారత్ మార్కెట్‌కు రావాలనుకుంటున్నాయని, స్థానికంగానే ఉత్పత్తిని చేయాలనుకుంటున్నాయని , అవి అలా చేయనున్నాయి కూడా అన్నారు.

'సామ్యవాద, మంద ఆర్థికవ్యవస్థ వెనక్కి పోయే ప్రమాదమే లేదు. రక్షణ విధానం(ప్రొటెక్షనిజం)పై నాకు నమ్మకం లేదు. ప్రపంచంలో పోటీపడేందుకు ఆనందిస్తాను. వాణిజ్య యుద్ధంలో భారత్ నిలదొక్కుకుంటుంది' అని ఆయన అన్నారు. స్టీలు, అల్యూమినియంలపై అమెరికా ఇటీవల భారీగా దిగుమతి పన్నులు విధించిందన్నారు. అందుకు వారు దేశీయ రక్షణ భయాందోళనలు ఎకరువుపెట్టారన్నారు. అక్రమ వ్యాపార ఆచరణల నుంచి అమెరికాను కాపాడుకునేందుకు అంటూ వారు ప్రపంచంలో వాణిజ్య యుద్ధాన్ని మొదలుపెట్టారు అన్నారు. స్టీలుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం దిగుమతిపన్ను ప్రకటనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకాలు చేశారు. పొరుగున ఉన్న కెనడా, మెక్సికోలకు తప్పించి ఇతర దేశాలన్నింటికీ ఇది వర్తిస్తుంది. సుంకాల పెంపు ప్రభావం ఏ మేరకు ఉండనుందో వేచి చూస్తామని వాణిజ్య శాఖ కార్యదర్శి రీటా టీయోటియా అన్నారు. అమెరికా తాజా నిర్ణయంపై ప్రపంచవ్యాప్తంగా గగ్గోలు పుడుతున్న నేపథ్యంలో ఆమె ఈ విషయం చెప్పారు. ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటిఒ) నిర్ణయించిన దానికన్నా అమెరికా విధించిన దిగుమతి సుంకాలు ఎక్కువ కావడంతో ప్రపంచ దేశాలు విమర్శిస్తున్నాయి. 'ఒకవేళ భారత్ తిరిగి ప్రతిసుంకాలు విధిస్తే అది స్వాతంత్ర్యానంతర సుంకాలకన్నా వేరేవిధంగా ఉంటాయి. నేడు భారత్‌ది స్వేచ్ఛా విపణి ఆర్థికవ్యవస్థ. ప్రపంచ సాంకేతికతను పొందగలదు. తాను కొత్తగా కనుగొనే అంకుర సంస్థలకు(స్టార్టప్స్‌కు) మూలధనాన్ని కూడా సమకూర్చగలదు. భారత్‌కున్న వనరులు అపారం. దానికి కొరతగా ఉన్న వాటిని దిగుమతి చేసుకోగలదు' అని మహీంద్ర మరో ట్వీట్‌లో చెప్పారు.



ఇకపై ఐఎస్‌ఐ మార్కు హెల్మెట్‌లే



న్యూఢిల్లీ: ఐఎస్‌ఐ గుర్తులేని హెల్మెట్‌లను మరో ఆరు నెలల్లో పూర్తిగా నిషేధిస్తామని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ రోడ్డు సంరక్షణపై ఏర్పాటైన సుప్రీంకోర్టు సంఘానికి తెలిపినట్టు ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఈ చర్యను ఐఎస్‌ఐహెచ్‌ఎంఎ(ఐఎస్‌ఐ హెల్మెట్ అసోసియేషన్) స్వాగతించింది. ద్విచక్రవాహనదారులు ఇకపై ఐఎస్‌ఐ హెల్మెట్ లేకుండా నడపడం అన్నది ఈ ఏడాది చివరి నుంచి నేరం కానుంది. 'దేశంలో 75 నుంచి 80 శాతం మంది ద్విచక్రవాహనదారులు ఐఎస్‌ఐ ప్రమాణాలున్న హెల్మెట్‌లు ధరించడంలేదు. మనదేశంలో నాసిరకం హెల్మెట్‌లు ధరించడాన్ని వాహన చోదకులు చాలా మామూలుగా తీసుకుంటున్నారు. ప్రమాణంలేని ఆ హెల్మెట్‌లు వారిని సరిగ్గా కాపాడలేవని గ్రహించడంలేదు' అని ఐఎస్‌ఐ హెల్మెట్ మాన్యుఫాక్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజీవ్ కపూర్ వ్యాఖ్యానించారు. 'ప్రమాణాల మేరకు ఒక్క హెల్మెట్‌ను తయారు చేయడానికి కనీసం రూ. 300 నుంచి రూ. 400 అవుతుంది. రూ. 300 కన్నా తక్కువ ధరతో ప్రామాణిక హెల్మెట్‌లను తయారు చేయడం సాధ్యం కాదు. మార్కెట్‌లో నాసిరకం హెల్మెట్‌లు చోటుచేసుకోడానికి కారణం ధరలు కారణమే' అని కపూర్ చెప్పారు. ఐఎస్‌ఐ మార్కు ఉన్న హెల్మెట్‌లను తప్పనిసరి చేసినందుకు ఆయన భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దీంతో సంవత్సరానికి 9 కోట్ల హెల్మెట్ల డిమాండ్ ఏర్పడగలదని సమాచారం.

త్వరలో మార్కెట్‌లోకి శామ్‌సంగ్ సరికొత్త టివి




న్యూఢిల్లీ: కళ్లకు కట్టినట్టు కనిపించే దృశ్యాల అనుభూతిని కలిగించేలా శాంసంగ్ సరికొత్త టివిలను వినియోగదారులకు అందుబాటులోకి తేనుంది. బ్రిక్స్‌బీ టెక్నాలజీతో కస్టమర్లను ఆకట్టుకునేందుకు సరికొత్త ఫీచర్లు, ఎత్తుగడతో మార్కెట్లోకి ప్రవేశించనుంది. నోటి మాట ద్వారా మనకు నచ్చిన సినిమాలను, పాటలను (టివిలో అంతర్గతంగా ఉండే బ్రిక్స్‌బీ పరికరం సహాయంతో) ప్లే చేయొచ్చు. ఈ అధునాతన టివిలు త్వరలోనే ఇండియన్ మార్కెట్లోకి రానున్నాయి. శాంసంగ్ స్మార్ట్ వ్యూ యాప్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌లోని కంటెంట్‌ను టివిలో వీక్షించవచ్చు. అదనంగా సరికొత్త ఫీచర్‌తో క్యూఎల్‌ఇడి టివిలు మే నెల చివరికల్లా భారతీయ వినియోగదారులను పలకరించబోతున్నాయి. త్వరలోనే వీటి ధరలను ప్రకటించనున్నట్లు సామ్‌సాంగ్ అధికారులు తెలిపారు. 4కె రిజల్యూషన్‌తో క్యూఎల్‌ఇడి టివిలను ఈ ఏడాది ద్వితీయార్థంలో మార్కెట్లోకి ప్రవేశపెడతామన్నారు. 85 ఇంచుల తెర, 8కె కృత్రిమ మేధస్సులాంటి ఫీచర్స్‌తో రాబోతున్నట్లు ప్రకటించారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29210	31240.64	0.55%
ముంబై	29810	31882.35	–0.43%
ఢిల్లీ	29650	31711.23	–0.5%
కోల్‌కతా	29930	32010.70	–0.43%
కేరళ	28200	30160.43	0%
బెంగళూరు	28500	30481.28	–0.35%
హైదరాబాద్	29050	31069.52	0.1%
గల్ఫ్	1402.73	1500.25	–0.65%

వెండి ధర (రూ./ కిలో)


నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	41500.00	41800.00	–0.72
ముంబై	41500.00	41800.00	–0.72
ఢిల్లీ	41500.00	41800.00	–0.72
కోల్‌కతా	41500.00	41800.00	–0.72
హైదరాబాద్	41500.00	41800.00	–0.72



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	330	విశాఖపట్నం	330
వరంగల్	332	చిత్తూరు	378
విజయవాడ	320	చెన్నై	385
గోదావరి	320	బెంగళూరు	365

త్వరలో కొత్త పారిశ్రామిక విధానం



న్యూఢిల్లీ: మరి కొన్ని వారాల్లో కొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రకటిస్తామని వాణిజ్య శాఖ మంత్రి సురేశ్ ప్రభు శనివారం అన్నారు. భవిష్యత్తులో దేశ వృద్ధికి అది చోదకం కాగలదని అన్నారు. వివిధ రంగాల్లో భారత్, ఫ్రాన్స్ భాగస్వామ్యానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన అన్నారు. భారత్–ఫ్రెంచ్ ఆర్థిక భాగస్వామ్య కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. 'మేము ఇప్పటికే కొన్ని రంగాలను గుర్తించాం. ఇప్పుడున్న పరిశ్రమలను నవీనీకరిస్తున్నాం. కొత్త పారిశ్రామిక విధానాన్ని మరి కొన్ని వారాల్లో ప్రకటిస్తాం' అని ప్రభు ఈ సందర్భంగా అన్నారు. 'నేడు లేనటువంటి.. భవిష్యత్తులో రానున్న పరిశ్రమలపై తాము దృష్టిపెట్టాం' అని అన్నారు. ప్రతిపాదిత నూతన పారిశ్రామిక విధానం 1991 పారిశ్రామిక విధానాన్ని పూర్తిగా పునరుద్ధరిస్తుందన్నారు. గత ఏడాది ఆగస్టులో ఈ నూతన పారిశ్రామిక విధానం ముసాయిదాను డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్(డిఐపిపి) తయారుచేసిందన్నారు. కొత్త పారిశ్రామిక విధానం తదుపరి రెండు దశాబ్దాలకు ఉపాధికల్పన, విదేశాలకు సాంకేతికత బదిలీ చేయడంతో పాటు 100 బిలియన్ డాలర్ల వార్షిక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని పొందగలదన్నారు.

జపాన్‌లో మద్యం ఆవిష్కరించనున్న కోకాకోలా

హైదరాబాద్: కోకాకోలా కంపెనీ తొందర్లోనే ఆల్కాహాలిక్ డ్రింక్‌ను ఆవిష్కరించబోతుంది. 125 సంవత్సరాల చరిత్ర కలిగిన తమ కంపెనీ జపాన్‌లో ఈ డ్రింక్‌ను విడుదల చేయబోతున్నట్టు కోకా కోలా జపాన్ విభాగం అధ్యక్షుడు జార్జ్ గార్డునూ తెలిపారు. 'ఇది మద్యంతో కూడిన ఒక పానీయం. సాంప్రదాయకంగా షాచ్, మెరిసే నీరు, అదనంగా ప్రత్యేక రుచిని కలిగి ఉన్న పానీయంతో తయారు చేస్తార'ని ఆయన వెల్లడించారు. ఇది జపాన్‌లో ప్రాచుర్యం పొందిన చుహాయ్ పానీయాలను పోలి ఉంటుందని.. దీన్ని ద్రాక్ష, స్ట్రాబెర్రీ, తెల్ల పీచు, కివి షాచ్ వంటి పలు రుచులు వోడ్కాతో తయారుచేస్తామని కోకాకోలా ప్రకటించింది. ఇందులో 3 నుంచి 8 శాతం ఆల్కాహాల్ పరిమాణం ఉంటుందని తెలిపింది. ప్రజలు మద్యపానాన్ని, కూల్ డ్రింక్‌ను కలిపి తాగుతున్నారని.. వేర్వేరు బాటిల్స్ అక్కర్లేకుండా రెండు కలిపి ఒకే సీసాలో తామే తయారు చేస్తున్నట్టు వెల్లడించింది. ఈ డ్రింక్ జపాన్ సాంప్రదాయానికి దగ్గరగా ఉంటుందని వివరించింది. కోకాకోలా కంపెనీ 1982లో అమెరికాలోని ఆల్కాహాల్ అమ్మకం నుంచి తప్పుకోడంతో దాని వాణిజ్యంలో 2 నుంచి 4 శాతం నష్టపోయింది. 35 ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ కోకాకోలా కంపెనీ ఆల్కాహాల్ తయారీలో అడుగుపెట్టింది. అయితే జపాన్‌లోనే మొదట ఆరంభించబోతున్నది.

మోటారు వాహనాల థర్డ్ ప్రీమియంలు ఇకపై చౌక

ముసాయిదాను విడుదల చేసిన 'ఇర్డాయ్'





న్యూఢిల్లీ: చిన్న ప్రైవేట్ కారులు, కొన్ని రకాల ద్విచక్ర వాహనాల థర్డ్ పార్టీ బీమా ప్రీమియంను తగ్గించాలని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఇర్డాయ్) ప్రతిపాదించింది. ఇదే విధంగా ఇతర కేటగిరి వాహనాలకు కూడా సదుపాయం కల్పించాలన్న ఆలోచనలో ఉంది. 208–19కి సంబంధించిన మోటార్ థర్డ్ పార్టీ(టిపి) ప్రీమియంల అంచనా ముసాయిదాను ఇర్డాయ్ విడుదల చేసింది. అయితే వీటిమీద సంబంధిత పక్షాలు తమ అభిప్రాయాలు తెలుపుకునేందుకు మార్చి 22 వరకు గడువును ఇచ్చింది. తన ముసాయిదాలో ఇ–రిక్షా బీమా ప్రీమియంను రూ. 1440 నుంచి రూ. 1685 పెంచే ప్రతిపాదన చేసింది. అదే సమయంలో థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రీమియంను తగ్గించే ప్రతిపాదన చేసింది. 1000 సిసి కన్నా తక్కువ సామర్థ్యం ఉన్న ఇంజిన్ కార్లకు ఈ ప్రీమియంను రూ. 2055 నుంచి రూ. 1850కు తగ్గించాలని ప్రతిపాదించింది. అయితే 1000 సిసి కన్నా ఎక్కువ సామర్థ్యం ఉన్న ఇంజిన్ కార్ల థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రీమియంలో ఎలాంటి మార్పును ముసాయిదాలో పేర్కొనలేదు. ఒకవేళ ఈ ముసాయిదా ఆమోదం పొందితే 75 సిసి ఇంజిన్ ద్విచక్రవాహనాల ప్రీమియం రూ. 569 నుంచి రూ. 427కు తగ్గిపోనుంది. అయితే ఎంట్రీ లెవల్ బైకులకు(75 నుంచి 150 సిసి) ఎలాంటి మార్పును చేయలేదు. సూపర్ బైకులకు(350 సిసి కన్నా ఎక్కువ) ప్రీమియంను రెట్టింపు చేసి రూ. 2323కు పెంచింది. పర్‌ఫార్మెన్స్ బైకులకు(150 నుంచి 350 సిసి) కూడా ప్రీమియంను పెంచే ప్రతిపాదన చేసింది.

వాణిజ్య వాహనాల విషయానికి వస్తే 40 వేల కిలోలకు మించి మోసుకుపోయే వాహనాలకు ప్రీమియంను రూ. 33024 నుంచి రూ. 39299 వరకు పెంచాలని ప్రతిపాదించింది. వింటేజ్, క్లాసిక్ కార్ క్లబ్ ఆఫ్ ఇండియా 'వింటేజ్ కార్లు' అని సర్టిఫై చేసిన ప్రైవేట్ వాహనాలకు 50 శాతం రాయితీని ఇవ్వాలని కూడా ప్రతిపాదించింది. ప్రయాణికులను తీసుకెళ్లే కొన్ని నాలుగు చక్రాల వాహనాలకు థర్డ్ పార్టీ ప్రీమియంను తగ్గించాలని, అలాగే 6 హార్స్‌పవర్(హెచ్‌పి) వరకు ఉండే వ్యవసాయ ట్రాక్టర్లకు ప్రీమియంను రూ. 653 నుంచి రూ. 816కు పెంచాలని ప్రతిపాదించింది. ఇన్సూరెన్స్ ఇన్‌ఫార్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా(ఐఐబిఐ) ఇచ్చిన సమాచారం ఆధారంగానే 2018–19 ప్రీమియం రేట్లను ప్రతిపాదించినట్లు ఇర్డాయ్ తెలిపింది. మోటార్ థర్డ్ పార్టీ బీమా అన్నది వాహనాలకు తప్పనిసరి.

నాగ్‌పూర్‌లో ఓలా విద్యుత్తు కార్లకు ప్రతికూలత



నాగ్‌పూర్: 2030 నాటికి దేశమంతటా విద్యుత్తు వాహనాలే తిరగాలన్నది ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్ష. దీనికి అనుగుణంగా ఓలా ట్యాక్సీ కార్ల సంస్థ గత ఏడాది 80 లక్షల డాలర్లను పెట్టుబడిగా పెట్టాలనుకుంది. గత ఏడాది ప్రజలు పెద్దగా సమావేశమైనప్పుడు కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ సైతం ఓలా ప్రాజెక్టును జెండా ఊపి ఆరంభించారు. కానీ 9 నెలలు గడిచాయో లేదో పరిస్థితి భిన్నంగా తయారైంది. చార్జింగ్ స్టేషన్లలో ఎక్కువ సేపు వేచి ఉండడం, ఎక్కువ వ్యయం కారణంగా అసంతృప్తి చెందిన ఓలా డ్రైవర్లు తమ కార్లను వాపస్ ఇచ్చేసి ఇంధనం వాహనాలవైపుకు మళ్లారు. నాగ్‌పూర్‌లోని 20 ఓలా కారు డ్రైవర్లను రాయిటర్ వార్తా సంస్థ ఇంటర్వ్యూ చేసింది. వారు తమ విద్యుత్తు కార్లను వాపసు చేసి డీజిల్ కార్లకు మళ్లామన్నారు. నాగ్‌పూర్‌లోని నాలుగు ప్రాంతాల్లో 200 విద్యుత్తు వాహనాలకు 50 చార్జింగ్ పాయింట్లు ఉన్నాయని ఓలా పేర్కొంది. అయితే వాటిలో కొన్ని మాత్రమే పనిచేస్తున్నాయని తెలిసింది. ఓలా 10 అదనపు చార్జింగ్ పాయింట్లు కలిగి ఉన్నప్పటికీ లక్ష్యానికి కావాలిసినంత చార్జింగ్ పాయింట్లు లేవు. ట్రాఫిక్ జామ్ కారణంగా ప్రజల నిరసనలకు జడిసి ఓలా ఒక చార్జింగ్ పాయింట్‌ను గత ఏడాది మూసేసింది. మరో స్టేషను తెరవడానికి దానికి ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ రాడానికి 5 నెలలకు మించి సమయం పట్టింది. భారత్ విద్యుత్ వాహనాలకు సిద్ధంగా లేదని ప్రపంచంలోని వాహన తయారీ దార్లు పదేపదే హెచ్చరించారు. విద్యుత్ వాహనాల ఓలా ప్రాజెక్టు ఇటు కంపెనీకి, అటు డ్రైవర్లకు ప్రయోజనకారి కాలేదు. విద్యుత్ వాహనాల బ్యాటరీ ధర అధికంగా ఉండడం కూడా ఒక కారణం. దాంతో డిమాండ్ బాగా పడిపోయింది. ఏది ఏమైనప్పటికీ పెరుగుతున్న కాలుష్యం కారణంగా విద్యుత్ వాహనాలను ప్రోత్సాహించాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ప్రజా రవాణా, ట్యాక్సీలను ప్రోత్సాహించాలనుకుంది. కానీ వాస్తవంలో పరిస్థితులు ప్రతికూలంగా కనిపిస్తున్నాయి.

మరో 20 రూట్లలో ట్రూజెట్ సర్వీసులు

- ఈ నెల 25న చెన్నై–సేలం సర్వీస్ ప్రారంభం
- త్వరలో అహ్మదాబాద్, గౌహతిల నుంచి సర్వీసులు

హైదరాబాద్: ప్రాంతీయ విమానయాన సంస్థగా సేవలు ప్రారంభించిన ట్రూజెట్ స్వల్ప కాలంలోనే జాతీయ విమానయాన సంస్థగా ఎదిగింది. త్వరలో దేశవ్యాప్తంగా మరిన్ని సర్వీసులను తూర్పు, పశ్చిమ తీర ప్రాంతాల నుంచి కూడా ప్రారభించనుంది. మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) గ్రూప్ కంపెనీలో భాగమైన టర్బో మేఘా ఎయిర్వేస్ ప్రైవేట్ లిమిటెడ్ 'ట్రూజెట్' పశ్చిమ, తూర్పు తీరం, ఈశాన్య భారతం నుంచి కూడా విమాన సేవలను విస్తరించనుంది. త్వరలో దేశవ్యాప్తంగా మరో 20 రూట్లలో తన సేవలను ప్రారంభించనుందని టర్బో మేఘా ఎయిర్‌వేస్ లిమిటెడ్ ట్రూజెట్ సంస్థ వాణిజ్య వ్యవహారాల పర్యవేక్షణ అధికారి సెంథిల్ రాజా తెలిపారు. 'ఉడాన్' పథకం రెండో దశ కింద తమ సంస్థ 20 రూట్లలో విమానాలు నడిపేందుకు అనుమతి పొందిందని తెలిపారు. ఈ నెల 25న తమిళనాడు రాజధాని చెన్నై నుంచి తమ సంస్థ విమాన సర్వీసులు ప్రారంభిస్తుందని రాజా తెలిపారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎయిర్‌షో (వింగ్స్ ఇండియా 2018)లో మేఘా టర్బో ట్రూజెట్ పాల్గొనడంతో పాటు స్టాల్‌ను నిర్వహిస్తూ ప్రయాణికులకు మరింత సేవలు అందించే విధంగా కార్యక్రమాలను విస్తృతం చేస్తోంది.

రెండేళ్లలో 10 లక్షల మంది ప్రయాణం...

సంస్థని స్థాపించిన రెండున్నర సంవత్సరాల్లోనే పది లక్షల మంది ప్రయాణికులను దేశంలోని వివిధ ప్రాంతాలకు చేరవేసిన ట్రూజెట్, దేశంలోని మారుమూల ప్రాంతాలకు విమానాలు నడపడం ద్వారా దేశ విమానయాన చిత్రపటంలోకి వాటిని ఎక్కించే ప్రయత్నం చేస్తోంది. 2015 జూలై 12న రెండు విమానాలతో ప్రారంభమైన టర్బో మేఘా ఎయిర్వేస్ ప్రైవేట్ లిమిటెడ్ ట్రూజెట్ సంస్థ ఈ ఏడాది జనవరి 19 నాటికి తమ సంస్థలో ప్రయాణించే 10లక్షల ప్రయాణికులను హైదరాబాద్ నుంచి గోవా మార్గంలో తీసుకెళ్లింది. ప్రస్తుతం ట్రూజెట్ ఐదు విమానాలను దేశంలోని వివిధ మార్గాలకు నడుపుతోంది. ప్రతి రోజు 13 ప్రాంతాలకు 32 సర్వీసులను ట్రూజెట్ నడుపుతోంది. ఈ సర్వీసుల ద్వారా ఈ ఏడాది జనవరి 19 నాటికి 10 లక్షల మంది ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేరవేసిన ట్రూజెట్ మరో 50 రోజుల్లోనే లక్షల మందిని వారి గమ్య స్థానాలకు చేరవేసింది.



త్వరలో మరో ఏడు విమానాలు...

ప్రస్తుతం ట్రూజెట్ సంస్థ ఐదు విమానాల ద్వారా ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు తీసుకెళుతోంది. ఐదు విమానాలకు తోడుగా మరో ఏడు విమానాలను వాటి సరసన చేర్చబోతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఉడాన్' పథకం తొలి దశలో 18 రూట్లను పొందిన ట్రూజెట్ ఆయా ప్రాంతాలకు ఇప్పటికే విమాన సర్వీసులను ప్రారంభించింది. హైదరాబాద్–ఔరంగాబాద్ మధ్య విమాన సర్వీస్ నడుపుతున్న సంస్థ ట్రూజెట్ ఒక్కటే. ప్రస్తుతం హైదరాబాద్‌లోని బేగంపేట్ విమానాశ్రయంలో కేంద్ర పౌర విమానయాన సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న వింగ్స్ ఇండియా 2018 లో ప్రత్యేకంగా ఒక స్టాల్ ను ఏర్పాటు చేసి దేశంలోని ప్రయాణికులను విమానయానానికి ఉత్సాహం చూపే విధంగా అవగాహన కల్పిస్తున్నట్లు సెంథిల్ తెలిపారు. తమ విమానాల్లో టికెట్ ప్రారంభ ధర 599 రూపాయలేనని పేర్కొన్నారు. ప్రయాణికులకు ట్రూజెట్ అధునాతన ఎంటర్‌టైన్‌మెంట్ సౌకర్యాలను అందజేస్తోంది. స్నేహితులు, కుటుంబసభ్యులు గ్రూప్‌బుకింగ్స్ చేసుకుంటే వారికి వివిధ ప్రత్యేక సధుపాయాలను కల్పిస్తోంది. అదే విధంగా ట్రూజెట్ బి–ప్లాన్ క్రింద మధ్య, చిన్నతరహా ఎంటర్‌ప్రైజులకు ప్రత్యేక సధుపాయాలను అందిస్తోంది. అలాగే కార్పోరేట్ రంగంలోనివారికి,తరచూ ప్రయాణించేవారికి ఫ్లాట్ రేటు విధానం క్రింద అనుకూలమైన చార్జీలను వసూలు చేస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణాన్ని రద్దు చేసుకోవాల్సి వస్తే కాన్సిలేషన్ ఫీజు కూడా అతి తక్కువగా వసూలు చేస్తోంది.

ఫేస్‌బుక్ మెసెంజర్‌లో ఇక వీడియో కాలింగ్



న్యూఢిల్లీ: సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ వినియోగదారులకు శుభవార్త. ఇకపై యూజర్లు ఎంచక్కా వీడియో కాల్స్ కూడా చేసుకోవచ్చు. ఈ మేరకు 'మెసెంజర్ లైట్' ద్వారా ఈ అవకాశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఫేస్‌బుక్ వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో వీడియో చాట్ అత్యవసరంగా, ముఖ్యమైనదిగా మారిందని, అందుకే ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు ఫేస్‌బుక్ పేర్కొంది. వీడియో చాట్ వల్ల మాట్లాడే ప్రతీ క్షణాన్ని వినియోగదారులు ఆస్వాదించవచ్చని తెలిపింది. గతేడాది మెసెంజర్ ద్వారా 17 బిలియన్ల మంది వీడియో చాట్ చేసినట్టు ఫేస్‌బుక్ పేర్కొంది. 2016తో పోలిస్తే ఇది రెండింతలుగా ఉందని వివరించింది. ప్రస్తుతం అప్‌గ్రేడ్ చేసిన మెసెంజర్ లైట్‌లోనూ కోర్ యాప్‌లో ఉన్న ప్రయోజనాలు ఉంటాయని పేర్కొంది. మెసెంజర్ లైట్‌ను ఫేస్‌బుక్ 2016లో ప్రారంభించింది. దీని ద్వారా టెక్ట్స్ మెసేజ్‌లు, ఫొటోలు, లింక్‌లు, ఆడియో కాల్స్ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ యాప్ సైజు 10 ఎంబి కంటే తక్కువే ఉంటుందని ఫేస్‌బుక్ తెలిపింది. తద్వారా వినియోగదారులు దీనిని అత్యంత సులభంగా ఎనేబుల్ చేసుకోవడం చాలా సులభమని పేర్కొంది.

నాలుగోసారి ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శిగా భయ్యాజి జోషి ఎన్నిక



న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రధాన కార్యదర్శిగా భయ్యాజి జోషి మరోసారి ఎన్నికయ్యారు. మరో మూడేళ్ల వరకు అంటే 2021 వరకు జోషి జనరల్ సెక్రటరీగా కొనసాగుతారని నాగ్‌పూర్‌లో జరిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభలో నిర్ణయించారు. ఈ విషయా న్ని ఆర్‌ఎస్‌ఎస్ తన ట్విటర్‌లో పేర్కొంది. జోషి ఈ బాధ్యతలు చేపట్టడం వరుసగా ఇది నాలుగోసారి. భయ్యాజీ 2009లో తొలిసారిగా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత రెండుసార్లు కూడా జోషీనే ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌గా ఉన్న మోహన్ భగవత్ కూడా గతంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో కెఎస్ సుదర్శన్ చీఫ్‌గా ఉన్నారు. ఈ సారి జోషి స్థానంలో జాయింట్ జనరల్ సెక్రటరీగా ఉన్న దత్తాత్రేయ హోసబాలేను తీసుకుంటారని ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే చివరికి జోషీనే మరోసారి ఎన్నుకున్నారు.

మహారాష్ట్రలో కూలిన హెలికాప్టర్

ముంబయి : మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో తీర ప్రాంత రక్షణ దళానికి చెందిన హెలికాప్టర్ కూలిపోయింది. మురుద్ సమీపంలో హెలికాప్టర్ కూలినట్లు అధికారులు వెల్లడించారు. అయితే హెలికాప్టర్‌లోని వారంతా క్షేమంగా ఉన్నారు. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో నలుగురు ఉండగా ముగ్గురు సురక్షితంగా బయటకు వచ్చారని, ఓ మహిళకు మాత్రం గాయాలైనట్లు అధికారులు తెలిపారు. హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా ప్రమాదం జరినట్లు తెలుస్తోంది. అది గాల్లో ఉన్నప్పుడే సాంకేతిక లోపం తలెత్తినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గౌరీలంకేశ్ కేసులో కీలక మలుపు

బెంగళూరు: ప్రముఖ పాత్రికేయురాలు గౌరీలంకేశ్ హత్యకేసులో ప్రధాన నిందితుడు కేటీ నవీన్ కుమార్‌ను సిట్ కస్టడీలోకి తీసుకున్న విషయం విదితమే. లై డైరెక్టర్ అనుమతుల కోసం ఎదురుచూసిన సిట్ ప్రస్తుతం నిందితుడ్ని తదుపరి విచారణ నిమిత్తం గోవా, బెళగావికి తీసుకుపోనుంది. ఈ కేసులో ఇంకా కొందరి వ్యక్తుల ప్రమేయం ఉన్నందున వారి వివరాలు తెలుసుకునేందుకే అక్కడకి తీసుకెళ్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నవీన్ వారి వివరాలు చెప్పినట్లయితే ఈ కేసు ఓ కొలిక్కి వచ్చినట్లని అధికారులు భావిస్తున్నారు. నవీన్ కుమార్‌కు న్యాయస్థానం ఐదు రోజులపాటు రిమాండ్ విధించింది. హిందూ జన జాగృతికి అనుబంధంగా ఉన్న సనాతన సంస్థతో నిందితుడికి ఇతడికి సంబంధాలున్నాయి. అయితే దీనిపై స్పందించిన నవీన్ కుమార్ కుటుంబం గౌరీ హత్యకేసులో నవీన్‌కు ఎటువంటి సంబంధం లేదనీ అతడు చాలా అమాయకుడనీ, కావాలనే తనని ఈ కేసులో ఇరికించారని ఆరోపిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి కర్నాటక రాష్ట్ర ప్రభు త్వం, సిట్ అధికారులు మరో ప్రకటన జారీ చేశారు. నిందితుల ఆచూ కీ తెలిపిన వారికి రూ.10లక్షల జరిమానా ఇస్తామంటూ ప్రకటించిం ది. వివరాలు తెలిపిన వారి సమాచారం రహస్యంగా ఉంచుతామని తెలిపారు.

యుపిలో బిఎస్‌పికి కాంగ్రెస్ మద్దతు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో రాజ్యసభ స్థానానికి జరిగే ఎన్నికలలో బిఎస్‌పికి కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. బిఎస్‌పి అభ్యర్థి భీంరావు అంబేద్కర్‌కు అనుకూలంగా ఓటు వేయాలని కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ శనివారం జరిపిన సమావేశంలో నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని సిఎల్‌పి నేత అజయ్ సింగ్ లల్లూ విలేకరులకు తెలిపారు. మతతత్వశక్తులకు వ్యతిరేకంగా లౌకిక పార్టీలు ఏకం కావాలని నిర్ణయించామని , ఇందుకు అనుగుణంగానే ఉత్తరప్రదేశ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి బిఎస్‌పి తోడ్పాటు ఉంటుంది. ఇందుకు అనుగుణంగానే ఉత్తరప్రదేశ్‌లో బిఎస్‌పికి కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. దేశంలో ఇప్పుడు ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలలో అత్యధికంగా యుపి నుంచే పది వరకూ జరుగుతాయి. ఈ నెల 23న జరిగే ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ 12తో ముగుస్తుంది. కేరళ నుంచి రాజ్యసభ ఖాళీకి జరిగే పోటీలో జనతాదళ్ యునైటెడ్ శరద్ యాదవ్ వర్గం తరపున పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎంపి వీరేంద్ర కుమార్ పోటీకి దిగుతారు. సిపిఎం అభ్యర్థితో ఆయన తలపడుతారు.

త్రిపురలో చెరిలమ్ ఎన్నికల నుంచి తప్పుకున్న సిపిఎం

అగర్తల: త్రిపురలోని చెరిలమ్ అసెంబ్లీ నియోజక వర్గ ఎన్నికల నుంచి శనివారం తమ అభ్యర్థిని సిపిఎం ఉపసంహరించుకుంది. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి రమేంద్ర నారాయణ్ దేబ్బర్మ అసెంబ్లీ ఎన్నికలకు వారం రోజుల ముందు గుండెపోటుతో మృతి చెందడంతో ఎన్నిక వాయిదా పడింది. మార్చి 12న చెరిలమ్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నియోజక వర్గం నుంచి బిజె పి తరపున డిప్యూటీ సిఎం జిష్ణు దేబ్బర్మ పోటీ చేస్తుండగా ఆయనపై పలాశ్ దేబ్బర్మను సిపిఎం ఎన్నికల బరిలో నిలిపింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం బిజెపి హింసాత్మక ఘటనలకు పాల్పడుతోందని, ఈ ఎన్నికను వాయిదా వేయాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు రాష్ట్ర సిపిఎం కార్యదర్శి బిజన్ ధార్ తెలిపారు. ఎన్నికలు వాయిదా వేయకపోవడంతో తమ అభ్యర్థిని ఉపసంహరించుకున్నామని ఆయన తెలిపారు.

పాక్ రాజకీయాల్లో జెండా పాతేందుకు హాఫీజ్ సయీద్‌కు లైన్ క్లియర్



న్యూఢిల్లీ : ముంబై పేలుళ్ల సూత్రధారి, జమాత్‌ఉద్‌దవా (జెయుడి) చీఫ్ హాఫీజ్ సయీద్ పాక్ రాజకీయాల్లో జెండా పాతేందుకు సిద్ధమయ్యాడు. మిల్లీ ముస్లిం లీగ్ (ఎంఎంఎల్) పేరుతో అతడు స్థాపించిన రాజకీయ పార్టీని రిజిస్ట్రేషన్ చేసేందుకు ఉన్న అడ్డంకులను తొలగించాలంటూ ఇస్లామాబాద్ హైకోర్టు పాక్ ఎలక్షన్ కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఎంఎంఎల్‌ను రిజిస్టర్ చేసేందుకు ఎన్నికల కమిషన్ నిరాకరించడంతో హాఫీజ్ ఇస్లామాబాద్ హైకోర్టును ఆశ్రయించాడు. కేసును విచారించిన కోర్టు ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని పక్కన పెడుతూ ఎంఎంఎల్‌ను రిజిస్టర్ చేయాలని ఆదేశించింది. పాక్‌లోని తాజా పరిణామాలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ మాట్లాడుతూ పాక్ తన కుటిలబుద్ధిని, రెండు నాల్కల ధోరణిని మరోమారు బయటపెట్టిందని అన్నారు. పాక్ గడ్డపై నుంచి పుట్టుకొస్తున్న ఉగ్రవాదులపై ఉదాసీనంగా ప్రవర్తించడమే కాకుండా, వారిని రాజకీయాల్లోకి తీసుకురావాలని చూస్తోందని ఆరోపించారు. ఆయనను రాజకీయ స్రవంతిలోకి తీసుకురావడం ద్వారా ఆయన చర్యలకు మరింత భద్రత కల్పిస్తున్నట్టుగా అనిపిస్తోందని ఆరోపించారు. దీనిని 'షాకింగ్ డెవలప్‌మెంట్' అని రవీష్ కుమార్ పేర్కొన్నారు. సయీద్‌ను ఐక్యరాజ్య సమితి ఉగ్రవాదిగా గుర్తించిందని పేర్కొన్నారు. ముంబై పేలుళ్ల సూత్రధారి అయిన సయీద్ భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది అమాయక పౌరులను పొట్టపెట్టుకున్నాడని ఆరోపించారు.

ఫ్రాన్స్‌తో భారత్ 14 ఒప్పందాలు

- ఉగ్రవాదంపై పోరుకు ఇరు దేశాల నిర్ణయం
- 'మేక్ ఇన్ ఇండియా'లో పెట్టుబడులు పెట్టండి : మోడీ



న్యూఢిల్లీ : స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఫ్రాన్స్‌లోనే కాకుండా భారతదేశ రాజ్యాంగంలో లోతుగా వేళ్నూనుకున్నాయని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అన్నారు. ఫ్రాన్స్ ప్రజలు, భారతీయులు ఇరు దేశాల గురించి మరింత తెలుసుకోవాల్సివుందని ఆకాంక్షించారు. మనం రెండు సుస్థిర దేశాల వారసులమన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో శనివారం ద్వైపాక్షిక చర్చల అనంతరం ఆయనతో కలిసి ప్రధాని మోడీ మీడియాతో మాట్లాడారు. ఇరు దేశాల మధ్య 14 ఒప్పందాలు కుదిరాయి. మేక్రాన్‌తో కలిసి మీడియాతో మోడీ మాట్లాడుతూ హిందూ మహాసముద్రంలో విస్తృత సహకారానికి ఉమ్మడి వ్యూహాత్మక స్వప్నం (విజన్) ప్రకటించారు. ప్రజల మధ్య సంబంధాల గురించి మాట్లాడుతూ మైగ్రెంట్ మొబిలిటీ, పార్టనర్‌షిప్‌ను పటిష్టపరిచేందుకు భారతదేశం సిద్ధంగా ఉందన్నారు. భారతదేశం, ఫ్రాన్స్ రక్షణ సహకారంలో నూతన చరిత్రను ఆవిష్కరించే ఒప్పందం కుదరడం హర్షణీయమన్నారు. ఇరు దేశాల యువత ఒకరి దేశం గురించి మరొకరు తెలుసుకోవడం అవసరమని, దీని కోసం తాము రెండు ఒప్పందాలను కుదుర్చుకున్నామని చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్‌ను మోడీ ఆహ్వానించారు. మేక్రాన్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య రక్షణ సహకారానికి కీలక ప్రాధాన్యం ఉందన్నారు. ఉగ్రవాదం, రెచ్చగొట్టి, ప్రేరేపించడం వంటి ముప్పులతో పోరాడాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు తెలిపారు.

దేశాల మధ్య మంచి కెమిస్ట్రీ ఉంది : మేక్రాన్

భారత్ పర్యటనకు విచ్చేసిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ దంపతులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధికారిక స్వాగతం పలికారు. శనివారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి కోవింద్ వారిని స్వాగతించారు. అనంతరం మేక్రాన్ త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మేక్రాన్ మాట్లాడుతూ.. భారత్, ఫ్రాన్స్ మధ్య మంచి కెమిస్ట్రీ ఉందన్నారు. ఈ రెండు ప్రజాస్వామ్య దేశాలు చారిత్రక సత్సంబంధాలను కలిగిఉన్నాయన్నారు. ఆ తర్వాత మేక్రాన్ దంపతులు రాజ్‌ఘాట్ చేరుకుని జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. మేక్రాన్ నాలుగు రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఆర్థిక, రాజకీయ సంబంధాలను బలోపేతం చేసుకునే లక్ష్యంతో ఈ పర్యటన సాగుతుందని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. భారత్‌ఫ్రాన్స్ దేశాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సౌర కూటమి(ఐఎస్‌ఎ) ఆవిర్భావ సదస్సుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఢిల్లీ వేదికగా ఈ నెల 11న ఈ సదస్సు జరగనుంది. ఇందులో మొత్తం 23 దేశాల అధినేతలు, ప్రతినిధులు పాల్గొనబోతున్నారు.

మహారాష్ట్రలో అన్నదాతల నిరసన యాత్ర

భివాండికి చేరిన 30వేల మంది రైతులు



భివాండి: మహారాష్ట్రలో అన్నదాతల నిరసన యాత్ర నిర్విరామంగా కొనసాగుతోంది. దాదాపు 30 వేల మంది రైతులు పూర్తిగా రుణ మాఫీ చేయాలని కోరుతూ యాత్ర చేస్తున్నారు. అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ యాత్ర నేడు భివాండికి చేరుకుంది. నిన్న థానేకు చేరుకున్న రైతులు ఈరోజు భివాండి వరకు వెళ్లారు. రుణ మాఫీ, విద్యుత్ బిల్లుల మాఫీతో పాటు మరికొన్ని డిమాండ్లతో రైతులు భారీ సంఖ్యలో నాసిక్ నుంచి నిరసన యాత్రను మార్చి 5న ప్రారంభించారు. వీరు కాలినడకన 180కిలోమీటర్ల దూరం ప్రయాణించి మార్చి 12న ముంబయికి చేరుకోనున్నారు. రైతులు ప్రతి రోజూ దాదాపు 30 కిలోమీటర్ల మేర యాత్ర చేస్తున్నారు. మార్చి 12న ముంబయికి చేరుకుని మహారాష్ట్ర విధాన సభ వద్ద ఆందోళన చేయాలని వెళ్తున్నారు. గత ఏడాది మహారాష్ట్ర ప్రభుత్వం రూ.4వేల కోట్ల రుణాలను మాఫీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళ్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గత జూన్ నుంచి రాష్ట్రంలో దాదాపు 1750 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రాష్ట్ర ప్రభుత్వం సూపర్ హైవేలు, బుల్లెట్ రైళ్ల తదితర అభివృద్ధి పనుల పేరుతో రైతుల భూములను బలవంతంగా తీసుకుంటున్నారని వారు వాపోతున్నారు.

ఉరేసుకుని బుల్లితెర నటి ఆత్మహత్య



కోల్‌కతా : బెంగాల్‌కు చెందిన బుల్లితెర నటి మౌమిత సాహా (23) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె నివాసముంటున్న ప్లాట్‌లో శనివారం ఫ్యాన్‌కు ఉరేసుకుంది. స్థానిక సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు తలుపులు పగలకొట్టి చూడగా మౌమిత విగతజీవై పడివుంది. ఈ ప్లాట్‌కు కొన్ని నెలల కిందటే మౌమిత అద్దెకు వచ్చినట్లు ఓనర్ తెలిపారు. కాగా చనిపోయే ముందు సాహా రాసిన సూసైట్ నోట్ ఒకటి లభ్యమైంది. ఈ విషాద ఘటన కోల్‌కతాలోని రీజెంట్ పార్కు ప్రాంతంలో చోటుచేసుకుంది. తీవ్ర మానసిక ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకుందని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. తీవ్ర ఒత్తిడికి లోనైనట్లు సోషల్ మీడియాలో చివరిసారిగా పోస్ట్ చేసిందని.. ఆమె కాల్ డేటాను పరిశీలిస్తున్నామని పోలీసులు మీడియాకు వివరించారు. మౌమిత ఆత్మహత్య చేసుకోవడానికి అసలు కారణాలేంటి? గత నెలరోజులుగా ఆమె ఎవరెవరికి ఫోన్ చేసింది? తోటి నటులతో ఎవరితో అయినా గొడవ పడిందా? సూసైడ్ నోట్‌లో ఏముంది? ఇలా పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి చూస్తే కాల్ డేటా సేకరించి నిశితంగా పరిశీలిస్తే ఈ కేసు కొలిక్కి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారని సమాచారం.

రాష్ట్రాభివృద్ధికి పాటుపడే వారినే రాజ్యసభకు పంపాలి



మన తెలంగాణ/న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రయోజనాల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడే వారిని మాత్రమే కెసిఆర్ రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం టిఆర్‌ఎస్ పార్టీ తరపున రాజ్యసభలో ఉన్న వారికి రాష్ట్రాభివృద్ధిపై శ్రద్ధ లేదని, వారికి వ్యాపార ప్రయోజనాలే ముఖ్యమని ఆయన ఆరోపించారు. శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడి యా సమావేశంలో ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎన్నికల హామీలు నెరవేర్చడంలో విఫలం అయ్యారని విమర్శించారు. గొప్పలు చెప్పుకోవడం లో ఇద్దరు ముఖ్యమంత్రులు పోటీ పడి చెబుతున్నారని ఎద్దే వా వేశారు. లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు అంటూ.... కాగితాల మీద అగ్రిమెంట్ ఎలా చేసుకుంటారు? అని ప్రశ్నించారు. దేశ వృద్ధి రేటు కంటే, తెలంగాణ వృద్ధి రేటు ఎక్కువ ఎలా ఉంటుందో అర్థం కాదని అన్నారు. తెలంగాణలో రైతు లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కూడా ఎలా చూస్తూ ఉంటారని ప్రశ్నించారు. చావా లేనివి ఈ రెండు తెలుగు ప్రభుత్వాలు, ఎన్నికలలో ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయరని విమర్శించారు. ఉపాధి హామీ కూలి డబ్బులు రావాలన్న కూడా రెండు ప్రభుత్వాలు 4 నెలలు సమయం తీసుకుంటాయని పొంగులేటి ఎద్దేవా చేశారు. రెండు రాష్ట్ర ముఖ్యమంత్రులు పోటీ పడి మరీ నోట్ల రద్దు కి, జిఎస్‌టికి మద్దతు ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకం కాదు, కాని పోలవరం కడితే భద్రాచలం ముంపుకు గురి అయ్యే ప్రమాదం ఉందంటే కూడా కెసిఆర్ మాట్లాడడని విమర్శనాస్త్రాలు సంధించారు. తెలంగాణలో వెనకబడిన జిల్లాలకు నిధులు రావాలి కాని కేంద్రం ఇంత వరకు ఇవ్వలేదని తెలిపారు. విభజన చట్టంలోని హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే..... సుప్రీం కోర్టు లో పిటిషన్ వేసానని తెలిపారు. చాలా రోజుల తర్వాత, కేంద్రప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు పరచలేదని కెటిఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని పొంగులేటి విమర్శలు చేశారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను గాలి కి వదిలేశారని అన్నారు. సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలు చేసింది నా వ్యక్తిగతం కోసం కాదని స్పష్టం చేశారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలు కోసం అందరూ కలసి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

అద్వానీకి అభివాదం చేయని మోడీ

అగర్తలా: గురువు అని దండం పెట్టిన వ్యక్తిని ఇప్పుడు నిండు సభలో అవమానించారు. వేదికపై ఉన్న పలువురు సీనియర్ నేతలకు అభివాదం చేసిన ప్రధాని మోడీ ఇప్పుడు అగ్రనేత అద్వానీని చూసి చూడనట్లుగా వెళ్లడం కలవరం కల్గించింది. త్రిపురలో అనూహ్య రీతిలో భారీ విజయం సాధించి బిజెపి తొలిసారి అధికారంలోకి వచ్చింది. కొత్త సిఎంగా విప్లవ్‌కుమార్ దేవ్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ వచ్చారు. వేదికపై సీనియర్ నేతలు రాజ్‌నాథ్ సింగ్, అద్వానీ, మురళీమనోహర్ జోషీ, పార్టీ అధ్యక్షులు అమిత్ షా ఉన్నారు. మోడీ ఆహ్వానం మేరకు మాజీ సిఎం, కమ్యూనిస్టు యోధుడు మాణిక్ సర్కారు కూడా సభకు వచ్చారు. ప్రధాని మోడీ వేదికపైకి వచ్చి అక్కడున్న వారందరికి చేతులు జోడిస్తూ పలకరిస్తూ వెళ్లారు. అయితే అద్వానీ వద్దకు చేరుకున్న దశలో మోడీ కనీసం ఆయన వైపు చూడకుండా, అభివాదం చేయకుండా వెళ్లిపోయారు. ఈ ఫోటోలు అన్ని ఇప్పుడు నెట్‌లో ప్రచారం పొందడంతో బిజెపిలో అద్వానీ వంటి సీనియర్ నేతలకు ప్రధాని మోడీ ఇచ్చే గౌరవం ఇదేనా ? అనే ప్రశ్న ఉదయించింది. లేచి నిలబడి, చేతులు జోడించి ఉన్న కురువృద్ధ నేత అద్వానీ తనను మోడీ పలకరిస్తాడనే ఆశతో చూస్తున్నట్లుగా ఉండటం, ఆయనను మోడీ చూసిచూడనట్లుగా చూసి అసహనంగా కదలడం దేశవ్యాప్తంగా సైట్‌ల ద్వారా సంచలనానికి దారితీసింది.

తుపాకీతో కాల్చుకుని ఇద్దరు ఎఎస్‌ఐల ఆత్మహత్య

న్యూఢిల్లీ: ఢిల్లీలోని చాణక్యపురి, సివిల్ లైన్స్‌లలో జరిగిన వేర్వేరు ఘటనల్లో తుపాకీతో కాల్చుకుని ఇద్దరు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఆత్మహత్యకు పాల్పడ్డారు. శనివారం ఉదయం మూడో బెటాలియన్‌కు చెందిన టిపి అనిరుధ్ (52) తన కుడి కణితికి తుపాకీ గాయం ఉన్నట్లు అధికారులు తెలిపారు. అతని సర్వీస్ పిస్టోల్, మోటార్ బైక్, హెల్మెట్ ఆయన మృతదేహం దగ్గర పడిపోయింది. ఆయన ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందో కుటుంబ సభ్యులకు సైతం తెలియదు. ఘటనా స్థలంలో ఎలాంటి లేఖ లభించలేదని పోలీసులు తెలిపారు. మరో ఘటనలో ఢిల్లీ పోలీస్ కంట్రోల్ రూంలో విధులు నిర్వహిస్తున్న హనుమాన్ సామే (52), తలపైన కాల్చుకుని మృతి చెందారని పోలీసులు తెలిపారు. మానసిక ఒత్తిడితో బాధపడుతున్న సామే గత నాలుగైదు ఏళ్లుగా ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చికత్స పొందుతున్నారు.

'మాండరిన్' అభ్యాసంలో భారత ఆర్మీ

చైనా గుండెల్లో దడ



న్యూఢిల్లీ: భారత సైనికులు చైనా భాష 'మాండరిన్' నేర్చుకోవాలని నిర్ణయించడంతో డ్రాగన్‌కు దడపట్టుకుంది. తమ భాషపై పట్టుసాధిస్తే.. అది వారికి అదనపు బలంగా పరిణమిస్తుందని చైనా ఆందోళన చెందుతోంది. భవిష్యత్‌లో వివాదాలు తలెత్తినప్పుడు ఇది వ్యూహాత్మక ప్రయోజనంగా ఉండగలదని చైనా నిపుణులు భావిస్తున్నారు. చైనా భాష నేర్చుకునేలా భారత ఆర్మీ ఇప్పటికే ఒక ఏడాది కోర్సుకోసం ఓ బృందాన్ని సిద్ధం చేసినట్టు గత నెలలో వార్తలు వచ్చాయి. ఐటిబిపి జవానులు, అధికారులతో కూడిన 25 మంది బృందానికి... మధ్యప్రదేశ్‌లోని సాంచి యూనివర్సిటీ ఆఫ్ బుద్ధిస్ట్ ఇండిక్ స్టడీస్‌లో చైనా భాష నేర్పించనున్నట్టు పిటిఐ పేర్కొంది. సరిహద్దు ప్రాంతాల్లో అపార్థాలకు తావులేకుండా ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని భారత్ చెబుతుండగా... చైనా భద్రతా నిపుణులు మాత్రం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపార్థాలు తొలిపోతాయన్న దానితో ఏకీభవించినప్పటికీ... ముందు ముందు చిన్నపాటి గొడవలు కూడా తలెత్తే అవకాశాలున్నాయని వాదిస్తున్నారు. చైనా అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్స్‌తో అక్కడి భద్రతా నిపుణుడు హు జియోంగ్ మాట్లాడుతూ... ''భాషా సామర్థ్యం అనేది మంచి సంభాషణకు ఉపయోగపడుతుంది. అయితే అది శాంతిగా ఉన్నప్పుడు మాత్రమే. యుద్ధ పరిస్థితి తలెత్తితే అదే భారత ఆర్మీకి ఆయుధంగా మారుతుంది...'' అని పేర్కొన్నారు. యుద్ధ సమయంలో చైనా వ్యూహ రచనపై భారత సైనికులు సరిగ్గా అవగాహనకు వస్తే ఇక వారిని ఆపడం కష్టమనీ... అదే జరిగితే వారు సరికొత్త వ్యూహంతో పాటు మరింత దూకుడు ప్రదర్శించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇక చైనా మిలటరీ నిపుణుడు సాంగ్ జోంగ్‌పింగ్ మరో అడుగు ముందుకేశారు. ఏదైనా వివాదం తలెత్తినా, సంభాషణలు విని చైనా కదలికలను పసిగట్టినా... సరిహద్దు ప్రాంతాలను భారత్ తన నియంత్రణలోకి తెచ్చుకోగలదని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు.. చైనా సైనికులు కూడా హిందీ నేర్చుకోవాలంటూ గతంలో కూడా పలువురు సూచించారు. ప్రస్తుతానికి చైనాభారత్ సరిహద్దుల్లో ఎలాంటి ఉద్రిక్తతా లేకపోయినప్పటికీ... గతేడాది చోటు చేసుకున్న 'డోక్లాం ప్రతిష్టంభన' ప్రభావం ఇప్పటికీ డ్రాగన్ మదిలో మెదులుతూనే ఉంది.

మత మార్పిడితోనే వివాదం : హదియా

కొజికోడ్ : తాను ఇస్లాం మతం తీసుకోవడం వల్లనే వివాదం చెలరేగిందని కేరళ యువతి హదియా తెలిపారు. 24 ఏళ్ల ఈ యువతి అఖిల ముస్లింగా మారి ముస్లిం యువకుడు షెఫిన్ జెహాన్‌ను పెళ్లాడింది. దీనిని తల్లిదండ్రులు వ్యతిరేకించారు. ఇది జిహాద్ ఘటన అని విమర్శలు తలెత్తాయి. ఈ దశలో సుప్రీంకోర్టు వరకూ వ్యాజ్యం వెళ్లడంతో కేరళ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆమె వివాహం ఆమె ఇష్టానికి సంబంధించిన విషయం అని, ఆమె భర్త వద్దకు వెళ్లవచ్చునని రూలింగ్ ఇచ్చింది. తీర్పు తరువాత భర్తను చూసేందుకు కేరళలోని కొజికోడ్‌కు ఈ యువతి వచ్చింది. ఈ సందర్భంగా విలేకరులు ఆమెను పలకరించగా తన బాధ తెలియచేసుకుంది. మొత్తం వివాదానికి మూలం తాను ఇస్లాం మతం తీసుకోవడమే అని చెప్పారు. సుప్రీం అంతకు ముందు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు సేలం విద్యాసంస్థ ప్రిన్సిపాల్ సంరక్షణలో ఆమె ఉంటోంది. 2016 జనవరిలో ఈ యువతి మతం మార్చుకుంది. మతం మార్చుకోవడం వెనుక ఎవరి బలవంతం లేదని, తనకు తా నుగా ఈ నిర్ణయం తీసుకున్నానని, మతాన్ని ఎంచుకునే స్వేచ్ఛను రాజ్యాంగం అందరికీ కల్పించిందని , అయితే దీనికి విరుద్ధంగా ఇప్పుడు తన ఇష్టాన్ని కాదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మన తెలంగాణ
11 | హైదరాబాద్ | ఆదివారం | 11, మార్చి 2018
www.manatelangana.news



శ్రీలంక ఘటనలపై దర్యాప్తు.. కర్ఫ్యూ ఎత్తివేత

కొలంబో: మధ్య శ్రీలంకలో ముస్లిం లపై దాడుల ఘటనలపై దర్యాప్తునకు ఆదేశించారు. ఈ ప్రాంతంలో ముస్లిం వ్యతిరేక ఘటనలు చెలరేగిన హింసా కాండ అదు పు తప్పడంతో ప్రెసిడెంట్ మైత్రిపాల సిరిసేన దేశంలో అత్యయిక స్థితిని విధించారు.శాంతి భద్రత పరిస్థితి దిగజార దానికి కారణాలను తెలుసుకునేందుకు ముగ్గు రురిటైర్డ్ జడ్జిలతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ప్రకృతి రమణీయతతో ఉండే కాండిలో పరి స్థితిని చక్కది ద్దేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. నాలుగు రోజుల పాటు సాగుతూ వచ్చిన ఘర్షణలలో ముగ్గురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు.200కు పైగా ముస్లింల వ్యాపారస ముదాయాలు దెబ్బతిన్నాయి. ఇళ్లు ధ్వంసం చేశారు.క్రమంగా శాంతియుత పరిస్థితులు నెల కొంటున్నాయి.ఈ ప్రాంతంలో విధించిన కర్ఫ్యూను ఎత్తివేయాలని అధికారులు నిర్ణయించారు. శ్రీలంకలో పరిస్థితి అదుపులోకి ఇంకా రాక ముందే దేశాధ్యక్షులు మైత్రిపాల సిరిసేన శనివారం భారతదేశ పర్యటనకు బయలుదేరారు. కాండీ పర్వత జిల్లాలో మత ఘర్షణల తరువాత నాలుగురోజులకు సిరిసేన విదేశీ పర్యటన మొదలయింది.న్యూఢిల్లీలో జరిగిఏ అంతర్జాతీయ సోలా ర్ అలయెన్స్ వ్యవస్థాపక సభ్యుల తొలి సదస్సులో సిరిసేన పాల్గొంటారు. తరువాత జపాన్‌కు వెళ్లుతారు. ప్రమాదంలో ఒక సింహళీయుడు మృతి చెందడం చివరికి కాండీలో ఘర్షణలకు దారితీసింది.

ఉ.కొరియాతో శాంతికి రంగం సిద్ధం

● అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం.. చర్చల తేదీ త్వరలో ఖరారు



వాషింగ్టన్ : ఉత్తర కొరియాతో రాజీ ఒప్పందం కుదిరే దశలో ఉందని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఈ రాజీ ప్రక్రియ కుదిరితే అది ప్రపంచానికి మంచి పరిణామమే అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తర కొరియా నేత కిమ్ జాంగ్ చర్చలకు రావల్సిందని చేసిన ఆహ్వానాన్ని ట్రంప్ మన్నించడం అంతర్జాతీయంగా విస్మయం కలిగించింది. ఒక రోజు క్రితమే తాను కిమ్‌ను కలుసుకునేందుకు సిద్ధం అని ట్రంప్ చెప్పారు. ఈ తరుణంలోనే వాషింగ్టన్ పోస్టు పత్రిక ఈ పరిణామాలపై ప్రత్యేక కథనం వెలువరించింది. సంఘర్షణ పథం వీడి, ఉత్తర కొరియాతో శాంతికి జరిగే చర్చల ఖరారు గురించి వైట్‌హౌజ్ వర్గాలు యత్నిస్తున్నాయని పత్రిక తెలిపింది. వీటని ఎప్పటికప్పుడు ట్రంప్ స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. ఇరువురు నేతల చర్చల తేది వేదిక త్వరలోనే ఖరారు అవుతుందని తెలిపారు. ప్రపంచానికి చాలా కాలంగా ఉత్తర కొరియా, అమెరికా మధ్య ఘర్షణాయుత వాతావరణం ఆందోళనకరంగా మారింది. శాంతి చర్చలకు తాను ఎక్కువగా చొరవ తీసుకోవాలని ట్రంప్ భావిస్తున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయన తమ ట్విట్టర్‌లో కూడా తెలిపారు. చర్చలతో ఉత్తర కొరియా అణు కార్యక్రమాలకు కొంత బ్రేక్ పడితే అది ఖచ్చితంగా ప్రపంచ శాంతికి దారితీస్తుందని ట్రంప్ యోచిస్తున్నారు. ఇది తనకు ప్రయోజనం కల్గిస్తుందని అనుకుంటున్నారు. ఈ అంశంపై ఏ విధమైన ప్రతిష్టంభన ఏర్పడినా అది కేవలం కిమ్‌కు లాభిస్తుందని, ఇదే సమయంలో అమెరికా మిత్రపక్షాలలో చీలికకు దారితీస్తుందని, తనకు చిక్కులు తెచ్చిపెడుతుందని ట్రంప్ ఆందోళన చెందుతున్నారని పత్రిక రాసింది. సముచిత దౌత్యప్రక్రియ దిశలో ట్రంప్ వ్యవహరిస్తున్నారని వాల్ స్ట్రీట్ జర్నల్ విశ్లేషించింది. ప్రోటోకాల్‌ను పక్కకు పెట్టి ట్రంప్ చొరవ తీసుకుంటున్నారని, కిమ్‌తో భేటీకి సిద్ధపడ్డారని తెలిపింది. ప్యాంగ్‌గాంగ్ తమ అణుమౌలిక అంశాలపై స్పష్టత ఇవ్వకముందే, అమెరికా అధికార యంత్రాంగం ప్రతినిధులు ఈ దిశలో వివరణలు తీసుకోక ముందే చర్చలకు ట్రంప్ సమ్మతి తెలిపారని పత్రిక పేర్కొంది. అయితే చర్చలు పెద్దగా ఫలించబోవని ట్రంప్ సన్నిహితులే అపనమ్మకంతో ఉన్నారని న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. అత్యున్నత స్థాయి దౌత్య ముఖాముఖీ చాలా ఇరకాటంలోకి నెడుతుందని, దీని వల్ల ఏ విధమైన పరిణామాలు ఉంటాయనేది తెలియదని విశ్లేషించారు. కిమ్ సందేశం కేవలం దక్షిణ కొరియా ద్వారా ట్రంప్ అందుకున్నారు. ఈ దశలో ట్రంప్ నేరుగా కిమ్ నుంచి వైఖరి తెలుసుకోవల్సి ఉందని పత్రిక అభిప్రాయపడింది. ఉత్తర కొరియా విషయంలో ఇతరత్రా చర్యల దశలో శాంతి చర్యల ప్రక్రియ విపరీత పరిణామాలకు దారితీస్తుందని సెనెట్‌లో సైనిక బలగాల వ్యవహారాల కమిటీ సభ్యులు డన్ సులివన్ తెలిపారు. నెలల నుంచి అన్ని కోణాల స్థాయిలలో అమెరికా ఉత్తరకొరియాపై ఒత్తిడి పెంచింది. అమెరికా కటుతర ఆంక్షలు విధించింది. మరోవైపు ఐరాస నుంచి కూడా అదనపు ఆంక్షల తీర్మానం వెలువడింది. ఈవిధంగానే కాకుండా పటిష్ట సైనిక చర్యకు కూడా మార్గం ఏర్పడింది. ఇక చైనా నుంచి కూడా ఉత్తర కొరియాపై ఒత్తిడి ఆరంభం అయింది. ఈ పరిణామాలు అన్నీ కూడా ఉత్తర కొరియాను దారికి తెచ్చే దిశలోనే ఉన్నాయని అయితే ఇప్పటి ప్రతిపాదనతో పరిస్థితి మొదటికి వస్తుందని అనుమానాలు వ్యక్తం చేశారు.

చైనా అధినేతకు ట్రంప్ వివరణ

ఉత్తర కొరియాతో శాంతి చర్చల అంశంపై ఇప్పటి పరిణామాలను ట్రంప్ శనివారం చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్‌కు తెలిపారు. ట్రంప్ స్వయంగా జిన్‌పింగ్‌కు ఫోన్ చేసి సంప్రదింపులకు అవకాశం ఏర్పడిందని, దీనిపై స్పందించాలని కోరారు. చర్చల వాతావరణం పట్ల ఇరువురు నేతలు హర్షం వ్యక్తం చేశారని వైట్‌హౌజ్ వర్గాలు తెలిపాయి. ఉత్తర కొరియా తన ధోరణిని పూర్తిగా విడనాడే వరకూ ఆంక్షలు సాగుతాయని , మరోవైపు అంతర్జాతీయంగా ఒత్తిడి పెంచాలని ఇరువురు నేతలు భావిస్తున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ఇది ఇలా ఉండగా శాంతి చర్చల ప్రతిపాదన పట్ల ఐరాస ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెర్రెస్ హర్షం వ్యక్తం చేశారు. సరైన నాయకత్వం, దృక్పథ స్థాయిలోనే ఈ పరిణామం చోటుచేసుకుందన్నారు.

తాలిబన్ల దాడిలో 15 మంది మృతి

కాబూల్ : ఆఫ్ఘనిస్థాన్‌లోని పశ్చిమ ఫరాహ్ ప్రాంతంలో తాలిబన్లు సాగించిన దాడిలో కనీసం 15 మంది భద్రతా సిబ్బంది మృతి చెందారు. శనివారం బలా బలూక్ జిల్లాలో ఈ దాడి జరిగిందని ప్రాంతీయ మండలి అధ్యక్షులు ఫరేద్ భక్తవర్ తెలిపారు. దాడులకు దిగింది తామే అని తాలిబన్ల ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ తెలిపారు. దాడి ఘటన తరువాత ముగ్గురు జవాన్లు గల్లంతు అయ్యారని ఫరేద్ వెల్లడించారు. పరస్పర కాల్పుల్లో 30 మంది వరకూ తాలిబన్లను చంపివేసినట్లు నిర్థారించారు. అయితే రక్షణ మంత్రిత్వశాఖ ప్రతినిధి వెలువరించిన ప్రకటనలో దాడిని నిర్థారించారు. కానీ నలుగురు సైనికులు మృతి చెందినట్లు, ముగ్గురు గాయపడినట్లు తెలిపారు.

రాఫెల్ ఒప్పందం మహా కుంభకోణం

న్యూఢిల్లీ : రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పదం మహా కుంభకోణమని, దీని నుంచి నిష్కళంకంగా బయటికి రావాలని నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ సవాల్ చేసింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి టామ్ వడక్కన్ విలేకర్లతో మాట్లాడుతూ యుద్ధ విమానాల కొనుగోలు కోసం ఈజిప్ట, ఖతార్ వంటి దేశాల కన్నా భారతదేశం అత్యధిక ధర చెల్లించిందని, ఇది మోడీ ప్రభుత్వం ఇస్తున్న దానం కాదని అన్నారు. ఈ సొమ్ము ఎక్కడికెళ్ళిందో మోదీ ప్రభుత్వం చెప్పాలన్నారు. ఈ సొమ్ము ఎవరి జేబులోకి వెళ్ళిందని ప్రజలు అడుగుతున్నారన్నారు. తమ పార్టీ ఈ అంశాన్ని మూడు రోజుల నుంచి లేవనెత్తుతున్నప్పటికీ ప్రభుత్వం కనీసం ఒక్క మాట అయినా మాట్లాడటం లేదన్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన 23 డాల్ఫిన్ కళేబరాలు

నాగపట్నం: తమిళనాడులోని నాగపట్నం జిల్లా వేదారణ్యం తీరానికి 23 డాల్ఫిన్ కళేబరాలు కొట్టుకు వచ్చాయి. వీటిలో ఎక్కువ డాల్ఫిన్‌లు సైజు, బరువుతో, బాగా కుళ్లిపోయి ఉన్నట్టు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా యంత్రాంగానికి, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలియజేసినట్టు కొడైకారై ఫారెస్ట్ రేంజర్ అయూబ్ ఖాన్ తెలిపారు. కొడైకారైవేదారణ్యం తీరానికి ఏటా నవంబర్, ఏప్రిల్ మాసాల్లో పెద్దఎత్తున డాల్ఫిన్ కళేబరాలు కొట్టుకువస్తాయని అయూబ్ ఖాన్ తెలిపారు. 'పెయిర్‌ట్రాలింగ్, కొన్ని రకాల వలలతో చేపల వినాశకర విధానాలు అవలంబిస్తుండటంతో డాల్ఫిన్స్ అంతమవుతున్నాయి. ఈ విధానాలను ప్రభుత్వం నిషేధించింది కూడా' అని ఆయన చెప్పారు. గత రెండు నెలల్లో 40 డాల్ఫిన్లు (ప్రస్తుత 23తో కలిసి) నాగపట్నం జిల్లా కోస్తా తీరానికి కొట్టుకొచ్చాయని, డాల్ఫిన్ల మరణానికి ఇతమిత్థమైన కారణాలపై మరింత లోతుగా విశ్లేషణ జరుపుతున్నట్టు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 630 మందిపై కేసులు నమోదు

హైదరాబాద్: నగరంలో ఈ నెల 5 నుంచి 9 వరకు పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 630 మంది వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 630మందిపై కేసులు నమోదు చేసిన్నట్లు అధికారులు తెలిపారు. కాగా, తనిఖీల్లో పట్టుబడిన 630 మందిలో 125 మందికి రెండు రోజుల నుంచి 15 రోజుల వరకు జైలు శిక్ష వేశారు. 33 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేసిన్నట్లు సమాచారం. అంతేగాక రూ.11.80 లక్షల జరిమానా కూడా వసూలు చేశారు. జైలు శిక్ష పడిన వారిని చంచల్‌గూడ కారాగారానికి తరలించారు.

నా కుమారుడికి, సాయిపల్లవికి మధ్య ప్రేమ వ్యవహారం లేదు : గంటా

ఆంధ్రప్రదేశ్ : సోషల్ మీడియా వార్తలపై మంత్రి గంటా శ్రీనివాస్ స్పందించారు. గంటా రవితేజ, హీరోయిన్ సాయి పల్లవిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతుందన్నారు. తన కుమారుడు, సాయి పల్లవికి మధ్య ఎలాంటి ప్రేమ వ్యవహారం లేదని చెప్పారు. ఇలాంటి విషయాలపై సాధారణంగా స్పందించనన్నారు. అవాస్తవమైన విషయాలను నిరాధారమైన ఆరోపణలతో ప్రచారం చేయొద్దని, ఇతరుల జీవితాలపై మచ్చ పడేలా వార్తలు రాయడం తగదని పేర్కొన్నారు.

రాజ్యసభ అభ్యర్థులపై ఎపిలో ఉత్కంఠ

అమరావతి: రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై తెలుగుదేశం పార్టీలో నెల కొన్న ఉత్కంఠ వీడలేదు. నామినేషన్లకు గడువు సమీపిస్తుండటంతో రాజ్యసభకు ఎవర్ని ఎంపిక చేయాలనే అంశంపై కసరత్తు కొనసాగుతోంది. రెండు స్థానాలే ఉండటంతో ఆశావహుల నుంచి డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. దీంతో సిఎం చంద్రబాబుపై ఆశావహులు తమదైన శైలిలో తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారు. ఇప్పటికే చంద్రబాబు సీనియర్ మంత్రులు యనమల రామకృష్ణుడు, కళా వెంకట్రావుతో శనివారం ఒక దఫా చర్చించారు. రేపు మరోసారి పార్టీ నేతలతో చర్చించి తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. రాజ్యసభ సీట్ల కోసం ఆశావాహులు సచివాలయానికి చేరుకుని ఆఖరి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబును సీఎం రమేశ్, బీద మస్తాన్ రావు,వర్ల రామయ్య, మసాల పద్మజ, కంభంపాటి రామ్మోహన్‌రావు కలిశారు. రాజ్యసభ స్థానానికి తమకు అవకాశం కల్పించాలని కోరారు. పుట్టా సుధాకర్ యాదవ్ టిటిడి చైర్మన్ పదవి తనకు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. మంత్రులను వెంటబెట్టుకొని మరీ వెళ్లి సిఎంను ఆశావహులు కలుస్తున్నారు. రేపు సాయంత్రం తర్వాతే అభ్యర్థుల ఖరారయ్యే అవకాశం కనబడుతోంది.

మాది పోరాటం.. వాళ్లది ఆరాటం!

ఎపి ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు



అమరావతి :ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాక కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు.శనివారం ఆయన సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా తాము పోరాటం చేస్తున్నామని.. తాము ఓ పక్క ప్రజల కోసం పోరాడుతుంటే వైసిపి నేతలు బిజెపి నేతల చుట్టూ తిరుగుతున్నారన్నారు. వైసిపికి రాజకీయ లబ్ధి, కేసుల మాఫీపైనే శ్రద్ధ ఉందని విమర్శించారు. వారు తమ రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రాన్ని తాకట్టుపెడుతున్నారని మండిపడ్డారు. తాను ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసినప్పుడు ఎపి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినా, దాన్ని వెంటనే అమలు చేయలేదని..చాలా ఆలస్యం అయిపోయింది కాబట్టి ఇప్పుడు ఇక ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం ఉందని కోరినట్లు వెల్లడించారు. ఆర్థిక లోటుపై కేంద్రం చెప్పే లెక్కలు కాదని.. కాగ్, నీతి ఆయోగ్, ఆర్‌బిఐ తదితర సంస్థలు ఆర్థిక లోటు రూ.14వేల కోట్లు ఉందని చెప్పాయని తెలిపారు.కానీ, కేంద్రం రూ.138 కోట్లు కంటే ఎక్కువ ఉండదని చెప్పడం సమజసంగా లేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలోనూ వైసిపి పార్లమెంట్‌లో నాటకాలాడిందన్నారు. 'వాళ్లు ఎప్పుడూ చిత్తశుద్ధితో పనిచేయలేదు. జగన్ తన కేసుల గురించే పనిచేస్తున్నారు. నిన్న ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఇచ్చిన ప్రకటన చూస్తుంటే వాళ్లు (వైసిపి) బిజెపి చుట్టూ ప్రదక్షిణలు చేసి కేసులు మాఫీ చేసుకోవాలనకుంటున్నారని అర్థం అవుతోందన్నారు.

ఆస్ట్రేలియాకు మినహాయింపు : ట్రంప్

వాషింగ్టన్: అమెరికా విధిస్తున్న దిగుమతి సుంకం నుంచి ఆస్ట్రేలియాకు త్వరలోనే మినహాయింపు ఇవ్వనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇటీవల ట్రంప్ ఇత ర దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్టీల్‌పై 25 శాతం, ఉక్కుపై 10శాతం దిగుమతి సుంకాలను పెంచిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన ఆదేశాలపై ట్రంప్ ఇటీవలే సంతకం చేశారు. అయితే అంతకంటే ముందే ఈ నిబంధన నుంచి కెనడా, మెక్సి కోలకు మిన హాయింపు ఇస్తున్నట్లు తెలిపారు.ఈ సుంకాల నుంచి మిన హాయింపు కావాల ను కుంటే ఆ దేశాలు తమతో చర్చలు జరపాలని పేర్కొన్నారు. అయితే ఇప్పుడు ఆస్ట్రేలియాకు దీని నుంచి మినహాయింపు ఇస్తున్నారు. తాను ఆస్ట్రేలి యా ప్రధాని మాల్కోమ్ టర్న్‌బుల్ తో మాట్లా డానని ట్రంప్ తెలిపారు. టర్న్‌బుల్ కూడా ఒకే విధమైన మిలిటరీ,వాణిజ్య సంబధాలకు కట్టుబడి ఉన్నట్లు చెప్పా రని, తాము భద్రతా పరమైన ఒప్పందంపై సంత కాలు చేయనున్నా మని, దీంతో తమ మిత్ర దేశమైన ఆస్ట్రేలియాపై స్టీలు, ఉక్కుపై దిగుమతులపై సుంకా లు విధించ బోమని ట్రంప్ ట్వీట్ చేశారు. తాను ట్రంప్‌తో మాట్లా డినట్లు టర్న్‌బుల్ కూడా వెల్లడిం చారు. వాణి జ్యం, భద్రత అంశాలపై ట్రంప్‌తో తన సంభాషణ చాలా గొప్పగా సాగిందన్నారు. ఆస్ట్రేలి యా అమె రికాల మధ్య వాణిజ్యం చాలా పార దర్శకంగా, పరస్పరం ఒకే విధంగా ఉంటుందని తెలిపారు. అమెరికా విధించిన కొత్త దిగుమతి సుంకాల నుంచి ఆస్ట్రేలియాకు మినహాయింపు ఇచ్చినం దుకు ధన్యవాదాలు చెప్పారు.

భారతీయులకు తక్కువ ధరకే వీసాలివ్వాలి

యుకె మేధోవర్గం సూచనలు



లండన్: గత రెండేళ్లుగా యుకెకు భారత పర్యాటకుల తాకిడి తగ్గిపోయింది. మరోవైపు బ్రిటన్‌తో పోలిస్తే పక్కనే ఉన్న ఫ్రాన్స్‌కు వెళ్లే భారతీయుల సం ఖ్య పెరుగుతోంది. ఇ లా జరగకుండా భారతీయ పర్యాటకులను ఆకట్టుకోవాలంటే వా రి వీసా ధరల ను తగ్గించాలని సూచిస్తోంది యు కె లోని మేధో వర్గం. ఈమేరకు రాయల్ కామన్‌వెల్త్ సొసైటీ (ఆర్‌సిఎస్) దీనిపై అధ్యయనం చేసి ఈ విధంగా సూచనలు చేసింది. ఆర్‌సిఎస్ విడుదల చేసిన 'బ్రిటన్ అండ్ ఇండియా: బిల్డింగ్ ఎ న్యూ వీసా పార్ట్‌నర్‌షిప్' నివేదిక ప్రకారం..2016లో భారత్ నుంచి 6లక్షల మంది భారత పర్యాటకులు ఫ్రాన్స్‌కు వెళ్లారు. యుకెతో పోలిస్తే ఈ సంఖ్య 1,85,000 ఎక్కువ. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 2016లో యూకేలో భారత పర్యాటకుల సంఖ్య 1.73 శాతం తగ్గగా.. ఫ్రాన్స్‌లో మాత్రం 5.3 శాతం పెరిగింది. అయితే వీసా ధరను తగ్గిస్తే భారత పర్యాటకులను ఆకట్టుకోవచ్చు అని నివేదిక పేర్కొంది. ఇందుకోసం సరికొత్త యుకె ఇండియా వీసా ఒప్పందాన్ని ప్రతిపాదించింది. దీని ప్రకా రం.. ప్రస్తుతమున్న రెండేళ్ల వీసా ధర ను 388 పౌండ్ల నుంచి 89 పౌండ్లకు తగ్గించాలని నివేదిక సూచించింది. ఇలా చేయడం వల్ల వాణిజ్యపరంగా, పర్యాటకపరంగా దేశం మరింత అభివృద్ధి చెందుతుంద ని, అంతేగాక ఇరుదేశాల మధ్య వ్యాపార బంధాలు బలోపేతమవుతాయని మేధోవర్గం అభిప్రాయపడుతోంది.

కాలిఫోర్నియాలో కాల్పులు

ముగ్గురు మహిళల కాల్చివేత
వెటరన్స్ హోంలో దారుణం



కాలిఫోర్నియా : అమెరికాలోని కాలిఫోర్నియాలో ఒక సాయుధుడు కాల్పులు జరపడంతో ముగ్గురు మహిళలు మృతి చెందారు. అక్కడి అతి పెద్ద సైనిక పునరావాస చికిత్స కేంద్రంలో ఈ దారుణం జరిగింది. ఘటన వ్యక్తిగత కక్షలతో జరిగిందా? లేక సామూహిక ఉన్మాద కాల్పుల ఘటనా? అనేది వెల్లడికాలేదు.శనివారం సాయుధుడు ఈ వెటరన్ హోంలోకి చొరబడి అందరినీ బెదిరించి, ముగ్గురు మహిళలను బందీలుగా చేసుకున్నాడు. విష యం తెలియడంతో అక్కడికి చేరుకున్న పోలీసులకు, దుండగుడికి మధ్య భీకర కాల్పులు జరిగాయి. తరువాత హోంలోపలికి వెళ్లి చూడగా అక్కడ ముగ్గురు మహిళలు మృతి చెంది పడి ఉండటం, దుండగుడు కూడా శవంగా ఉండటంతో పోలీసులు కంగుతిన్నారు. వారిని కాల్చిచంపిన తరువాత ఈ సాయుధుడు తనను తాను కాల్చుకుని ఉంటాడని భావిస్తున్నారు. ఈ వ్యక్తులనే సాయుధుడు ఎందుకు లక్ష్యంగా చేసుకున్నాడు? వారినే ఎందుకు చంపివేశాడనేది తెలియలేదు. దుండగుడి వివరాలను రాబట్టేందుకు పోలీసులు యత్నిస్తున్నారు.పలు యుద్ధాలలో పాల్గొన్న సైనికులు మానసిక ఒత్తిళ్లకు గురి అవుతున్నప్పు డు పాత్‌వే హోంలో వారికి మానసిక చికిత్స ఇస్తుంటారు. అక్కడనే ఈ ఘటన జరిగింది. అమెరికాలో ఈ విధమైన సైనిక మానసిక చికిత్స నిలయాలలో ఇదే పెద్దది.దీనిని 1984లో ప్రారంభించారు.ఇందులో వృద్ధు లు, వికలాంగులు దాదాపు వెయ్యి మంది వరకూ ఉంటున్నారు. వారికి ఇక్కడ మానసిక చికిత్స ప్రక్రియ సాగుతోందని వెటరన్స్ వ్యవహారాల విభాగం తెలిపింది.దాడికి గురయిన ముగ్గురు మహిళలు ఇందులో పనిచేసే వారని వెల్లడైంది. రెండో ప్రపంచయుద్ధం,కొరియా, వియత్నాం, ఇరాక్ ఇతర యుద్ధ సైనిక చర్యలలో పాల్గొన్నవారు, తరచూ యుద్ధ సంబంధిత మానసిక ఒత్తిడికి గురి అయ్యేవారు ఇందులో మానసిక చికిత్స కోసం చేరుతుంటారు. వీరి ఆలనాపాలనా చూసుకోవడంలో సంబంధిత విభా గం నిమగ్నం అయింది. ఇక్కడి చికిత్సలో భాగంగా సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. వినోదాత్మక ప్రో గ్రాంలు రూపొందిస్తారు. 1200 సీట్లతో థియేటర్, గోల్ఫ్ కోర్స్, బేస్‌బాల్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్స్ వంటి సదుపాయాలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఈ సైనిక మానసిక రోగులకు ఉత్సాహం కల్పిస్తూ, వారిని మామూలు మనుష్యులుగా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తారు.సరికొత్త జీవితం కోసం ఇందులోకి వచ్చి చేరే వేలాది మంది ఉద్యోగులకు ఇప్పుడు జరిగిన ఘటన షాక్‌గా మారింది. కాల్పుల ఘటనతో ఈ పునరావాస కేంద్రం తల్లడిల్లింది. సాయుధుడు ఈ పాత్‌వే హోం సభ్యుడు అని తెలిసిందని స్థానిక సెనెటర్ వెల్లడించారు. ఈ విశాలమైన ఆవరణలో ఆయన పనిచేసే వాడని కూడా తెలిపారు. మహిళలను బందీలుగా చేసుకున్న వ్యక్తితో మాట్లాడేందు కు స్థానిక పోలీసులు చాలా సేపు యత్నించారు. అయితే ఆ వ్యక్తి దారిలోకి రాలేదు. దీనితో కాల్పులు జరిపారు. ఈ హోం మొత్తం ఆవరణ చుట్టూ భారీ స్థాయి బందోబస్తు ఉం టుంది. లోపలనే వెటరన్స్ గదులు, సిబ్బంది వారి నివాసాలు ఉంటాయి.అందరి కదలికలను గమనిస్తూ ఉం టారు. ఈ హోం నుంచి ఒక వ్యక్తి ఇంటికి వెళ్లిపోతున్నసందర్భంగా ఏర్పాటు అయిన పార్టీ జరుగుతుండగా సాయుధుడు లోపలికి చొరబడి ఉంటాడని అనుమానిస్తున్నారు.

భారత్ రొయ్యలపై అమెరికాలో పన్ను పెంపు



వాష్టింగ్టన్ : భారత్ నుంచి ఎగుమతి అయ్యే రొయ్యలపై ఉన్న పన్నును అమెరికా మూడురెట్లు పెంచింది. ప్రస్తుతం 0.84 శాతం పన్ను చెల్లిస్తుండగా దానిని 2.34 శాతానికి పెంచింది. దీనిపై అమెరికాకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ (డిఓసి)వివరణ ఇస్తూ 2016 ఫిబ్రవరి నుంచి 2017 జనవరి వరకు తాము భారత్ నుంచి వచ్చే ఉష్ణ జలాల రొయ్యల దిగుమతిని పరిశీలించినట్లు పేర్కొంది. భారత్ నుంచి వచ్చే రొయ్యలను అమెరికాలో సాధారణ ధర కన్నా తక్కువకు విక్రయిస్తున్నట్లు తేలినట్లు పేర్కొంది. దీంతో వీటికి యాంటీ డంపింగ్ చట్టాలు వర్తింప జేసింది. ఫలితంగా వీటిపై పన్నును పెంచారు. ఈ మేరకు కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ సంస్థకు ఆదేశాలను జారీ చేసింది. దీనిపై ఎవరైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని డిఓసి పేర్కొంది. ప్రస్తుతం పరిశీలన నిమిత్తం ఈ పన్నును విధించారు. ఈ నిర్ణయ ఫలితాలను పరిశీలించి తర్వాత పూర్తి స్థాయి పన్ను అమలు చేస్తారు. భారత్ నుంచి రాయితీపై రొయ్యలను భారీగా అమెరికాకు తరలిస్తున్నారని సెనెటర్లు ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు. రొయ్యలను సీఫుడ్ ఇంపోర్ట్ మానిటరింగ్ ప్రోగ్రాం కిందకు తీసుకురావాలని 12 మంది సెనేటర్లు కోరారు. దీంతో అమెరికా రొయ్యల పరిశ్రమ ప్రమాణాలను భారత్ ఎగుమతి దారులు అందుకోవాల్సి ఉంటుంది.

నేనైతేనా నోట్ల రద్దు ఫైలు చెత్తబుట్ట పాలు

సింగపూర్ భారతీయులతో రాహుల్



కౌలాలంపూర్ : తానే ప్రధానిని అయి ఉంటే పెద్దనోట్ల రద్దు ప్రతిపాదనను చెత్తబుట్టలో పడేసి ఉండేవాడినని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలో పెద్ద నోట్ల రద్దు నిర్ణయం సరైనది కాదని, దీని వల్ల తీవ్రస్థాయి ఆర్థిక పరిణామాలు తలెత్తాయని చెప్పారు.ఆగ్నేయాసియా దేశా ల పర్యటనలో ఉన్న రాహుల్ ఆదివారం సింగపూర్‌లో పర్యటించారు. భారతీయ సం తతికి చెందిన వారితో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు అత్యంత ఉత్సాహంతో భారతదేశంలో పరిణామాలు, ప్రభుత్వ చర్యలపై ప్రశ్నలు సంధించారు.పెద్ద నోట్ల రద్దు అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు తానైతే ఈ పనిచేసి ఉండేవాడిని కానని,రద్దు చేయాలనే ప్రతిపాదన వస్తే ఆ కాగితాలను ముక్కలు చేసి చెత్తబుట్టలో వేసి ఉండేవాడినని స్పష్టం చేశారు. తప్పుడు నిర్ణయాల ఫైళ్లను విసిరిపారేయాల్సిందే అన్నా రు. పెద్ద నోట్ల రద్దుపై తన వైఖరి వేరే విధంగా ఉండేదని, ఆ ఫైలును ఆఫీసు కిటికీ నుంచి బయటకు విసిరిపారేసి ఉండేవాడినని రాహుల్ జవాబు చెప్పడం, సభికులతో ముచ్చటించడం వంటి ఫోటోలను కాంగ్రె స్ పార్టీ ట్విట్టర్‌లో పొందుపర్చారు. మహిళలు అబలలు కాదని, ఆ మా టకొస్తే మగవారికి వారు తీసిపోరని అంతేకాదు వారి కన్నా నాలుగు అడుగులు ముందే ఉంటారని రాహుల్ చెప్పారు. అయితే అన్ని దేశాలలోనూ మహిళల పట్ల వివక్షత ఉందని, ఇది సరికాదని అన్నారు. సమానత కాదు దానికి మించి మహిళలకు అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. కౌలాలంపూర్‌లోని ఐవైసిఓఎన్‌లో యువవృత్తి నిపుణులతో రాహుల్ ముచ్చటించారు. కాంగ్రెస్‌పార్టీ ఓవర్సీస్ విభాగం రాహుల్ పర్యటనను ఖరారు చేసింది. ఈ విభాగానికి టెక్నోక్రాట్ సామ్ పిట్రోడా నాయకత్వం వహిస్తున్నారు. ఇండియాలో ఐటి వెల్లువ సాధనలో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీకి పిట్రోడా సహకరించారు. సింగపూర్ తరువాత రాహుల్ దుబాయ్, కెనడాలలో కూడా పర్యటిస్తారు. మలేసియా ఇండియన్ కాంగ్రెస్ (ఎంఐసి) అధ్యక్షులు సుబ్రమణ్యం సదాశివంతో కూడిన ఫోటోలను రాహుల్ ఫేసుబుక్‌లో పోస్టు చేశారు. మలేసియా స్వాతంత్ర్య సాధనలో ఎంఐసి కీలక పాత్ర పోషించిందని, ఇండియన్ కాంగ్రెస్‌కు చాలా కాలం ఇది అనుబంధంగా ఉందని రాహుల్ వివరించారు.

నేడు గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్ ఉప ఎన్నిక

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గాల ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. ఎన్నికల ఫలితాలను ఈనెల 14న ప్రకటిస్తారు. ఫుల్‌పూర్ నియోజవర్గంలో 19.61లక్షల మంది ఓటర్లు ఉండగా, గోరఖ్‌పూర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో 19.49 లక్షల మంది ఓటర్లున్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఈ రెండు లోక్‌సభ నియోజకవర్గాలతో పాటు గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి స్వీప్ చేసింది. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టడంతో ఆయన నియోజకవర్గమైన గోరఖ్‌పూర్‌కు ఉప ఎన్నిక అనివార్యమైంది. ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఫుల్‌పూర్ నియోజకవర్గాన్ని వదులుకోవడంతో అక్కడ కూడా ఉపఎన్నిక అనివార్యమైంది. ఫుల్‌పూర్‌లో బిజెపి అభ్యర్థిగా కౌశలేంద్ర సింగ్‌పటేల్,గోరఖ్‌పూర్ నుంచి ఉపేంద్ర దత్ శుక్లా పోటీ చేస్తున్నారు. సమాజ్‌వాదీ పార్టీ తరఫున ప్రవీణ్ నిషద్,నాగేంద్ర ప్రతాప్ సింగ్, కాంగ్రెస్ అభ్యర్థులుగాసురీతా కరీమ్, మనీష్ మిశ్రా పోటీ చేస్తున్నారు. గోరఖ్‌పూ ర్ నుంచి మొత్తం 10 మంది, ఫుల్‌పూర్ నుంచి 22 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

కాగా, గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్ సీట్లు తిరిగి తమ కైవసం చేసుకోవాలని ముఖ్యమంత్రి పట్టుదలగా ప్రచారం సాగించారు. మరోవైపు ఈ రెండు నియోజకవర్గాల్లో బిజెపిని ఓడించడమే లక్ష్యంగా బరిలోకి దిగిన సమాజ్‌వాదీ పార్టీకి బిఎస్‌పి మద్దతు లభించింది. సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థికే తమ మద్దతని ప్రకటించడంతో పాటు ఆ పార్టీ అభ్యర్థుల తరఫున బిఎస్‌పి నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం సాగించారు. ఈ రెండు నియోజవర్గాల్లో గెలుపు నల్లేరుమీద నడకేనని బిజెపి చెబుతుండగా, బిజెపిని చిత్తుచేయడం ద్వారా వచ్చే లోక్‌సభ ఎన్నికలకు గట్టి సవాల్ విసరబోతున్నట్టు అఖిలేష్ సారథ్యంలోని సమాజ్‌వాదీ పార్టీ ఢంకా బజాయిస్తోంది. మరి ఓటర్ల తీర్పు ఏమిటనేది ఈనెల 14న తేలనుంది.

పాంటింగ్ సలహాలు తీసుకుంటా: గంభీర్



న్యూఢిల్లీ: ఐపిఎల్ సీజన్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టుకు సారథ్యం వహించే అవకాశం దక్కడంపై గౌతం గంభీర్ ఆనందం వ్యక్తం చేశాడు. జట్టు యాజమాన్యం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతాననే ధీమాను వ్యక్తం చేశాడు. ఢిల్లీ జట్టుకు ఆడాలని చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నానని, ఈ సీజన్‌లో ఆ కొరత తీరనుండడం తనను ఎంతో ఆనందానికి గురి చేసిందన్నాడు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జట్టును ముందుకు నడిపించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చాడు. కాగా, ఢిల్లీ జట్టుకు ఆస్ట్రేలియా మాజీ దిగ్గజం రికి పాంటింగ్ ప్రధాన కోచ్‌గా రానుండడం తనకు ఎంతో ఊరటనిచ్చే అంశమన్నాడు. ఆస్ట్రేలియాకు మూడు ప్రపంచకప్‌లు అందించిన ఘనత పాంటింగ్‌కు ఉందన్నాడు. అతని అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగ పడుతుందనే నమ్మకాన్ని గంభీర్ వ్యక్తం చేశాడు. ఈ సీజన్‌లో పాంటింగ్ సలహాలు, సూచనలు జట్టుతో పాటు తనకు ఎంతో అవసరమన్నాడు. పాంటింగ్‌లాంటి దిగ్గజంతో కలిసి పనిచేయాలనే తన కల నెరవేరనుందని ఆనందం వ్యక్తం చేశాడు. కాగా, ఢిల్లీ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడం తనకు లభించిన అరుదైన గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పాడు. జట్టును విజయపథంలో నడిపించేందుకు సర్వం ఒడ్డుతానని గంభీర్ స్పష్టం చేశాడు.

ఛాన్స్ దొరికినా..

సత్తా చాటని యువ క్రికెటర్లు!



మన తెలంగాణ/ క్రీడా విభాగం: ప్రపంచ క్రికెట్‌లో టీమిండియా ఎదురులేని శక్తిగా మారింది. విరాట్ కోహ్లి, భువనేశ్వర్ కుమార్, రోహిత్ శర్మ, యజువేంద్ర చాహల్, శిఖర్ ధావన్, బుమ్రా వంటి మ్యాచ్ విన్నర్లతో భారత్ వరుస విజయాలు సాధిస్తోంది. అయితే భారత్ సాధిస్తున్న విజయాల్లో సీనియర్లదే కీలక పాత్ర. ముఖ్యంగా బ్యాటింగ్ పరంగా చూస్తే జట్టు భారాన్ని మొత్తం కోహ్లినే మోస్తున్నాడని చెప్పడంలో అతిశయోక్తి లేదు. రోహిత్ శర్మ అడపాదడపా తప్ప నిలకడగా రాణించిన ఉదంతాలు చాలా తక్కువే. అయితే కోహ్లి తర్వాత ఒక్క శిఖర్ ధావన్ మాత్రమే నిలకడైన బ్యాటింగ్‌ను కనబరుస్తున్నాడు. ఇక, టీమిండియా శ్రీలంక ముక్కోణపు టోర్నమెంట్‌లో సీనియర్లకు విశ్రాంతి ఇచ్చి యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. రిషబ్ పంత్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కట్ వంటి జూనియర్లకు ఛాన్స్ ఇచ్చింది. అయితే ఇప్పటి వరకు జరిగిన రెండు మ్యాచుల్లో కూడా యువ ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో ఆడలేదనే చెప్పాలి. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో జట్టును స్థానాన్ని పదిలం చేసుకోవాల్సిన యువ ఆటగాళ్లు ఇందులో విఫలమయ్యారనే చెప్పాలి. రెండో టి–20లోనూ రిషబ్ పంత్ విఫలమయ్యాడు. భవిష్యత్తులో ధోని వారసుడిగా పరిగణిస్తున్న రిషబ్ సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకాన్ని వృథా చేశాడనే చెప్పాలి. తొలి మ్యాచ్‌లో వేగంగా ఆడడంలో విఫలమయ్యాడు. అతని వైఫల్యం జట్టును వెంటాడింది. కనీసం మిగిలిన మ్యాచుల్లోనైనా అతను రాణించాల్సిన అవసరం ఎంతైన ఉంది. ఇక, దక్షిణాఫ్రికా సిరీస్‌లో వన్డే, టి–20 జట్టులో చోటు సంపాదించిన మరో యువ ఆటగాడు శ్రేయస్ అయ్యర్ కూడా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యాడు. సిరీస్‌లో చాలా మ్యాచ్‌లు ఆడిన శ్రేయస్ స్థాయికి తగ్గ బ్యాటింగ్‌ను కనబరచ లేక పోయాడు. దీంతో ముక్కోణపు టోర్నీలో జట్టుకు ఎంపిక కూడా కాలేక పోయాడు. ఐపిఎల్‌లో అదరగొడుతున్న అయ్యర్, పంత్‌లు జాతీయ జట్టుకు వచ్చే సరికి ఆ జోరును కొనసాగించడంలో విఫలమవుతున్నారు. మరో యువ ఆటగాడు మనీష్ పాండేది కూడా అదే తీరు. చాలా కాలంగా జట్టులో ఉంటున్నా ఫలితం లేకుండా పోయింది. కీలక సమయంలో వేగంగా ఆడడంలో విఫలమవుతున్నాడు. ముక్కోణపు టోర్నీలో ఆడిన రెండు మ్యాచుల్లోనూ ఆశించిన విధంగా రాణించలేక పోయాడు. అతని వైఫల్యం జట్టును కలవర పెట్టేదే. కేదార్ జాదవ్ కూడా తన స్థాయికి తగ్గ ఆటను కనరచడంలో విఫలమయ్యాడు. ఒకటి రెండు మ్యాచుల్లో తప్ప అతను రాణించిన దాఖలలు లేవనే చెప్పాలి. జట్టులో స్థాయం కోసం విపరీత పోటీ నెలకొన్న ప్రస్తుత తరుణంలో యువ ఆటగాళ్లు వరుస వైఫల్యాలు చవిచూడడం జట్టు యాజమాన్యాన్ని కలవర పాటుకు గురి చేస్తోంది.



బౌలర్లదీ అదే తీరు..

ఇక, బౌలింగ్‌లో కూడా యువ క్రికెటర్లది ఇదే తీరు. జైదేవ్ ఉనద్కట్, శార్దూల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్, హార్దిక్ పాండ్య, విజయ్ శంకర్ తదితరులకు సెలెక్టర్లు పరీక్షించారు. అయితే ఒకటి అర మ్యాచుల్లో తప్ప వీరు రాణించింది లేదు. సిరాజ్ అయితే ఆడిన అన్ని మ్యాచుల్లోనూ విఫలమయ్యాడు. ఉనద్కట్ కూడా ఆశించిన స్థాయిలో రాణించలేక పోతున్నాడు. కొంతకాలంగా యజువేంద్ర చాహల్ కూడా గాడి తప్పాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టి–20 తర్వాత చాహల్ చాలా పేలవంగా బౌలింగ్ చేస్తున్నాడని చెప్పడంలో అతిశయోక్తి లేదు. భారీ పరుగులు ఇచ్చుకోవడమే కాకుండా వికెట్లు తీయడంలో కూడా విఫలమవుతున్నాడు. అతని వైఫల్యం జట్టుకు తీవ్రంగా పరిణమించింది. పొదుపుగా బౌలింగ్ చేయలేక పోతున్నాడు. ప్రత్యర్థి బౌలర్లు అతని బౌలింగ్‌లో స్వేచ్ఛగా పరుగులు దండుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఇక, కుల్దీప్ యాదవ్‌ది అదే తీరు. అతను కూడా వన్డే సిరీస్ తర్వాత లయ తప్పాడు. అతని బౌలింగ్‌తో సఫారీ బ్యాట్స్‌మెన్ ఓ ఆట ఆడుకున్న విషయం తెలిసిందే. ఇక, చాలా కాలంగా జట్టులో ఉంటున్నా హార్దిక్ పాండ్య కూడా స్థాయికి తగ్గ ఆటను కనబరచడం లేదు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అతను విఫలమవుతున్నాడు. తరచు విఫలమవుతున్నా అతన్ని ఎందుకు ఆడిస్తున్నారో ఎవరికి అంతు బట్టకుండా మారింది. ఈ సిరీస్‌లో అతనికి విశ్రాంతి ఇచ్చి సెలెక్టర్లు కాస్త మంచి పనే చేశారని చెప్పాలి. పేరుకే ఆల్‌రౌండర్ కానీ జట్టుకు అండగా నిలిచింది చాలా అరుదుగానే. ఒకటి అర తప్ప హార్దిక్ జట్టును ఆదుకున్నది లేనే లేదు. జూనియర్లు ఇలా ఉంటే సీనియర్లు కూడా విఫలమవుతున్నారు. సురేశ్ రైనా, రోహిత్ శర్మ, దినేష్ కార్తీక్, అజింక్య రహానే తదితరులు కూడా తరచు వైఫల్యాలు చవిచూస్తున్నారు. రైనా శ్రీలంకతో జరుగుతున్న ముక్కోణపు టోర్నీలో ఆశించిన విధంగా రాణించడం లేక పోతున్నాడు. రెండు మ్యాచుల్లో కూడా నిరాశ పరిచాడు. రహానేది కూడా ఇటువంటి పరిస్థితే. దక్షిణాఫ్రికా సిరీస్‌లో రహానె ఘోరంగా విఫలమయ్యాడు. ఇక, అందరికంటే ఎక్కువ నిరాశ పరుస్తుంది రోహిత్ శర్మనే. మూడు ఫార్మాట్‌లలో జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న రోహిత్ ఒకటి రెండు మ్యాచుల్లో తప్ప పెద్దగా రాణించలేక పోయాడు. అతని వైఫల్యం జట్టుకు తీవ్రంగా పరిణమించింది. రానున్న ప్రపంచకప్ నేపథ్యంలో ఇలాంటి పరిస్థితి భారత్‌కు మంచిది కాదని విశ్లేషకులు చెబుతున్నారు.

భారత్‌కు ఐదో స్థానం

సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ



ఇఫో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ టోర్నమెంట్‌లో భారత్ ఐదో స్థానంతో సరిపెట్టుకొంది. శనివారం ఐర్లాండ్‌తో జరిగిన ప్లేఆఫ్ మ్యాచ్‌లో భారత్ 4–1 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో టోర్నీలో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. అంతేగాక చివరి లీగ్‌లో ఐర్లాండ్ చేతిలో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకుంది. ఈ మ్యాచ్‌లో భారత్ ప్రారంభం నుంచే ఆధిపత్యం చెలాయించింది. వరుణ్ కుమార్ ఐదో నిమిషంలోనే గోల్ చేసి భారత్‌కు గోల్ అందించాడు. తర్వాత కూడా భారత్‌కు పలు అవకాశాలు దొరికినా గోల్స్ చేయలేక పోయింది. కానీ, 28వ నిమిషంలో శీలానంద్ లక్రా భారత్‌కు రెండో గోల్ అందించాడు. దీంతో ప్రథమార్ధంలో భారత్ 2–1 ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధం ప్రారంభంలోనే వరుణ్ కుమార్ తన రెండో గోల్‌ను నమోదు చేశాడు. దీంతో భారత్ మరింత పటిష్టస్థితికి చేరింది. మరో ఐదు నిమిషాల తర్వాత గుర్జంత్ సింగ్ భారత్ తరపున నాలుగో గోల్‌ను సాధించాడు. ఇక, ఐర్లాండ్‌కు ఏకైక గోల్‌ను 48వ నిమిషంలో జూలియన్ డేల్ అందించాడు. చివరి వర కు ఆధిపత్యం చెలాయించిన భారత్ 4–1తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

అఫ్గానిస్తాన్‌కు తొలి విజయం



బులవాయో: ప్రపంచకప్ అర్హత పోటీల్లో ఆసియా సంచలనం అఫ్గానిస్థాన్ తొలి విజయాన్ని నమోదు చేసింది. శనివారం జరిగిన గ్రూప్–బి మ్యాచ్‌లో అఫ్గాన్ ఆరు వికెట్ల తేడాతో నేపాల్‌ను ఓడించింది. ఈ అర్మత పోటీల్లో అఫ్గాన్‌కు ఇదే మొదటి విజయం కావడం విశేషం. తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ 194 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ పరాస్ ఖడ్కా పది ఫోర్లు, సిక్స్‌తో 75 పరుగులు చేసి నేపాల్‌ను ఆదుకున్నాడు. మిగతావారిలో ఓపెన ర్ జ్ఞానేంద్ర (23), దిపేంద్ర సింగ్ (32), ఆరిఫ్ షేక్ (23) మాత్రమే రా ణించారు. అఫ్గాన్ బౌలర్లలో మహ్మద్ నబి నాలుగు, కెప్టెన్ రషీద్ ఖాన్ మూ డు, షాపూర్ జర్దాన్ రెండు వికెట్లు పడగొట్టి నేపాల్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ 38.4 ఓవర్లలోనే కేవలం నాలు గు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. నజీబుల్లా జర్దాన్ 3సిక్స్‌లు, మరో 4ఫోర్లతో అజేయంగా 52 పరుగులు చేసి అఫ్గాన్ విజయం లో కీలకపాత్ర పోషించాడు. రహెమత్ షా (46), మహ్మద్ నబి (34), ఓపెనర్లు రషీద్ ఖాన్ (21), జావేద్ (26) తమవంతు పాత్ర పోషించారు.

విండీస్ హ్యాట్రిక్ విజయం



హరారే: వన్డే ప్రపంచకప్ అర్హత మ్యాచుల్లో మాజీ చాంపియన్ విండీస్ వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. శనివారం జరిగిన గ్రూప్–ఎ మ్యాచ్‌లో విండీస్ 52 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. ఈ టోర్నీలో విండీస్‌కు ఇది హ్యాట్రిక్ విజయం కావడం విశేషం. ముందుగా బ్యాటింగ్ చేసిన విండీస్ 257 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ 205 పరుగులకే కుప్పకూలింది. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఐర్లాండ్‌ను విండీస్ బౌలర్లు ప్రారంభం నుంచే కట్టడి చేశారు. ఓపెనర్లు విలియమ్ పోర్టర్‌ఫీల్డ్ (0), పాల్ స్టిర్లింగ్ (18), వన్‌డౌన్‌లో వచ్చిన ఆండ్రూ (9)లను ప్రారంభంలోనే విండీస్ బౌలర్లు పెవిలియన్ పంపించారు. అయితే జోయ్స్, వికెట్ కీపర్ నీల్ ఓబ్రియాన్‌లు నిలకడైన బ్యాటింగ్‌తో వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. ఇద్దరు సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ ముందుకు సాగారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన జోయ్స్ ఏడు ఫోర్లతో 63 పరుగులు చేశాడు. నీల్ ఓబ్రియాన్ 34 పరుగులు సాధించాడు. కెవిన్ ఓబ్రియాన్ ఐదు ఫోర్లతో 38 పరుగులు చేశాడు. అయితే మిగతవారు విఫలం కావడంతో ఐర్లాండ్ ఇన్నింగ్స్ 205 పరుగుల వద్దే ముగిసింది. విండీస్ బౌలర్లలో కీమర్ రోచ్, విలియమ్స్ నాలుగేసి వికెట్లు పడగొట్టారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్‌ను రొమన్ పొవెల్ అద్భుత సెంచరీతో ఆదుకున్నాడు. ఒక దశలో 83 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన విండీస్‌ను కెప్టెన్ హోల్డర్ (54) అండతో పొవెల్ ఆదుకున్నాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన పొవెల్ ఏడు ఫోర్లు, మరో ఏడు సిక్సర్లతో 101 పరుగులు చేశాడు. దీంతో విండీస్ స్కోరు 257 పరుగులకు చేరింది.

జింబాబ్వేకు మూడో గెలుపు..

బులవాయో: హాంకాంగ్‌తో జరిగిన మరో మ్యాచ్‌లో జింబాబ్వే 89 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ప్రపంచకప్ క్వాలిఫయింగ్ పోటీల్లో జింబాబ్వేకు ఇది వరుసగా మూడో విజయం కావడం విశేషం. ముందుగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 263 పరుగులు చేసింది. హామిల్టన్ మసకద్జా అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. ఓపెనర్ జువావో ప్రారంభంలో దూకుడుగా ఆడాడు. చెలరేగి ఆడిన జువావో మూడు సిక్స్‌లు, మరో ఆరు బౌండరీలతో వేగంగా 45 పరుగులు చేశాడు. కాగా, కీలక ఇన్నింగ్స్ ఆడిన సీనియర్ ఆటగాడు మసకద్జా ఏడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 84 పరుగులు చేశాడు. వికెట్ కీపర్ బ్రెండన్ టైలర్ (45), క్రెగ్ ఎర్విన్ (25) తమవంతు పాత్ర పోషించారు. దీంతో జింబాబ్వే స్కోరు 263కి చేరింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్ 174 పరుగులకే కుప్పకూలింది. అన్షుమన్ రథ్ (85) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది. సికందర్ రజా మూడు, విలియమ్స్, జార్విస్ రెండేసి వికెట్లు తీసి హాంకాంగ్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. కాగా, పపు న్యూగయానాతో జరిగిన మరో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ విజయం సాధించింది.

బంగ్లా రికార్డు విజయం

- చెలరేగిన రహీం, రాణించిన దాస్
- కుశాల్, పెరీరా మెరుపులు వృథా, లంకకు అనూహ్య ఓటమి



కొలంబో: ముక్కోణపు టి–20 టోర్నమెంట్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఐదు వికెట్ల తేడాతో ఆతిథ్య శ్రీలంకపై రికార్డు విజయాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ మరో రెండు బంతులు మిగిలివుండగానే ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుని చరిత్ర సృష్టించింది. క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌కు ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్, లిటన్ దాస్ కళ్లు చెదిరే శుభారంభం అందించారు. విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన దాస్ ఐదు సిక్సర్లు, మరో రెండు ఫోర్లతో 43 పరుగులు చేశాడు. తమీమ్ ఆరు బౌండరీలు, ఒక సిక్స్‌తో 47 పరుగులు సాధించాడు. మరోవైపు అసాధారణ బ్యాటింగ్‌ను కనబరిచిన ముష్ఫికర్ రహీం 35 బంతుల్లోనే 4 భారీ సిక్సర్లు, మరో ఐదు ఫోర్లతో 72 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్ మహ్మదుల్లా కూడా వేగంగా 20 పరుగులు చేసి తనవంతు సహకారం అందించాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన లంకను ఓపెనర్ కుశాల్ మెండిస్ అద్భుత ఆరంభాన్ని ఇచ్చాడు. చెలరేగి ఆడిన మెండిస్ ఐదు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 30 బంతుల్లోనే 57 పరుగులు చేశాడు. మరోవైపు కీలక ఇన్నింగ్స్ ఆడిన కుశాల్ పెరీరా 8ఫోర్లు, మరో రెండు సిక్సర్లతో 48 బంతుల్లో 74 పరుగులు సాధించాడు. ఉపుల్ తరంగా 15 బంతుల్లో వేగంగా 32 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో లంక 214 పరుగుల భారీ స్కోరును సాధించింది.

ఇంగ్లాండ్‌దే సిరీస్

చివరి వన్డేలో కివీస్ ఓటమి

క్రిస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను ఇంగ్లాండ్ కైవసం చేసుకుంది. శనివారం జరిగిన చివరి వన్డేలో ఇంగ్లాండ్ ఏడు వికెట్ల తేడాతో కివీస్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3–2తో దక్కించుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన కివీస్ 223 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ 32.4 ఓవర్లలోనే కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ జానీ బైర్‌స్టో విధ్వంసక శతకంతో ఇంగ్లాండ్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్‌కు ఓపెనర్లు బైర్‌స్టో, అలెక్స్ హెల్స్ శుభారంభం అందించారు. ఇద్దరు ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు తీసుకెళ్లారు. హెల్స్ సమన్వయంతో బ్యాటింగ్ చేయగా, బైర్‌స్టో చెలరేగి ఆడాడు. కివీస్ బౌలర్లను హడలెత్తించిన బైర్‌స్టో పరుగుల వరద పారించాడు. అతని ధాటికి స్కోరు వేగంగా పరిగెత్తించింది. విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన బైర్‌స్టో 60 బంతుల్లోనే 9 ఫోర్లు, మరో ఆరు భారీ సిక్సర్లతో 104 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ క్రమంలో తొలి వికెట్‌కు 155 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన హెల్స్ 9 బౌండరీలతో 61 పరుగులు చేశాడు. జోయ్ రూట్ 23 (నాటౌట్), బెన్‌స్టోక్స్ 26 (నాటౌట్) మిగత లాంఛనాన్ని పూర్తి చేశారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్‌ను ఇంగ్లాండ్ బౌలర్లు తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. క్రిస్ వోక్స్, ఆదిల్ రషీద్ మూడేసి వికెట్లు పడగొట్టి ఇంగ్లాండ్‌ను 223 పరుగులకే కూల్చారు. మిఛెల్ సాంట్నర్ (67), హెన్ని నికోలస్(55), ఓపెనర్ గుప్టిల్(47) తప్ప మిగతావారు విఫలమయ్యారు.



డివిలియర్స్ పోరాటం

ఆమ్లా, ఎల్గర్ అర్ధ సెంచరీలు, సౌతాఫ్రికా 263/7



పోర్ట్ ఎలిజబెత్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్‌లో స్వల్ప ఆధిక్యాన్ని సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 243 పరుగులకు ఆలౌటైన విషయం తెలిసిందే. కాగా, తర్వాత మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు శనివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఏడు వికెట్ల నష్టానికి 263 పరుగులు చేసింది. స్టార్ ఆటగాడు ఎబి.డివిలియర్స్ 74(నాటౌట్) ఒంటరి పోరాటం చేస్తున్నాడు. ఒక దశలో రెండు వికెట్ల నష్టానికి 150 పరుగులతో పటిష్టంగా కనిపించిన దక్షిణాఫ్రికాను తర్వాత ఆస్ట్రేలియా బౌలర్లు కట్టడి చేశారు. వరుసగా వికెట్లు తీస్తూ మ్యాచ్‌లో మళ్లీ పైచేయి సాధించారు. కమిన్స్, మిఛెల్ మార్ష్ రెండేసి వికెట్లు తీసి దక్షిణాఫ్రికాను కష్టాల్లోకి నెట్టారు. మరోవైపు సఫారీ జట్టులో ఓపెనర్ ఎల్గర్ ఆరు ఫోర్లతో 57 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. మరోవైపు హాషిం ఆమ్లా కూడా కీలక అర్ధ సెంచరీతో జట్టుకు అండగా నిలిచాడు. మారథాన్ ఇన్నింగ్స్ ఆడిన ఆమ్లా ఆరు బౌండరీలతో 56 పరుగులు చేశాడు. వీరిద్దరూ వెంటవెంటనే ఔట్‌కావడంతో దక్షిణాఫ్రికా కష్టాలు మొదలయ్యాయి. కెప్టెన్ డుప్లెసిస్ (9), వికెట్ కీపర్ డికాక్ (9), బ్రూన్ (1) నిరాశ పరిచారు. ఒకవైపు వికెట్లు పడుతున్నా డివిలియర్స్ పోరాటం కొనసాగించాడు. ఆస్ట్రేలియా బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న డివిలియర్స్ 14 ఫోర్లతో 74 పరుగులు చేసి క్రీజులో ఉన్నాడు. అతనికి ఫిలాండర్ 14 (బ్యాటింగ్) అండగా నిలిచాడు.

రబడాపై రెండు టెస్టుల నిషేధం

క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడిన దక్షిణాఫ్రికా స్పీడ్‌స్టర్ కగిసో రబడాపై ఐసిసి రెండు టెస్టు మ్యాచ్‌ల నిషేధాన్ని విధించింది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో రబడా ప్రత్యర్థి జట్టు కెప్టెన్ స్టీవ్ స్మిత్‌తో దురుసుగా ప్రవర్తించాడు. వివరాల్లోకి వెళితే తొలి ఇన్నింగ్స్‌లో స్మిత్‌ను రబడా ఎల్బీ డబ్ల్యూగా వెనక్కి పంపాడు. ఈ సమయంలో రబడా కావాలని స్మిత్ భుజాన్ని తాకాడు. దీనిపై మైదానంలో ఉన్న ఫీల్డ్ అంపైర్లు మ్యాచ్ రిఫరీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన రిఫరీ రబడా ఉద్దేశ పూర్వకంగానే స్మిత్ భుజాన్ని తాకినట్టు తేలింది. దీంతో రబడా మ్యాచ్ ఫీజులో వంద శాతం కోత విధించడంతో పాటు మూడు డీమెరిట్ పాయింట్లు జత చేశాడు. కాగా, మ్యాచ్ ప్రారంభానికి ముందే రబడా ఖాతాలో ఐదు డీమెరిట్ పాయింట్లు ఉన్నాయి. తాజాగా జత కలిపిన ఐదు పాయింట్లతో దాని సంఖ్య 8కి చేరింది. దీంతో ఐసిసి నిబంధనల ప్రకారం ఏ ఆటగాడి ఖాతాలోనైనా 8 డీమెరిట్ పాయింట్లు జమా అయితే అతనిపై రెండు టెస్టు మ్యాచ్‌ల నిషేధం విధిస్తారు. రబడా విషయంలో ఐసిసి ఈ నిబంధనను పాటించింది. దీంతో ఆస్ట్రేలియాతో జరిగే చివరి రెండు టెస్టుల్లో ఆడకుండా రబడాపై ఐసిసి నిషేధం విధించింది. కాగా, తొలి టెస్టు సందర్భంగా ఆస్ట్రేలియా వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్, దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ డికాక్‌లపై కూడా ఐసిసి క్రమశిక్షణ చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇద్దరు క్రికెటర్లకు మూడేసి డీమెరిట్ పాయింట్లను జమ చేశారు.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.